Dwaraka

ఆదివారం
14•1•2018



నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

హైదరాబాద్

భోగి పండుగ శుభాకాంక్షలు

• వెల.6 రూ. • సంపుటి 7 • సంచిక 218 • పేజీలు : 16 + (24/20/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

రాష్ట్రవ్యాప్తంగా.. కొత్త పాస్ పుస్తకాలు

మార్చి 11న పంపిణీ

రాష్ట్రపతి లేదా ప్రధానిని ఆహ్వానిస్తాం: సీఎం కేసీఆర్

- అదేరోజు నుంచి రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు
- ఎమ్మార్వోలకూ రిజిస్ట్రేషన్ అధికారాలు
- మండల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూశాఖ పర్యవేక్షణలో పారదర్శకంగా కొత్త విధానం
- కోర్ బ్యాంకింగ్ తరహాలో ల్యాండ్ వెబ్‌సైట్ 'ధరణి'
- ప్రక్షాళన తర్వాత స్పష్టంగా తేలిన భూవివరాలు
- త్వరలో రెండోదశ భూరికార్డుల ప్రక్షాళన
- వివాదాల్లో ఉన్న భూముల పరిష్కారానికి త్వరలో నిర్ణయాలు
- రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్‌గా వాకాటి కరుణకు అదనపు బాధ్యతలు
- కొత్త పాస్ పుస్తకాలు, రిజిస్ట్రేషన్ల విధానంపై 8 గంటలపాటు సమీక్షించిన సీఎం కేసీఆర్



శనివారం ప్రగతిభవన్‌లో కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ల విధానంపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా పూర్తి భద్రత కలిగిన ఫీచర్లతో రూపొందించిన సరికొత్త పాస్ పుస్తకాలను మార్చి 11న పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు తావులేకుండా మరింత పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా మండల రెవెన్యూ అధికారులకు స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల అధికారాలను కల్పించాలని నిర్ణయించింది. మార్చి 11నుంచి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలతోపాటు మండల రెవెన్యూ కార్యాలయాలలో కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు కానున్నది. అన్ని గ్రామాలలో ఒకేరోజు (మార్చి 11న) కొత్త పాస్‌పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి లేదా ప్రధానమంత్రిని ఆహ్వానిస్తానని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా తెలంగాణలో సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ప్రక్షాళన

మిగతా 2వ పేజీలో

ఎన్నికల ప్రక్రియ పదిరోజులే

సర్పంచ్‌లకు కార్యనిర్వహణ అధికారాలు ■ వరుసగా రెండు ఎన్నికలకు ఒకేసారి రిజర్వేషన్

'గ్రామ స్వరాజ్యం- పల్లె ప్రగతి' లక్ష్యంగా నూతన పంచాయతీరాజ్ చట్టం.. సీఎం కేసీఆర్‌కు ముసాయిదాను సమర్పించిన మంత్రివర్గ ఉపసంఘం

- ప్రజలకు ప్రత్యేక హక్కులతో సిటిజన్ చార్టర్ రూపకల్పన
- క్రమశిక్షణ చర్యలపై విచారణకు అప్పిలేట్ అథారిటీని నియమించాలని సిఫారసు
- ముగ్గురికి కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- సమావేశానికి హాజరైన సర్పంచ్, వార్డు సభ్యులకు సిట్టింగ్ ఫీజు
- పంట పెట్టుబడి మద్దతు పథకం సిఫారసులను కూడా సీఎం కేసీఆర్‌కు అందజేసిన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంచాయతీ ఎన్నికల్లో ఖర్చులు తగ్గించేలా, ధనప్రవాహానికి అడ్డుకట్టవేసేలా మంత్రివర్గ ఉపసంఘం కీలక సిఫారసులు చేసింది. పంచాయతీ సర్పంచ్‌ల ఎన్నికకు సంబంధించిన మొత్తం ప్రక్రియను కేవలం పదిరోజుల్లో పూర్తిచేయాలని పేర్కొంది. తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గం ఉపసంఘం శనివారం నాడు పలు కీలక సిఫారసులతో కూడిన ముసాయిదాను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అందజేసింది. 'గ్రామ స్వరాజ్యం-పల్లె ప్రగతి' లక్ష్యంగా ముసాయిదా రూపొందించారు. దీనిపై ఇప్పటికే నాలుగుసార్లు చర్చించిన సబ్‌కమిటీ.. శనివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన మరోసారి సమావేశమైంది. సబ్‌కమిటీలో సభ్యులుగా ఉన్న మంత్రులు కే తారకరామారావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎం

మిగతా 6వ పేజీలో



రంగుల పతంగులు ఘుమఘుమల మిఠాయిలు

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో శనివారం ప్రారంభమైన మూడో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌లో వివిధ రంగుల్లో, రూపాల్లో ముచ్చటగొలిపేలా ఎగురుతున్న పతంగులు. ఈ ఉత్సవంలో మిఠాయిల స్టాళ్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి.



ఎంపీటీసీ ఉపఎన్నికల్లో

గులాబీ జయకేతనం

- 16 ఎంపీటీసీ స్థానాల్లో 10 టీఆర్ఎస్ కైవసం
- టీఆర్ఎస్ బలపరిచిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల గెలుపు
- కాంగ్రెస్, బీజేపీలకు చెరో రెండు స్థానాలు
- ఎంపీటీసీ ఫలితాలపై మంత్రుల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మండల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ సత్తాచాటింది. 16 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 10 స్థానాలను కైవసం చేసుకున్నది. రెండు స్థానాల్లో టీఆర్ఎస్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కాగా కాంగ్రెస్, బీజేపీ చెరి రెండు స్థానాలు కైవసం చేసుకున్నాయి. వివిధ కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ అయిన 16 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 11న పోలింగ్ జరిగింది. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ఎలాంటి అవాంఛనీయ

మిగతా 6వ పేజీలో

వీసా మోసాలపై

పీడీ యాక్ట్

- నకిలీ ఏజెంట్లపై కొరడా
- ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోనేందుకు నెల గడువు
- లేకుంటే క్రిమినల్ కేసులు, కార్యాలయాల సీజ్
- విదేశాలకు వెళ్లేవారు టామ్‌కాం సేవలు వినియోగించుకోండి
- మానవ అక్రమరవాణాపై కఠినచర్యలకు సంయుక్త సమన్వయ బృందాలు
- ఎన్నారైశాఖపై సమీక్షలో మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి
- హైదరాబాద్‌లో విదేశీ భవన్‌కు ఫిబ్రవరిలో శంకుస్థాపన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లేవారిని మోసంచేస్తున్న నకిలీ ఏజెంట్లపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తున్నది. పదేపదే వీసా మోసాలకు పాల్పడేవారిపై పీడీయాక్ట్ పెట్టాలని ఐటీ, ఎన్నారైశాఖల మంత్రి కే తారకరామారావు, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. నకిలీ ఏజెంట్లపై కఠినచర్యలు తీసుకొనేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఎన్నారైశాఖపై మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి శనివారం సచివాలయంలో పోలీస్, హోం, ఎన్నారైశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతవారం ఢిల్లీలో విదేశాంగశాఖ ఇచ్చిన సూచనలను రాష్ట్రస్థాయిలో అమలుచేసేందుకు ఈ సమావేశం

మిగతా 2వ పేజీలో

నాణెం మిథ్య.. ధనం మిథ్య!

■ ఆదివారం ప్రత్యేకం

కొద్ది పెట్టుబడితో కోటీశ్వరులు కావొచ్చునట!?

తెలంగాణ, ఏపీల్లో బిట్‌కాయిన్ మానియా

రహస్యంగా నడుస్తున్న ట్యుటోరియల్స్

6





సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దంపతులు

ప్రేమానురాగాలను సంక్రాంతి పెంచాలి



గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాడి పంటల పండుగగా పేరొందిన సంక్రాంతి పండుగకు మన సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం ఉందన్నారు. మన ఘనమైన చరిత్రకు ఈ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ ప్రజల మధ్య ప్రేమానురాగాలను, ఆప్యాయతలను మరింత పెంచాలని గవర్నర్ ఆకాంక్షించారు.

నేటి నుంచి కేటీఆర్ విదేశీ పర్యటన

దక్షిణకొరియా, జపాన్, స్విట్జర్లాండ్‌లను సందర్శించనున్న మంత్రి • పెట్టుబడుల సమీకరణే లక్ష్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఈ నెల 14 నుంచి 27 వరకు విదేశాల్లో పర్యటిస్తారు. ఈ 14 రోజుల్లో ఆయన దక్షిణ కొరియా, జపాన్, స్విట్జర్లాండ్‌లను చుట్టివస్తారు. గ్లోబల్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనడంతోపాటు ఇతర అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు మంత్రి హాజరవుతారు. బహుళజాతి విదేశీసంస్థల నుంచి పెట్టుబడులను సమీకరించడమే లక్ష్యంగా ఆయన పర్యటన కొనసాగుతుంది. జనవరి 15 నుంచి 22 వరకు దక్షిణకొరియా, జపాన్‌లను సందర్శించి.. అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాల్లో పలు విదేశీసంస్థలతో పెట్టుబడుల గురించి చర్చిస్తారు. 23 నుంచి 26 దాకా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే గ్లోబల్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరవుతారు. 27న హైదరాబాద్‌కు తిరిగొస్తారు.

రిజిస్ట్రేషన్‌శాఖ సారథిగా వాకాటి కరుణ

స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ, కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) వాకాటి కరుణకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా ఉన్న వాకాటి కరుణకు స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతవరకు రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీగా అహ్మద్ నదీం ఉన్నారు. ఆయన కార్మిక, ఉపాధి కల్పనాశాఖ కమిషనర్‌గా, పరిశ్రమల శాఖ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయన రిజిస్ట్రేషన్‌శాఖపై పూర్తిగా దృష్టిసారించే సమయం దొరుకడం లేదు. ఎమ్మార్వోలకు కూడా రిజిస్ట్రేషన్ అధికారాలనివ్వాలని ప్రభుత్వం తలపెట్టిన క్రమంలో సీసీఎల్ఏ డైరెక్టర్‌గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించడం విశేషం.

కొత్త పాస్ పుస్తకాలు మార్చి 11న పంపిణీ

మొదటిపేజీ తరువాయి...

పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఉన్న భూమి వివరాలు పూర్తిగా ప్రభుత్వం అందుబాటులోకి వచ్చాయని, దీని ఆధారంగా సమగ్రమైన వివరాలతో రైతుల పాస్‌పుస్తకాలను తయారుచేస్తున్నట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ వివరాలన్నింటినీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు. కోర్‌బ్యాంకింగ్ తరహాలో ల్యాండ్ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తామని వెల్లడించారు. దీనికి 'ధరణి' పేరు ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకమైన కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నామన్నారు. పూర్తిస్థాయి సంస్కరణలతో పటిష్ఠమైన విధానాన్ని మార్చి 11నుంచే అమల్లోకి తెస్తామని ప్రకటించారు. అదేరోజు మండల రెవెన్యూ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. రెవెన్యూశాఖ ఆధీనంలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం సాధించడానికి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా ఉన్న వాకాటి కరుణకే రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ల విధానంలో సంస్కరణలపై శనివారం ప్రగతిభవన్‌లో దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘ సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, శాంతకుమారి, కార్యదర్శి స్మితాసబర్వాల్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, మీ సేవ కమిషనర్ వెంకటేశ్వరరావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ జీఎండీ శ్రీధర్, సీనియర్ మేనేజర్ సుధీర్ గోలి తదితర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర భూ ప్రక్షాళన ద్వారా వచ్చిన ఫలితాలను సమావేశంలో విశ్లేషించారు.



కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ల విధానంలో సంస్కరణలపై శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, శాంతకుమారి, కార్యదర్శి స్మితాసబర్వాల్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, మీ సేవ కమిషనర్ వెంకటేశ్వరరావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ జీఎండీ శ్రీధర్, సీనియర్ మేనేజర్ సుధీర్ గోలి

త్వరలో రెండో దశ ప్రక్షాళన..

రాష్ట్రమంతటా వంద రోజులపాటు నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన మొదటి దశ పూర్తిగా విజయవంతమైందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాదాపు 90శాతానికి పైగా భూముల విషయంలో స్పష్టత వచ్చిందని, ఏ భూమికి ఎవరు యజమాని అనేది తేలిందని పేర్కొన్నారు. ఈ వివరాల ఆధారంగా కొత్త పాస్‌పుస్తకాలను ఇవ్వడంతోపాటు పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు చేస్తామని వెల్లడించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు, అభ్యంతరాలు కలిగిన భూములను రెండోదశ ప్రక్షాళనలో పరిష్కరిస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం కొన్ని విధానపరమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. త్వరలోనే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించి ఈ దిశగా అవసరమైన నిర్ణయాలను తీసుకుంటామని వివరించారు. మొదటి దశ భూ రికార్డుల ప్రక్షాళనలో వ్యవసాయ ఖాతాలు దాదాపు 71 లక్షల వరకు ఉన్నట్లు తేలిందని సీఎం కేసీఆర్ అన్నారు.

కోర్ బ్యాంకింగ్ తరహాలో 'ధరణి'

రాష్ట్రంలోని ప్రతీ ఎకరం వివరాన్ని సమగ్రంగా పొందుపరుస్తూ ఎప్పటికప్పుడు చోటుచేసుకునే మార్పులను కూడా నమోదు చేస్తూ ధరణి అనే వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సీఎం తెలిపారు. కోర్ బ్యాంకింగ్ తరహాలో దీనిని నిర్వహిస్తామన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని చేస్తున్నామని, రిజిస్ట్రేషన్‌తోపాటు పేర్ల మార్పిడి వివరాలు ఏరోజుకారోజు ధరణిలో నమోదవుతాయని వివరించారు. మండల కార్యాలయం నుంచి మొదలుకుని రాష్ట్రస్థాయిలో అన్నిచోట్ల నుంచి వెబ్‌సైట్ నుంచి వివరాలను తీసుకోవచ్చని చెప్పారు. విదేశాల్లో ఉన్నవారు కూడా ధరణి ద్వారా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని వెల్లడించారు.

ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు

రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా ప్రతి మండల రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్రంలో మొత్తం 584 మండలాలకు 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ఈ సబ్‌రిజిస్ట్రార్ల పరిధిని వారి కార్యాలయమున్న మండలానికే పరిమితం చేస్తారు. మిగతా 443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తారు. ఎమ్మార్వోలు తామిచ్చిన అపాయింట్‌మెంట్ తేదీలకు అనుగుణంగా శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహాయించి వారానికి ఐదు రోజులు ఉదయం పూట రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరు కాలేకపోతే, బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగిస్తారు. భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వాహణలో వందకు వంద శాతం పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్ పుస్తకాలను అరికట్టడంలాంటి లక్ష్యాలతో సంస్కరణలు తీసుకొస్తున్నట్లు సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. 'రైతులు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధతప్పాలి. ఒక్కసారే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రావాలి. పాస్‌పుస్తకం ఇంటికే కొరియర్ ద్వారా చేరాలి. అవినీతికి ఆస్కారం లేనివిధంగా రిజిస్ట్రేషన్ల విధానం ఉండాలి. నకిలీ పాస్ పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లను సృష్టించి రుణాలు పొందిన దాఖలాలున్నాయి. ఇకపై అలా సాధ్యం కాదు. భూ రికార్డుల నిర్వాహణను ప్రభుత్వం కట్టుదిట్టంగా చేస్తుంది. అందుకే సంస్కరణలు తీసుకొస్తున్నాం. ప్రతీ విషయం 'ధరణి'లో నమోదవుతుంది' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

తెలంగాణలో భూముల తాజా వివరాలు

- మొత్తం భూమి 1,12,077 చ.కి.మీ. (2.80 కోట్ల ఎకరాలు)
- ప్రక్షాళనలో పరిశీలించినది 2,55,098,091 ఎకరాలు
- వివాద రహిత భూములు 2,38,08,650 ఎకరాలు
- వివాదాలున్న భూములు 17, 89, 595 ఎకరాలు
- వివాదం లేని వ్యవసాయ భూమి 1,42,12,826 ఎకరాలు
- వ్యవసాయేతర భూములు 11,95, 889 ఎకరాలు
- ప్రభుత్వ ఆస్తులు 13,82,384 ఎకరాలు
- అసలుఅసైనీల చేతుల్లో ఉన్నది 20,01,512 ఎకరాలు
- ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి 7,21,694 ఎకరాలు
- వివాదాలు లేని అటవీభూమి 41,74,652 ఎకరాలు
- దేవాదాయ భూములు 74,128 ఎకరాలు
- వక్ఫ్ భూములు 45, 564 ఎకరాలు
- నగరాలు, గ్రామీణ నివాస ప్రాంతాలు 24 లక్షల ఎకరాలు

ప్రతిపాదిత నూతన రిజిస్ట్రేషన్ విధానం

- అమ్మేవారు, కొనేవారు పరస్పర అంగీకారానికి వచ్చిన తర్వాత సబ్‌రిజిస్ట్రార్‌ను అపాయింట్‌మెంట్ అడుగాలి (పాస్‌పోర్టులు, వాహన రిజిస్ట్రేషన్ల మాదిరిగా).
- భూమి అమ్మకానికి సంబంధించిన డాక్యుమెంట్ తయారుచేయడానికి లైసెన్స్‌డ్ డాక్యుమెంట్ రైటర్లను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉంచుతారు. వారు ఫీజు తీసుకుని రాసిన డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. అమ్మేవారు, కొనేవారు తామే స్వయంగా డాక్యుమెంట్ రాసుకున్నా అనుమతిస్తారు. ఫారాలు-టెంప్లేట్లు అందుబాటులో ఉంచుతారు.
- అపాయింట్‌మెంట్ ఇచ్చిన తేదీ, సమయానికి క్రయ, విక్రయదారులు సబ్‌రిజిస్ట్రార్ ఎదుట హాజరుకావాలి.
- బయోమెట్రిక్ విధానం ద్వారా ఇద్దరి వేలిముద్రలు, ఫొటోలు, సంతకాలు తీసుకొంటారు.
- ఎంతభూమి అమ్ముతున్నారో అంత భూమిని అమ్మేవారి పాస్ పుస్తకం నుంచి సబ్‌రిజిస్ట్రార్ తొలిగిస్తారు. అదే సమయంలో కొన్నవారి పాస్ పుస్తకంలో నమోదు చేస్తారు. సబ్‌రిజిస్ట్రార్ ముద్రవేసి, సంతకం చేస్తారు.
- భూమిని కొత్తగా కొన్నవారయితే కొత్త పాస్ పుస్తకం ఇస్తారు.కొనుగోలు వివరాలు నమోదుచేస్తారు..ఇద్దరి పాస్‌పుస్తకాలను అప్పుడే ఎమ్మార్వోకు పంపుతారు.
- సదరు భూమి యజమానిగా.. అమ్మినవారి పేరు తొలిగించి, కొన్నవారి పేరుపై మార్పిడి (మ్యుటేషన్) చేస్తారు.
- ఈ వివరాలన్నింటినీ ఎమ్మార్వో కార్యాలయంలోని భూమి రికార్డుల్లో నమోదు చేస్తారు. తర్వాత ఎమ్మార్వో కార్యాలయంలోని ఐటీ అధికారికి ఈ వివరాలు పంపాలి. ఐటీ అధికారి వెబ్‌సైట్‌లో ఎంటర్ చేస్తారు.
- వెబ్‌సైట్‌లో నమోదైన వివరాలు కొన్నవారికి, అమ్మినవారికి వెంటనే ఎస్సెమ్మెస్ (బ్యాంకుల లావాదేవీల మాదిరిగా) చేరుతాయి.
- పాస్ పుస్తకాలను ఇప్పటిమాదిరిగా ఆర్డీవోకు పంపాల్సిన అవసరం లేదు. పేరు మార్పిడి (మ్యుటేషన్) బాధ్యత పూర్తిగా ఎమ్మార్వోదే.
- పేరు మార్పిడి (మ్యుటేషన్) జరిగిన తర్వాత పాస్‌పుస్తకాలపై ఎమ్మార్వో కార్యాలయం ముద్రవేసి, ఎమ్మార్వో సంతకం చేస్తారు. ఆ పాస్ పుస్తకాలను అదేరోజు తిరిగి సబ్‌రిజిస్ట్రార్‌కు పంపుతారు.
- ఎమ్మార్వో నుంచి తనకు అందిన పాస్‌పుస్తకాలను అమ్మినవారికి, కొన్నవారికి సబ్‌రిజిస్ట్రార్ కొరియర్ ద్వారా పంపుతారు. కొన్న వారికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు పంపుతారు (పాస్‌పోర్టుల మాదిరిగా).
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిస్పాచ్ అయిన వెంటనే ఇద్దరికీ ఎస్సెమ్మెస్ వెళుతుంది.
- రైతులకు ఇచ్చే పాస్ పుస్తకంలో ఖాతా నంబరుతోపాటు పాస్ పుస్తకం యూనిక్ కోడ్, గ్రామం కోడ్, మండలం కోడ్, యజమాని ఆధార్ నంబర్ ఉంటాయి.

ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 5.57 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, త్రయోదశి, నక్షత్రం: జ్యేష్ఠ మ. 1.15 వరకు తదుపరి మూల, అమృత ఘడియలు: తె.3.21 నుంచి 4.57 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.34 నుంచి 5.57 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.29 నుంచి 5.13 వరకు, వర్జ్యం: రాత్రి 10.16 నుంచి 11.52 వరకు.

లోకం పోకడ



గొబ్బెమ్మలు రాలి పడ్తున్నాయ్!



ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు విద్యాసాగర్, రాంబాబునాయక్, నీలాదేవి, దేవయ్య, నర్సింహ తదితరులు శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు.

ఖాళీ సర్పంచ్ స్థానాలకు 29న ఎన్నికలు

17 నుంచి నామినేషన్ల స్వీకరణ • నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలు కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 23 సర్పంచ్, 165 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి ఎన్నికల షెడ్యూల్ విడుదలచేసింది. ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అదేరోజు గ్రామ పంచాయతీ ఓటర్ల వివరాలను ప్రకటిస్తారు. 21న నామినేషన్లను పరిశీలిస్తారు. 24 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. 29న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కించి, వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు 1తో పూర్తికానున్నది. దీంతో ఇప్పుడు జరిగే ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీకాలం కూడా ఆగస్టు 1తోనే ముగుస్తుంది.

వీసా మోసాలపై పీడీయాక్ట్

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ- మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకొనేందుకు ఏజెంట్లకు నెలరోజుల సమయం ఇవ్వనున్నట్టు మంత్రులు తెలిపారు. ఈ గడువులోగా నమోదు చేసుకోనివారందరినీ అక్రమ ఏజెంట్లుగా గుర్తిస్తామని, క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని, కార్యాలయాలు సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలు ఖాతరు చేయకుండా.. పదేపదే వీసా మోసాలకు పాల్పడే నకిలీ ఏజెంట్లపై పీడీయాక్ట్ పెట్టాలని పోలీసులను ఆదేశించారు. నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకునే విషయంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని మంత్రులు విజ్ఞప్తిచేశారు. 'సురక్షితంగా వెళ్లండి, సుశిక్షితులై వెళ్లండి' అనే భారత విదేశాంగశాఖ నినాదానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్‌కాం కంపెనీ ద్వారా చట్టపరంగా విదేశాలకు వెళ్లాలని సూచించారు. దీంతోపాటు రాష్ట్రంలో ఉన్న రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారా వెళ్లాలని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న విదేశీభవన్‌కు ఫిబ్రవరి రెండోవారంలో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తోపాటు ఎన్నారై శాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నారైలు, వలసకార్మికుల కోసం చేపడుతున్న చర్యలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని మంత్రి కేటీఆర్ చెప్పారు. గల్ఫ్‌దేశాలకు జరుగుతున్న మహిళల అక్రమరవాణా, మోసపూరిత వివాహాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసుశాఖ గత కొంతకాలంగా తీసుకొంటున్న చర్యలను అభినందించారు. మానవ అక్రమరవాణాను అరికట్టడంలో మైనార్టీ సంక్షేమశాఖ, కార్మికశాఖ, ఎన్నారైశాఖ, పోలీస్‌శాఖలు ఉమ్మడిగా సంయుక్త సమన్వయ బృందాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. మావన అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు ఇతర రాష్ట్రాల సహకారం తీసుకోవాలని సూచించారు. అక్రమరవాణకు పాల్పడుతున్న ఏజెంట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, పాస్‌పోర్టు కార్యాలయ అధికారుల సహకారం తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్‌త్రివేదితోపాటు ఎన్నారై, పోలీసుశాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.



శనివారం సచివాలయంలో ఎన్నారై శాఖపై సమీక్షిస్తున్న ఆ శాఖ మంత్రి కే తారక రామారావు. చిత్రంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

చిప్పకూడు తిన్నోళ్లా నీతి గురించి మాట్లాడేది?

- నిరంతర కరంటు చూసి కాంగ్రెస్ నేతలకు కడుపుమంట
- వారి ఉనికి ప్రశ్నార్థకమవుతుందనే లేనిపోని ఆరోపణలు
- పంచాయతీరాజ్ చట్టంపై అసెంబ్లీలో చర్చిద్దాం
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం
- మీడియాతో మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అవినీతికి పాల్పడి జైల్లో చిప్పకూడు తిన్నవాళ్లు నీతి వ్యాక్యాలు చెప్పడం విడ్డూరంగా ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఎద్దేవా చేశారు. డబ్బులతో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లివచ్చిన వాళ్లు నీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. అటువంటి నాయకుడి సవాళ్లకు తాము స్పందించాల్సిన అవసరంలేదని చెప్పారు. ప్రభుత్వంపై నిందలు వేసే ప్రతిపక్షాలు నిజంగా ఆధారాలుంటే కోర్టుకు వెళ్లాలని అన్నారు. శనివారం మంత్రి కేటీఆర్ సచివాలయంలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తుంటే ప్రతిపక్షాలు సహించలేకపోతున్నాయని, సాగునీరు, రైతులకు పెట్టుబడి పథకాలు చూసి బెంబేలెత్తుతున్నాయని విమర్శించారు. ఈ పథకాలతో ప్రతిపక్షాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళన వారిలో కనిపిస్తున్నదని చెప్పారు. నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని బట్టి వారిలోని అసహనాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. అసెంబ్లీలో చర్చిద్దామంటే పారిపోతారని, బయట మాత్రం రచ్చచేస్తారని మంత్రి మండిపడ్డారు. వ్యవసాయానికి నిరంతరాయంగా కరంటు సరఫరా చేస్తుండటంతో రైతులు సంతోషంగా ఉంటే, కాంగ్రెస్ నేతలకు కడుపు మండుతున్నదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ స్థిరపడితే ఎప్పటికీ అధికారంలోకి రాలేమన్న భయం కాంగ్రెస్ నేతలను వెంటాడుతున్నదన్నారు. అందుకే ఆ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు, అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన తరువాత తెలంగాణ తీవ్ర విద్యుత్ కొరతను ఎదుర్కొన్నా, కష్టాల్లో ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరంటు ఇవ్వలేదని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఒప్పందాలు చేసుకున్న తరువాత విద్యుత్ ఇస్తామని ఆ రాష్ట్రం ముందుకొస్తే ఏం చేసుకోవాలని ప్రతిపక్షాలను ఆయన ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ముందస్తు ఎన్నికలకు వెళ్లే ధైర్యం ఉన్నదా? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. తమది పనిచేసే ప్రభుత్వమని, ఎన్నికలకు టీఆర్ఎస్ పార్టీ ఎప్పుడైనా సిద్ధమేనని స్పష్టంచేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ చట్టాన్ని ఆమోదించడానికి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసే అవకాశముందని చెప్పారు. చట్టంపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం అవసరంలేదని, అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీల ప్రతినిధులు మాట్లాడవచ్చునని సూచించారు. ఇసుక తవ్వకాలపై గవర్నర్ నేరుగా కలెక్టర్, ఎస్పీలను సంప్రదించి సమాచారం తీసుకున్నారని మంత్రి అన్నారు. వాస్తవాలు తెలుసుకొనే కాంగ్రెస్ నేతలతో గవర్నర్ మాట్లాడారని కేటీఆర్ తెలిపారు. మూడు సంవత్సరాల్లో ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.1300 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పర్యావరణ అనుమతులు రాగానే ఫార్మా సిటీ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనడానికి విదేశీ పర్యటనకు వెళ్తున్నానని, దావోస్‌లో అగ్రగామి సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతానని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్‌లో కూడా పర్యటిస్తానని ఆయన చెప్పారు.



శనివారం గన్‌పార్కులోని అమరవీరుల స్తూపాన్ని పాలతో శుద్ధి చేస్తున్న టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్

ప్రజలే రేవంత్‌కు బుద్ధి చెప్తారు

- రేవంత్‌తో అమరవీరుల స్తూపం అపవిత్రం
- టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్
- అమరవీరుల స్తూపాన్ని పాలతో శుద్ధిచేసిన టీఆర్ఎస్వీ నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రేవంత్‌రెడ్డి అమరవీరుల స్తూపం వద్దకు వచ్చినందుకు అది అపవిత్రమైందని టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శనివారం గన్‌పార్క్ దగ్గర అమరవీరుల స్తూపాన్ని టీఆర్ఎస్వీ నాయకులు పాలతో శుద్ధి చేశారు. తెలంగాణ ఏర్పాటులో జాప్యానికి, అనేకమంది యువకుల మరణానికి కారణమైనవారిలో ఒకరైన రేవంత్‌రెడ్డి లాంటి వ్యక్తి అమరవీరుల స్తూపం వద్దకు రావడంతో వారి ఆత్మ ఘోషిస్తుందని గెల్లు ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతుల కష్టాలు తెలుసుకాబట్టే రైతుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో తెలంగాణను విస్మరించినా నోరెత్తని రేవంత్‌రెడ్డి టీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్‌ను అందిస్తుంటే జీర్ణించుకోలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో నిరంతర ఉచిత విద్యుత్ అందించే సత్తా ఉన్నదా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిపై, టీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ వైఖరి ఏమిటో స్పష్టంచేయాలని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.



శనివారం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో పతంగి ఎగురవేసి కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, పర్యాటకశాఖ మంత్రి చందూలాల్, పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం



ఆకట్టుకుంటున్న రకరకాల పతంగులు

కనువిందుగా కైట్ ఫెస్టివల్

నోరూరిస్తున్న స్వీట్ ఫెస్టివల్

- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రారంభమైన మూడురోజుల ఉత్సవం
- అంతర్జాతీయ, జాతీయ నగరాల నుంచి తెచ్చిన వెయ్యిరకాల మిఠాయిల ప్రదర్శన
- ఫెస్టివల్‌కు పోటెత్తిన నగరవాసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

వివిధ ఆకారాల్లో రంగురంగుల పతంగుల కనువిందు ఓ వైపు.. నోరూరించే వెయ్యి రకాల మిఠాయిల ఘుమఘుమలు మరోవైపు.. వీటిని ఆస్వాదించేందుకు జంటనగరాల ప్రజలు పరేడ్ మైదానానికి పోటెత్తారు. హైదరాబాద్ నగర సంక్రాంతి సంబురాలను ప్రపంచానికి చాటేలా సికింద్రాబాద్‌లోని సువిశాలమైన పరేడ్‌గ్రౌండ్స్‌లో సాంస్కృతిక, పర్యాటకశాఖ మూడో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను చేపట్టింది. ఈ మూడు రోజులపాటు జరిగే ఉత్సవాన్ని శనివారం ఉదయం తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, పర్యాటకశాఖ మంత్రి చందూలాల్ ప్రారంభించారు. ఈ వేడుకలో దేశ, విదేశాలకు చెందిన కైట్ క్లబ్స్ పలు రకాల పతంగులను ఎగురవేస్తూ కనువిందు చేస్తున్నాయి. ముచ్చటగొలిపే రంగుల పతంగులతో ఆకట్టుకునే విన్యాసాలతో కైట్ రైడర్స్ పిల్లలు, పెద్దలను అలరిస్తున్నారు. 12 దేశాలకు చెందిన 14 కైట్ క్లబ్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నాయని పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి వెంకటేశం చెప్పారు. నైలాన్‌తో తయారుచేసిన వివిధ రకాల భారీ గాలిపటాలను ఈ ప్రదర్శనలో చూడవచ్చని, నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



శనివారం మిఠాయి ప్రియులతో కిటకిటలాడుతున్న పరేడ్‌గ్రౌండ్స్‌లోని అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్.. స్పీకర్ మధుసూదనాచారికి స్వీట్ తినిపిస్తున్న మంత్రి చందూలాల్. చిత్రంలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉన్నారు.

25 జాతీయ, 15 అంతర్జాతీయ నగరాల నుంచి స్వీట్ల ప్రదర్శన

పరేడ్‌గ్రౌండ్స్ మరోవైపు ప్రారంభమైన అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌కు దేశంలో 25 రాష్ట్రాల నుంచి, 15 అంతర్జాతీయ నగరాల నుంచి వచ్చి తమ తీపి వంటకాలను ఇక్కడి స్టాళ్లలో ప్రదర్శించారు. సుమారు వెయ్యికిపైగా స్వీట్స్ ఈ ప్రదర్శనలో విక్రయానికి పెట్టారు. కర్ణాటక నుంచి వచ్చిన బృందంలో 52 మంది మహిళలు 78 రకాల లడ్డూలను తయారుచేశారు. మరో బృందం 44 వెరైటీల్లో హల్వా చేయగా, ఇంకో బృందం 68 రకాలుగా ఖీర్ వండింది. ప్రసిద్ధ సంస్థలు, ముఖ్యంగా మహిళలు సంప్రదాయ వంటలను స్వీట్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. మిఠాయి ప్రియులు మేళాకు హాజరై వెరైటీ వంటలను రుచిచూశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రసిద్ధ సంస్థలు ఈ మిఠాయి మేళాలో స్టాళ్లు ఏర్పాటుచేశాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వెంకటేశం చెప్పారు. తొలి రోజు నగరవాసులు భారీ సంఖ్యలో ఫుడ్, కైట్ ఫెస్టివల్‌కు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచమంతా తెలిసేలా సంబురాలు

హైదరాబాద్‌లో ఒకటి రెండు రోజులు కాదు నెలరోజులకుపైగా సంక్రాంతి సంబురాలు జరుపుకునే వాళ్లం. ఆడపిల్లలు ముగ్గులు వేస్తున్నారు. మగపిల్లలు వాటికి రంగులు అద్దుతున్నారు. అల్లుళ్లు, బావ మరుదులు పతంగులు ఎగురవేస్తున్నారు. ఈ సంబురాల్ని ప్రపంచమంతా తెలిసేలా సాంస్కృతిక, పర్యాటకశాఖ వేడుక నిర్వహిస్తున్నది. మన పతంగుల పండుగ విశేషాలు ప్రపంచానికి తెలియడమే కాదు ప్రపంచంలోని వివిధ రకాల పతంగులను మనం చూసే అవకాశం కల్పిస్తున్నది కైట్ ఫెస్టివల్.

- స్వామిగౌడ్, శాసనమండలి చైర్మన్

పిల్లల్ని ప్రోత్సహిద్దాం

సంక్రాంతి అంటే సంతోషం. చిన్నప్పుడు నేను కూడా పతంగులతో ఆడాను. పతంగులంటేనే ఓల్డ్ సిటీ. ఓల్డ్ సిటీ అంటే పతంగులు. ఇప్పుడు పతంగులు చాలా ఖరీదుకు అమ్ముతున్నారని పేద పిల్లలు ఆడుకోలేకపోతున్నారు. పతంగులు, మాంజాలు తక్కువ ధరలో ఉండేలా వీటికి రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉంది. పిల్లల్ని ప్రోత్సహించాలి.

- మహమూద్ అలీ, ఉప ముఖ్యమంత్రి

'లక్షణమైన ఉత్సవం

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటడం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో కైట్ ఫెస్టివల్ ఒకటి. అనేక సంవత్సరాలుగా మన పండుగలు, సంప్రదాయాలను ఆదరించలేదు. ఇవాళ మన సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్‌లో లక్ష మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నాం. స్వీట్ ఫెస్టివల్ నగర ప్రజలకు కొత్త రుచులను పరిచయం చేస్తున్నది. రాత్రివేళ ప్రత్యేకంగా కైట్ షో నిర్వహిస్తాం.

- అజ్మీరా చందూలాల్, సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి

ఐనవోలులో ప్రారంభమైన మల్లన్న బ్రహ్మోత్సవాలు



ఐనవోలులో కాషాయ జెండాలతో ప్రదక్షిణలు చేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు తదితరులు

ఐనవోలు(వరంగల్): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే వరంగల్ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు తెల్లావారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, సిబ్బంది, కమిటీ సభ్యులు కాషాయ రంగు జెండాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గోపురానికి జెండాలను కట్టి జాతర ప్రారంభమైనట్టు తెలిపారు. జాతరకు రాష్ట్రం నలుదిక్కుల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఆదివారం నుంచి మూడ్రోజులపాటు హన్మకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి సుమారుగా 100 బస్సులను ఆర్టీసీ నడుపనున్నది.

మార్చి 4న సీపీఎస్ ఉద్యోగుల జనజాతర

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీపీఎస్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సారథ్యంలో మార్చి 4న హైదరాబాద్‌లో జనజాతర నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో సీపీఎస్ విధానంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో ప్రత్యేక శాఖలను ఏర్పాటుచేస్తామని తెలిపారు. శనివారం హైదరాబాద్ కాచిగూడలోని నృపతుంగ కాలేజీలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉద్యోగుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. మార్చినాటికి అన్నిజిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ విధానంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, సంఘం కోశాధికారి నరేశ్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమూర్తి, కోఆర్డినేటర్ లెక్కల వీరేశం, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమినాఖతున్, మాన్యం పవన్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులు, వృద్ధులకు రైల్వే కొత్త సౌకర్యం

- అందుబాటులోకి మడుత వీల్‌చైర్లు, ర్యాంపులు
- ఈ నెల 18న గుంటూరు-పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రారంభం




హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రైలు ప్రయాణంలో దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బంది కలుగకుండా దక్షిణమధ్య రైల్వే సరికొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నది. దివ్యాంగులు, వృద్ధులు రైలు ఎక్కేందుకు వీలుగా మడత వీల్‌చైర్లు, మడుత ర్యాంపులను డిజైన్‌చేసింది. దీంతో వీల్‌చైర్‌లో కూర్చొనే ప్లాట్‌ఫాం మీద నుంచి నేరుగా తమ సీటు వద్దకు వెళ్లొచ్చు. ఈ ఆవిష్కరణను దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్ చేపట్టింది. ఈ నెల 18న గుంటూరు-పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో మొదటిసారిగా ఈ సౌకర్యాన్ని ప్రారంభించనున్నారు. ఇది కావాలనుకునే ప్రయాణికులు స్టేషన్‌మాస్టర్‌కు ముందుగా సమాచారమిస్తే సహాయ సిబ్బందిని కూడా ఏర్పాటుచేస్తారు. దీని వినియోగానికి సాధారణ రుసుం మాత్రమే వసూలు చేయనున్నట్టు దక్షిణమధ్య రైల్వే శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. కొత్తగా అందుబాటులోకి రానున్న ఫోర్టబుల్ వీల్‌చైర్ మామూలు వీల్‌చైర్ కంటే తేలికగా ఉంటుంది. వంద కిలోల బరువును సునాయాసంగా మోయగలదు. ఇరుకుస్థలంలో కూడా ఉపయోగపడేలా డిజైన్‌చేశారు. దీనికి చైన్ హ్యాండ్‌బ్రేక్, లాకింగ్ మెకానిజం ఉంటుంది. 35 కిలోల బరువుండే ఫోల్డబుల్ ర్యాంపులను 250 కిలోల బరువును మోయగల సామర్థ్యంతో రూపొందించారు. దీనికి అన్నికోచ్‌లకు ఉపయోగపడేలా టెలిస్కోపిక్ అడ్జస్టబుల్ లెగ్స్‌ను అమర్చారు.

జేఏసీ నేతకు 14 రోజుల రిమాండ్

గోపాలశర్మతోపాటు మరో ముగ్గురు విజయవాడ జైలుకు తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలో కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్‌కు భారీస్థాయిలో లంచం ఇస్తూ పట్టుబడిన టీ జేఏసీ కో-కన్వీనర్ గోపాలశర్మకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఏసీబీ జడ్జి శనివారం ఆదేశాలు జారీచేశారు. గోపాలశర్మతోపాటు ఐటీడీ సిమెంటేషన్ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ కే సత్యనారాయణ, లంచం తీసుకున్న ఏపీ కమర్షియల్ ట్యాక్స్ విభాగానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, అడిషనల్ కమిషనర్ (స్టేట్ ట్యాక్స్) ఏడుకొండలు, సూపరింటెండెంట్ అనంతరెడ్డికి సైతం 14 రోజుల రిమాండ్ విధించారు. నలుగురిని విజయవాడలోని జైలుకు తరలించారు. తాను లీగల్ కన్సల్టెంట్‌గా ఉన్న ఐటీడీ సిమెంటేషన్ కంపెనీకి పన్ను రాయితీ ఇప్పించే విషయంలో దాదాపు రూ.25 లక్షల వరకు భారీగా లంచం ఇస్తూ గోపాలశర్మ, ఆ కంపెనీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ శుక్రవారం ఏపీ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయిన విషయం తెలిసిందే. ఏసీబీ డీజీ ఠాకూర్ నేతృత్వంలోని అధికారుల బృందం వీరిని అదుపులోకి తీసుకున్నది. శనివారం సెలవు కావడంతో నలుగురు నిందితులను ఏసీబీ జడ్జి ఇంటికి తీసుకెళ్లి ప్రవేశపెట్టగా, ఆయన రిమాండ్‌కు ఆదేశించారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన అడిషనల్ కమిషనర్ (స్టేట్ ట్యాక్స్) ఏడుకొండలుకు సంబంధించి గుంటూరు, విజయవాడలో ఉన్న ఇండ్లలో శనివారం ఏసీబీ అధికారులు సోదాలు చేసినట్టు సమాచారం.



ముంజేతి కంకణానికి అద్దమేల

కట్టా మీఠా



కట్టా శేఖర్ రెడ్డి

కళ్లముందు కనిపించే వాస్తవాన్ని చూడటానికి నిరాకరించేవారికి ఏమి చెప్పినా ఏమి ప్రయోజనం? చెవిటివారి ముందు శంఖమూదడం కంఠశోష. కరెంటు సమస్యను తెలంగాణ ప్రభుత్వం ఎలా పరిష్కరించిందో ప్రజలందరికీ అనుభవంలో ఉన్నది. కరెంటు బాధల నుంచి విముక్తి వల్ల కలిగిన ప్రయోజనాలేమిటో ఇవ్వాళ తెలంగాణ ప్రజలకు ఎవరో చెప్పనవసరంలేదు. కరెంటు కోతలు లేవు. మోటార్లు కాలిపోవడం లేదు. లో ఓల్టేజీ సమస్య లేదు. ఇప్పుడు కరెంటుకోసం ఎదురుచూసుడు లేదు. ఫ్యాక్టరీలు, ఆఫీసులు, పెద్దపెద్ద దుకాణాలు, చిన్నచిన్న కిరాణా కొట్లు, ఇళ్లల్లో అయితే జనరేటర్లు, ఇన్వర్టర్లు అన్నీ బందయిపోయాయి. ఎక్కడయినా ఉన్నా ఏదయినా ఆపత్కాల అవసరాల కోసమే వాడుకుంటున్నారు. జనరేటర్లు, ఇన్వర్టర్లు అమ్మే వ్యాపారులు వేరే వ్యాపారాలకు మళ్లవలసిన పరిస్థితి వచ్చింది. కరెంటుకోసం రాస్తారోకోలు, సబ్‌స్టేషన్లపై దాడులు, విద్యుత్ అధికారుల నిర్బంధాలు ఈ మూడున్నరేండ్లలో ఏనాడైనా చూశామా? ఇన్నీ తెలిసి కాంగ్రెస్ నాయకులు సవాళ్లు విసురుతున్నారు. కరెంటు విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ ఊహించి ఉండరు. ఇప్పుడు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ నాయకుల మాటల్లో ఎన్ని వైరుధ్యాలంటే అన్నీ మేమే చేశాం, అంతా మా ఘనకార్యమే అని ఒకసారి అంటారు. అడ్డగోలు ధరపెట్టి కొనుగోలు చేశారని, అవినీతి జరిగిందని మరోసారి అంటారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క యూనిట్ విద్యు త్తు ఉత్పత్తి చేయలేదని చెబుతారు. ఏమీ చేయకుండానే ఈ మూడేండ్లలో సౌరవిద్యుత్తు ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ ఎలా ఎదిగింది? 2500 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యానికి ఎలా చేరుకుంది? థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు పరుగులు పెట్టిందెప్పుడు? భూపాలపల్లి, జైపూరు, కొత్తగూడెంలో కొత్త యూనిట్లు అందుబాటులోకి వచ్చిందెప్పుడు? కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా ప్రాజెక్టుల వెంట వెళితేగదా తెలిసేది. బజార్లో కాళ్లు బార్లా చాపుకొని సవాళ్లు విసురుతున్నవాళ్లు ముందు రాష్ట్రంలో అవసరమైన విద్యుత్తు ఎంత? ఉత్పత్తి అవుతున్నదెంత? ఎక్కడెక్కడ ఏయే ప్రాజెక్టులు ఉన్నా యో తెలుసుకొని మాట్లాడితే జనం సంతోషిస్తారు. మాట్లాడటానికి నోరూ, మైకూ ఉంటే చాలదు.

ప్రపంచవ్యాప్తంగా వివిధ వనరుల నుంచి విద్యుత్ ఉత్పాదన పెరుగుతున్నది. మన దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లో విద్యుదుత్పాదన బాగా పెరిగింది. తత్ఫలితంగా కొనుగోలు చార్జీలు తగ్గుతున్నాయి. మన ఎత్తిపోతల పథకాలన్నీ అందుబాటులోకి వచ్చేనాటికి విద్యుత్ బల్క్ కొనుగోలు చార్జీలు బాగా తగ్గుతాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చాలాకాలంగా చెబుతున్నారు. ఆ దృక్పథంతోనే పెద్ద ఎత్తున గోదావరిపై నీటిని ఎత్తిపోసే ప్రాజెక్టులు చేపట్టారు. అత్యంత వేగంగా ఆ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి సమస్త యంత్రాంగం కృషి చేస్తున్నది. నీటిపారుదల మంత్రి హరీశ్‌రావుతోపాటు ఏ జిల్లా మంత్రి ఆ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల వెంటపడుతున్నారు. కరెంటు తర్వాత నీరే అత్యంత కీలకం. కరెంటు కంటే నీరు ఖరీదైనది. అందుకే నీటికోసం ఎంతయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తున్నది. కాంగ్రెస్ నాయకత్వం ఇవేవీ చూడదల్చుకోలేదు. బట్టకాల్చి మీదవేసి ఏదో పబ్బం గడుపుకోవాలన్న ఆరాటం తప్ప నిర్మాణాత్మక పాత్ర పోషించే దార్శనికతే వారిలో కనిపించడం లేదు. సుదీర్ఘకాలంపాటు ఒక ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించిన కారణంగా టీఆర్ఎస్ నాయకత్వానికి ప్రజాపక్షపాతంతో పనిచేసే దార్శనికత అబ్బింది. కాంగ్రెస్ నాయకత్వానికి ఆరు దశాబ్దాల తర్వాత కూడా ఇంకా ప్రజాకేంద్రక ఆలోచనా ధోరణి అలవడలేదు. 'పొలాలకు నీళ్లిస్తే రైతులు, కూలీలు మన మాట వినరు, రోడ్డేస్తే జనం మనకు అందుబాటులో ఉండరు' అన్న భూస్వామ్య దృక్పథం నుంచి చాలామంది కాంగ్రెస్ నాయకులు ఇప్పటికీ బయటపడలేదు. ఆధునిక దృక్పథం కానీ, క్రియాశీల ఆలోచనలు కానీ వారికి రావడం లేదు. ఎంతసేపు తిట్లపురాణాలు తప్ప, ప్రత్యామ్నాయ ఆలోచనాధారను వారు అలవర్చుకోవడంలేదు. ఒక కాంగ్రెస్ మిత్రుడన్నట్టు ఆ పార్టీలో నాయకులకు మేధావులంటే చిన్నచూపు. బాగా మాట్లాడేవారిని, మంచి వక్తలను చూస్తే అక్కడ అగ్రకులాల నుంచి వచ్చి పెద్దనాయకులుగా చలామణి అవుతున్నవారు కళ్లలో నిప్పులు పోసుకుంటారని ఆ మిత్రుడు బాధపడ్డారు. అందుకే ఆ పార్టీలో భావజాలపరంగా ఒక దివాళా పరిస్థితి తలెత్తింది.

కరెంటు, తాగునీరు-సాగునీరు, రైతుకు ఎకరాకు నాలుగువేల పెట్టుబడి, భూ రికార్డుల ప్రక్షాళన, పింఛన్లు, కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు, సంక్షేమ గురుకులాలు.. ఇవి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చరిత్రలో నిలిచిపోయేట్టు చేస్తాయి. ఇంతకంటే ఉన్నతంగా, ఇంతకంటే భిన్నంగా, ఇంతకంటే ప్రయోజనకరంగా ప్రతిపక్షాలు ఏదైనా ఎజెండాతో వస్తే అప్పుడు ప్రజలు ఆలోచిస్తారు. అధికారం పోయిందన్న అక్కసు, ద్వేషాలతో, తాము ఇంతకాలం అనుభవించిన పదవులు ఎవరో అనుభవిస్తున్నారన్న దుగ్ధతో, ప్రాజెక్టులు-కాంట్రాక్టులు అంటే కమీషన్లు అని మాత్రమే అర్థం చేసుకుని అవి తమకు దక్కకుండా పోయాయన్న ఉక్రోషంతో బుసలు ముసలు కొడితే అధికారం రాదు. తెలంగాణ సాధించడంలో ప్రధాన చోదకశక్తిగా పనిచేసిన కేసీఆర్‌కు వచ్చినంత గొప్పపేరు మరెవరికీ రాలేదు. రాదు. ఆయన అందరిలో ఒకడు కాదు, అరుదైన నాయకుడు. ఆయన నాయకత్వంలో లోపాలు ఉండవచ్చు. మహాత్ములయిన నాయకుల్లో కూడా చరిత్ర కొన్ని లోపాలను లెక్కపెట్టింది. ఇదీ అంతే. ఒక గొప్ప నాయకుడు వస్తే తప్ప ఆయనను ఎదిరించడం సాధ్యం కాదు. నాయకుడు రాత్రికిరాత్రి నోరేసుకుని బయలుదేరితే తయారుకాడు. దానికి సాధన కావాలి. ఓపిక కావాలి. సందర్భం కావాలి. లేదంటే సందర్భం సృష్టించుకోవాలి. కొత్త రాజకీయ నమూనాలను తయారుచేసుకోవాలి. అందుకోసం అనేకమంది మేధావులు, నాయకుల అనుభవాలను చదువాలి. తిట్టి, కొట్టి, పెట్టి నాయకులయ్యేవారి వల్ల సమాజానికి ఏమీ లాభం ఉండదు. వారు అనేకమందిలో ఒకరు. వారు రాజకీయాలను కలుషితం చేయగలరు, తప్ప ఉన్నతీకరించలేరు. కల్లుకొట్టు ముందు నిలబడి మైకంలో మతితప్పి అమ్మనాబూతులు తిట్టేవాడికి పది మైకుల ముందు నిలబడి మాంచి ఖద్దరు బట్టలు తొడిగి పట్టుకండువా మీదేసుకుని మాట్లాడేవారికి తేడా లేకపోతే ఇక జనానికి ఏమి చెబుతారు? జనానికి ఎలా నాయకత్వం వహిస్తారు?

తెలంగాణ ఉద్యమం నాయకత్వ సంస్కృతిలో కూడ ఒక గొప్ప మార్పు తెచ్చింది. గత మూడున్నరేండ్లలో మన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పల్లెలు, పట్టణాలు, ప్రాజెక్టులు పట్టుకుని తిరిగినట్టుగా చరిత్రలో ఏనాడైనా ఏ నాయకుడైనా తిరిగినాడా? ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ పట్నంలో ఉన్నది తక్కువ. హుజూరాబాద్, కరీంనగర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్నది ఎక్కువ. ఆయనకు ఎప్పుడు ఏరోజు ఫోన్ చేసినా హైదరాబాద్ నుంచి ఊరికెళుతూనో, ఊరి నుంచి హైదరాబాద్‌కు వస్తూనో మాట్లాడుతారు. తన్నీరు హరీశ్‌రావు అయితే కాలికి బలపం కట్టుకున్నారు. కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, కడియం శ్రీహరి... దాదాపు మంత్రులంతా నిమ్మళంగా నాలుగు రోజులు పట్నంల గడిపింది లేదు. తెలంగాణ రాష్ట్రం కొత్త. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త. చాలామంది ఎమ్మెల్యేలు, మంత్రులు కొత్త. ఏదో చేయాలన్న ఆరాటం. రుజువు చేసుకోవాలన్న తపన. ముందున్న నాయకత్వానికంటే భిన్నంగా ఉండాలన్న తాపత్రయం.. ఇవన్నీ తెలంగాణ నాయకత్వాన్ని ప్రజలకు సన్నిహితులను చేశాయి. ప్రభుత్వంలోని నాయకత్వం ఇంతగా ప్రజలతో కలిసి మమేకం కావడం కూడా ఇదే ప్రథమం. వీరిలో అత్యధికులు ఉద్యమకాలంలో కూడా జనంతో ఉన్నారు. ప్రతి ఉద్యమంలో ముందుండి పోరాడారు. అదే ఒరవడి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నది. మరి ప్రతిపక్ష నాయకులో. అప్పుడు కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నారు. తెలంగాణ సమాజం ఎంత క్షోభపడుతున్నా ఉలుకూ పలుకూ లేకుండా ఆంధ్రా నాయకత్వం మాటున పడి ఉన్నారు. ఇంకొందరేమో తెలుగుదేశం, సీపీఎం పార్టీలలో తెలంగాణకు ద్రోహం చేసిన ఆంధ్ర నాయకత్వాలతో అంటకాగుతూ ఉన్నారు. ఇప్పుడు కూడా ఆంధ్ర నాయకత్వం వదిలివెళ్లిన భావజాలంతోనే తెలంగాణ నాయకత్వంపై దాడి చేస్తున్నారు. ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కేసులు వేయడం, ఉద్యోగ నోటిఫికేషన్లపై వివాదాలు రేపడం, ప్రతిపనికీ అవరోధాలు కల్పించడం ఇవన్నీ వారి వారసత్వ లక్షణాలే. అప్పటికీ ఇప్పటికీ వీరికి ఒరిజినాలిటీ ఏదీ లేదు. అన్నీ తెచ్చిపెట్టుకున్న వాదాలు, వాదనలు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి ప్రజలకు ఈ మూడున్నరేండ్లలో ఎన్ని కష్టాలను పరిచయం చేసిందో అందరికీ అనుభవంలోకి వచ్చింది. తెలంగాణకు అనుకూలంగా ఒక్క మంచిపనీ చేయలేదు. విభజన చట్టంలోని హామీలన్నీ పెండింగులోనే ఉన్నాయి. తెలంగాణకు మద్దతు ఇచ్చిన మంచిని కూడా ఆ పార్టీ కాపాడుకోలేకపోయింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఘనత ఏదైనా దక్కుతుందంటే అది టీఆర్ఎస్ నాయకత్వానికి, అనివార్యతకు తలొగ్గి, ప్రజా వాంఛను గౌరవించి, పార్లమెంటుతో ఒప్పించిన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి. తెలంగాణ కాంగ్రెస్ నాయకులంతా అప్పుడూ ప్రేక్షకులే.

kattashekar@gmail.com

> తెలంగాణ రాష్ట్రం కొత్త. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త. చాలామంది ఎమ్మెల్యేలు, మంత్రులు కొత్త. ఏదో చేయాలన్న ఆరాటం. రుజువు చేసుకోవాలన్న తపన. ముందున్న నాయకత్వానికంటే భిన్నంగా ఉండాలన్న తాపత్రయం.. ఇవన్నీ తెలంగాణ నాయకత్వాన్ని ప్రజలకు సన్నిహితులనుచేశాయి. ప్రభుత్వంలోని నాయకత్వం ఇంతగా ప్రజలతో కలిసి మమేకం కావడం కూడా ఇదే ప్రథమం. వీరిలో అత్యధికులు ఉద్యమకాలంలో కూడా జనంతో ఉన్నారు. ప్రతి ఉద్యమంలో ముందుండి పోరాడారు. అదే ఒరవడి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నది. మరి ప్రతిపక్ష నాయకులో. అప్పుడు కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నారు. తెలంగాణ సమాజం ఎంత క్షోభపడుతున్నా ఉలుకూ పలుకూ లేకుండా ఆంధ్రా నాయకత్వం మాటున పడి ఉన్నారు.

రహత్ మహల్ కోరా కాగజ్

జ్ఞాపకాలు



బుద్ధా మురళి

ఆ సినిమా టాకీసు పేరు అర్థం ఆ రోజుల్లో తెలియలేదు. కానీ ఆ పేరులోనే ఆహ్లాదం ఉన్నది. ముషీరాబాద్‌లోని ఈ సినిమా హాలును ఇప్పటికీ అక్కడివారు రాత్ మహల్ అనే పిలుస్తారు. రాత్ మహల్ అంటే రాత్రి ప్యాలెస్ అని అర్థం. కానీ దాని అసలు పేరు రహత్‌మహల్. రహత్ అంటే అరబ్బీ భాషలో విశ్రాంతి, రిలీఫ్ అని అర్థం. మహల్ అంటే ప్యాలెస్. ఎన్నో సమస్యలతో సతమతమయ్యే సగటు జీవి కాసేపు సేదతీరేది సినిమాహాలులోనే. దానికి తగ్గట్టుగానే కళాత్మకహృదయంతో ఈ సినిమా హాలుకు రహత్ మహల్ అని పేరు పెట్టారు. ఆ సినిమా యజమాని ఎవరు? హాలులో ఎవరి వాటా ఎంత? ఆదాయం వస్తుందా? లేదా? అనే ఆలోచనలు అప్పుడు అస్సలు లేవు. కానీ సినిమాహాలు రూపం మారిన తర్వాత ఇది వనపర్తి రాజాలదని తెలిసింది.

ఇప్పుడు రహత్ మహల్ లేదు. కానీ రాజా పేరుతో అదే చోట మూడు టాకీసులు నిర్మించారు. పేరుకు తగ్గట్టు విశాలమైన స్థలంలో ఈ టాకీసు ఉండేది. చుట్టుపక్కల ఎక్కువగా ముస్లింలు నివసించే ప్రాంతం కావడంతో ఎక్కువగా హిందీ సినిమాలే విడుదలయ్యేవి.

టాకీసు ఉన్నది ముషీరాబాద్‌లో అయినా ముషీరాబాద్, బోలక్‌పూర్, బాకారం, జమీస్తాన్‌పూర్, రాంనగర్ వారికి అందుబాటులో ఉండేది. ఈ ప్రాంతాల హిందీ సినిమా ప్రేమికులకు రహత్ మహల్ ఒక మధుర జ్ఞాపకం. తొలిసారి సినిమా షూటింగ్ చూసింది కోరా కాగజ్ హిందీలో బాగా హిట్టయిన ఈ సినిమా రహత్ మహల్లోనే చూశాను. జన్మకో శివరాత్రి అన్నట్టు ఎప్పుడో ఒకసారి తెలుగు సినిమాను ప్రదర్శించేవారు.

ఈ రోజుల్లో సినిమాహాలు బుకింగ్ వద్ద మొదటి తరగతి, రెండవ తరగతి, మూడవ తరగతి అని ఎక్కడైనా కనిపించిందా? కావాలంటే నగరంలోని అన్ని టాకీసులు తిరిగి చూడండి ఒక్కచోట కూడా కనిపించదు. కానీ ఆ రోజుల్లో రహత్ మహల్లో ఆడేవి హిందీ సినిమాలే అయినా బుకింగ్ దగ్గర మాత్రం తెలుగులోనే మొదటి తరగతి, రెండవ తరగతి, మూడవ తరగతి అని రాసి ఉండేది. మూడవ తరగతి చదువుకుంటున్నవారికే టికెట్లు ఇస్తారేమో అని అనుకొని ఐదవ తరగతి చదువుతున్నా టికెట్లు ఇచ్చేవాడికి మూడవ తరగతి అని అబద్ధం చెప్పాలని నిర్ణయించుకుని క్యూలో నిలబడిన సందర్భాలు చాలామందికి ఉన్నాయి.

కోరా కాగజ్ సినిమాలోని ఒక సీనును ట్యాంక్‌బండ్‌పై చిత్రీకరించారు. నటుల పేర్లు తెలియదు. కానీ ట్యాంక్‌బండ్ పై స్త్రీ పాత్రధారి వెళ్తుంటుంది. కారుపై వెళుతూ హీరో ఆమెకు కారు తగిలిస్తాడు. ఈ చిన్న సీనును తీసేందుకు కొన్ని గంటలపాటు షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ అంటే ఇంత కష్టమా? అనిపించింది మొదటిసారి.

రహత్‌మహల్లో లెక్కలేనన్ని హిందీ సినిమాలు చూసినా కోరా కాగజ్ సినిమా అనుభవం ప్రత్యేకం. అప్పటివరకు హిందీ సినిమాలు అంటే డిష్యూం డిష్యూం ఫైట్స్‌కు పెట్టింది పేరు. డిష్యూం మాట దేవుడెరుగు ఈ సినిమాలో కనీసం ఒక చెంపదెబ్బ సీన్ కూడా లేకపోవడంతో ఇదేం సినిమా అనిపించింది 1974లో. ఆ ఏడాది హిందీలో పాపులర్ సినిమాగా కోరా కాగజ్‌కు అవార్డు దక్కింది.

అమర్ అక్బర్ ఆంథోని. ఆ కాలంలో ఒక ఊపు ఊపిన హిందీ సినిమా. ఆ సినిమాను చూసింది రహత్ మహల్‌లోనే ఉదయం పూట పాత తెలుగు సినిమాలు ప్రదర్శించేవారు. మూడు ఆటలు ఎక్కువగా హిందీ సినిమాలే ప్రదర్శించేవారు. దగ్గరలోనే ముషీరాబాద్ హైస్కూల్ కావడంతో ఇంటర్వెల్‌లో టాకీసుకు వచ్చి హాజరు వేయించుకొని వెళ్లడం అక్కడి విద్యార్థులకు అలవాటు.

ఇక్కడ చూసిన సినిమాల కన్నా విన్న సినిమాలు ఎక్కువ. బయటకు సినిమా మొత్తం వినిపించేది. కాసేపు అక్కడ గడిపి వెళ్లడం ఓ వ్యాపకం.

+++

విశాలమైన ఆవరణ చివరలో సినిమా హాలు. ఎంట్రెన్స్‌లోనే క్యాంటిన్, క్యాంటిన్ ముందు విశాలమైన ఖాళీ స్థలం. అప్పటి కార్మిక నాయకుడు, ఇప్పటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి బుల్లెట్ మీద టంచనుగా రహత్ మహల్‌కు రోజూ వచ్చేవారు. సినిమా చూసేందుకు కాదు. క్యాంటిన్ ఎదురుగా ఖాళీ స్థలంలో తనకోసం వేచి ఉన్న వారి సమస్యలను పరిష్కరించి వెళ్లేవారు.

ఈ ప్రాంతం చుట్టుపక్కల ఎక్కువగా శ్రమజీవులే. దినమంతా పనిచేసేవారే. మిగిలిన ఆటలకన్నా సెకండ్ షోలోనే ఎక్కువమంది కనిపించేవారు. కొంతకాలానికి సినిమా హాలును మూసేశారు. రహత్ మహల్‌ను మూసినచోట ఇప్పుడు రాజా పేరుతో మూడు సినిమా హాళ్లను నిర్మించారు. ముందు షాపింగ్ కాంప్లెక్స్, లెక్కలేనన్ని షాపులు. వెనుక మూడు సినిమా హాళ్లు. సూక్ష్మంలో మోక్షం సాధించాలి అని ఆధ్యాత్మికవేత్తలు భావించినట్టుగానే తక్కువ స్థలంలో ఎక్కువ వ్యాపారం సాగించాలనేది నేటి మాట. అందుకే విశాలంగా ఉన్నరహత్ మహల్ అంతరించి ఇరుకుగా మూడు టాకీసులు, డజన్లకొద్దీ షాపులు వెలిశాయి. పాతతరం వారికి రహత్ మహల్ జ్ఞాపకాలు ముఖ్యం. కొత్తతరం యజమానులుకు లాభం ముఖ్యం.

ఎప్పటిలానే ఈ టాకీసుల్లో హిందీ సినిమాలనే విడుదల చేస్తున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసే విధంగా క్యాంటిన్‌లో కొంతభాగం అలానే ఉంది.


+++

ముగ్గురు అన్నదమ్ములు విలన్ కారణంగా విడిపోతారు. అమర్ అక్బర్ ఆంథోనీగా మూడు మతాలకు చెందిన వారిగా పెరిగి పెద్దవుతారు. ముగ్గురు తాము అన్నాదమ్ములమని, విలన్ కారణంగా తమ కుటుంబం విడిపోయిందని గ్రహించి ప్రతీకారం తీర్చుకుంటారు. ఈ కథతో లెక్కలేనన్ని సినిమాలు వచ్చాయి. కానీ అమర్ అక్బర్ ఆంథోనీ సూపర్‌హిట్ అయింది. రహత్ మహల్‌లో ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.

విడిపోయిన ముగ్గురు అన్నదమ్ములు చివరకు ఒకటవుతారు. రహత్ మహల్ మాత్రం ఒకటి నుంచి మూడయింది. కానీ ఆ కళ మాత్రం కనిపించడం లేదు. ఆ తరం వారికి రహత్ మహల్ ఒక జ్ఞాపకం మాత్రమే. ఇప్పుడు బయటి నుంచి చూస్తే ముందుగా కనిపించేవి షాపులు. వాటివెనుక సినిమా టాకీసులు.


(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)

> రహత్ మహల్‌ను మూసినచోట ఇప్పుడు రాజా పేరుతో మూడు సినిమాహాళ్లను నిర్మించారు. ముందు షాపింగ్ కాంప్లెక్స్, లెక్కలేనన్ని షాపులు. వెనుక మూడు సినిమాహాళ్లు. సూక్ష్మంలో మోక్షం సాధించాలి అని ఆధ్యాత్మికవేత్తలు భావించినట్టుగానే తక్కువ స్థలంలో ఎక్కువ వ్యాపారం సాగించాలనేది నేటి మాట. అందుకే విశాలం గా ఉన్నరహత్ మహల్ అంతరించి ఇరుకుగా మూడు టాకీసులు, డజన్లకొద్దీ షాపులు వెలిశాయి. పాతతరం వారికి రహత్ మహల్ జ్ఞాపకాలు ముఖ్యం. కొత్తతరం యజమానులుకు లాభం ముఖ్యం.



దేశంలోని అత్యున్నత న్యాయస్థానం విభేదాలతో విభజింపబడిపోయిందన్నది బహిరంగ రహస్యం. దీనికి సంబంధించిన అనేక వదంతులు మన వ్యవస్థ ఎంతగా కుళ్లిపోయిందో తెలుపుతున్నది. నలుగురు న్యాయమూర్తుల ప్రతిస్పందన దీనికి ఉదాహరణ.

ఎన్.రామ్




న్యాయవ్యవస్థ నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందనపైనే మన న్యాయవ్యవస్థ ఉన్నతి ఆధారపడి ఉన్నది. ఇది జాతీ ప్రయోజనంతో ముడిపడి ఉన్నది.

శేఖర్ గుప్తా



నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలను సుప్రీంకోర్టు పూర్తి బేంచి సానుకూలంగా స్పందిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తున్నది. మన న్యాయవ్యవస్థ ఉన్నతిని, సంప్రదాయాలను కాపాడాలని కోరుతున్నది.

రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా




ప్రభుత్వ ఆధీనంలోని సీబీఐ ప్రధాన న్యాయమూర్తిని బ్లాక్‌మెయిల్ చేశారనే ఆరోపణ తీవ్రమైనది. రాజకీయ ప్రమేయంతో కేసులకు పాతరేస్తున్నారా?

ప్రశాంత్ భూషణ్

అస్తిత్వ ఉద్యమాలకు లక్ష్యాలేవి?

విశ్లేషణ



ప్రొఫెసర్
గట్టు సత్యనారాయణ

భారతదేశం వివిధ జాతులు, కులాల సాంస్కృతిక వైవిధ్యాల సహజీవనంతో 'Unity in Diversity' అనే లౌకిక ఆలోచనలతో మనుగడ సాగిస్తున్నది. ఈ సామాజిక మనుగడకు శ్రమజీవుల త్యాగాలే ముఖ్యమన్నది చారిత్రక సత్యం. వర్ణం, కులం పునాదులపై నిర్మించబడిన సామాజికవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడినవారు మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణ గురు, అంబేద్కర్‌లాంటి వారిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

ఈ మధ్య సమాజంలో అసహనం, అమానవీయ, అశాస్త్రీయమైన ఆలోచనలు, కార్యక్రమాలు సగటు మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవి. సంపన్న ఆధిపత్యవర్గాలే వారికి ఏదో అన్యాయం జరిగిందని ఉద్యమాలు నిర్వహించటం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నది. వీటికి రాజకీయ కారణాలు ఒకటైతే శాస్త్రీయతలేని ఆలోచనలు మరో కారణం. కారల్ మార్క్స్ అన్నట్లు 'ప్రజల చైతన్య స్పృహ వారు నివసించే పరిస్థితులపై ఆధారపడుతుంది' సందేహం లేదు. ఇక్కడ చిక్కేమిటంటే సాధారణ ప్రజలు తమతమ పరిస్థితుల ప్రభావానికి లోనై శాస్త్రీయమైన ఆలోచనలు చేయలేకపోవడంతో సంకుచిత, స్వార్థ చింతన గల మేధావులు అశాస్త్రీయ జ్ఞానాన్ని వ్యాపారవస్తువుగా మార్చేస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. ఈ పోకడలను అన్నివర్గాల, మతాల, పార్టీలలోని నిజమైన మేధావులు, నాయకులు ఖండించకపోవడం శోచనీయం.

ఇలాంటి స్థితిలో విద్యావంతులు, మేధావులు వాళ్ల పరిస్థితులను అధ్యయనంచేసి, వాటిని ఏ విధంగా అధిగమించాలో ప్రగతి కాముకంగా ఆలోచించి మార్గదర్శక పాత్ర వహించాలి. కానీ నేటి మేధావులు పేదవర్గాల పేరుతోనే పేదలను దిగజారుస్తున్నారు. వీళ్లు రాజ్యానికి, పాలకవర్గాలకు వ్యతిరేకంగా మాట్లాడినట్లు నటిస్తూ, తమకు అనుకూలంగా ఉన్న పాలకవర్గాలకు తమ వర్గప్రయోజనాలను తాకట్టుపెట్టి ప్రజా వ్యతిరేకశక్తులతో పోరాడే వారిని బలహీనపరుస్తారు. బలహీనమైన శత్రువును టార్గెటు చేసి బలమైన శత్రువుతో స్నేహం చేసి తమ వర్గాల్లోని వీరోచిత పోరాటాలు చేసే వ్యక్తులను ఆలోచనాపరులను బలహీనపరుస్తారు. వీరి ఆలోచలు సమాజ ప్రగతి, పేదల ఉన్నతికి కాదు. సొంత ప్రయోజనం, వారి పేరు మీడియాలో ఉండటమే. వాళ్ల మేధస్సు అంతకంటే ఎక్కువ ఆలోచించదు. దానికో ప్రమాణం ఉండదు. దళిత, బహుజనులు ప్రభావితమైన హేతువాద, ప్రగతివాద శాస్త్రీయమైన ఆలోచనల భావజాలాన్ని కూడా స్వయం ప్రకటిత మేధావులు కలుషితం చేస్తున్నారు. తమ మూర్ఖపు విధానాలకు, భావజాలానికి కుల అస్తిత్వ చిహ్నాలను వాడుతూ, తాము మాత్రం అంతర్జాతీయ సంస్థలతో అనుబంధాలను కలిగి ఉండటం ద్వారా ప్రయోజనం పొందడం అనే ద్వంద్వ వైఖరిని ఎవరు ఖండించాలి? ప్రజలకు ఈ లోతులు తెలియవు. తెలిసినవారు నోరు విప్పరు. కారణం వారు తమ సామాజిక వర్గం వారని ఒకరు భావిస్తే, వేరే వర్గాల వారితో మనకు ఎందుకు రభసా అని మరోవర్గం నోరు మూయడం మరొక కారణం.

ఈ స్వయం ప్రకటిత మేధావులకు వర్గ శత్రువు కంటే తమ వర్గంలోని ఇతర కులాల మేధావుల, హీరోల నిర్మూలనే ముఖ్యం. వీరిని కమ్యూనిస్టు భాషలో 'కోవర్టు'లు అంటారు. వీరు తమ జీవనశైలి, ఆలోచనలు ఇతరదేశాల వారి వేషభాషల అనుకరణతో పాటు, తమ హితమే సమాజహితంగా బోధిస్తారు, భ్రమింపజేస్తారు. సిద్ధాంతాలు చెప్పటం సమాజ హితానికి కాదు, సమాజంలో వైషమ్యాలు సృష్టించి వాళ్ల ప్రచారంలోకి రావటానికి మాత్రమే. వీరు మార్క్స్‌లా గడ్డాలు పెంచుతారు. క్లింటన్‌లాగ ఖరీదైన కోట్లు ధరిస్తారు. ప్రజల మద్దతు, ప్రచారం కావలసినపుడు ఆ కోటు, సూటులపై ఓ గొంగడి వేస్తారు. వీళ్లకు వీళ్లే శత్రువులు, వీళ్లను నమ్మేవారికి వీళ్లే శత్రువులు.

వేల సంవత్సరాల ఘర్షణ నుంచి పెరిగిన సామాజిక స్పృహను నేటి తరానికి అందనివ్వరు. యువతను కన్ఫ్యూజ్ చేసి సంక్షోభంలోకి నెడుతారు. ఈ మధ్య డాక్టర్ గోపినాథ్ రాసిన వ్యాసం ముగింపులో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తారు. False consciousness మేధావుల ఆలోచనలే ఈ తరం సమాజ ప్రగతికి, ప్రగతి సిద్ధాంతాలకు ఆటంకంగా మారాయి. కలిసి పోరాడవలసిన శక్తులే విడిపోయి కొట్లాడుకుంటున్నాయని అంటారు. దీన్నే ఇంకా సిద్ధాంతపరంగా విస్తృతంగా విశ్లేషిస్తే బాగుండేది. ఈ ప్రక్రియలో ఇంకా బలహీన వర్గాల్లోని active opportunistలను పాలక వర్గాలు, కులాలు పోషిస్తూనే ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి, దాని మౌలిక విలువలకు గొడ్డలిపెట్టుగా మారింది. వేల ఏండ్ల పోరాటాలతో, శ్రమ త్యాగాలతో సాధించిన ప్రగతి భావజాలం సంక్షోభంలోకి నెట్టబడుతున్నది.

గతంలో శత్రువు శత్రు దుర్భేద్యంగా కనపడినా, ప్రజలు ప్రాణాలకు తెగించి ఉద్యమించి సామ్రాజ్యాలనే కూల్చారు.'**రాబోయే కాలంలో భారతదేశం కులాల ఘర్షణలో కూరుకుపోతుందని**' రామ్ మనోహర్ లోహియా ఏనాడో చెప్పారు. విప్లవ పోరాటాలలో కూడా గత యాభై ఏండ్లుగా వివిధ రూపాల్లో పనిచేసిన మేధావులు, ఉద్యమకారులు కూడా ఈ సూడో మేధావుల ప్రభావానికి బలయ్యారు. అందుకే మహోన్నతమైన ఉద్యమాలు మన దేశంలో సామాజిక లక్ష్యాలను సాధించలేకపోయాయి.

మన దేశ, ప్రపంచ దేశాల్లోని మేధావుల ఆలోచనలు సత్యం, ధర్మం, ప్రజా హితం, క్షేమం, స్వేచ్ఛ, న్యాయం కాలానుగుణంగా ప్రస్ఫుటమైనవి. ఇందులో కొన్ని మానవ జీవిత లక్ష్యాలను ప్రబోధిస్తే మరికొన్ని మానవ ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల్లోని సమస్యలకు ప్రత్యామ్నాయాన్ని చెప్పాయి. కానీ నేడు కొంతమంది కుహనా మేధావులు అంబేద్కర్ చెప్పిన రాజ్యాంగస్వేచ్ఛను వక్రబుద్ధితో ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రయోగించి, గతంలో జరిగిన సామాజిక అన్యాయాలకు తిరుగుబాటుగా చూపుతూనే గత identity stigmaను పోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు ఉన్నత కులాలు పాలక వర్గంగా మారి మెజార్టీ ప్రజలను వివిధ కులాల పేరుతో వృత్తిని నిర్ధేశించి సామాజిక సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అణిచివేతకు తరతరాలుగా గురిచేశారని చెప్తూనే, అదే సంస్కృతిని చెదరనివ్వమనే విధంగా లక్ష్యరహితమైన కుల వాదాలను అన్ని వర్గాల్లోని స్వయం ప్రకటిత మేధావులు ప్రోత్సహిస్తున్నారు. ప్రజలను రెచ్చగొడుతున్నారు.

వందేండ్ల కమ్యూనిస్టు ఉద్యమం, యాభై ఏండ్ల నక్సలైట్ ఉద్యమం సాధించిన, స్వేచ్ఛా, సమానత, మానవతా విలువలను కూడా స్వయం ప్రకటిత మేధావులు భ్రష్టు పట్టిస్తున్నారు. 'కుల అంశాన్ని కమ్యూనిస్టు ఉద్యమంలో అన్వయించుకోక తప్పు చేశామనే' విధంగా అపరాధ భావన ప్రకటనలు చేయడం మరొక హాస్యాస్పదం.

నేడు తాత్త్వికత లేని స్వయం ప్రకటిత, సంకుచిత, స్వార్థపరులు ప్రజల సమస్యలను తమ ప్రయోజనానికి ఆయుధంగా వాడుతూ ప్రజలను తమ ప్రగతికి కావలసిన నిజమైన సిద్ధాంతానికి దూరం చేస్తు న్నారు. దీనికి ప్రజలు, మేధావులు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యం ముసుగులో 'ఎస్కేపిజం' తప్ప బాధ్యతగా ప్రవర్తించడం కాదు.

నేడు అన్నివర్గాల మేధావులు చరిత్రలో ఎన్నో ప్రాణత్యాగాలతో అందించిన స్వేచ్ఛను ఉద్యమాల నిర్మాణానికి ఉపయోగించి నవ సమాజ, సమసమాజ నిర్మాణానికి అంకితం కావాలి. అప్పుడే ఆ విలువల కోసం పోరాడి ప్రాణాలొడ్డిన లక్షలాది మేధావులకు, అమరవీరులకు, ఉద్యమకారులకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుంది.

మేధావులు చేసే ఆలోచనలు కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు గల్లీల్లో, గ్రామాల్లో, బస్తీల్లో గుండాల వీరంగంగా మారకూడదు. మానవతా విలువలతో నాగరిక సమాజ నిర్మాణానికి దోహదపడేలా ఉండాలి. ఇది దళిత మేధావులు, ప్రజలు గ్రహిస్తారని ఆశిద్దాం!

> నేడు తాత్త్వికత లేని స్వయం ప్రకటిత, సంకుచిత, స్వార్థపరులు ప్రజల సమస్యలను తమ ప్రయోజనానికి ఆయుధంగా వాడుతూ ప్రజలను తమ ప్రగతికి కావలసిన నిజమైన సిద్ధాంతానికి దూరం చేస్తున్నారు. దీనికి ప్రజలు, మేధావులు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యం ముసుగులో 'ఎస్కేపిజం'తప్ప బాధ్యతగా ప్రవర్తించడం కాదు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

న్యాయమూర్తులారా.. సలాం: ప్రకాశ్‌రాజ్



న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పని విధానం సరిగా లేదని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకురావడాన్ని సినీనటుడు ప్రకాశ్‌రాజ్ సమర్థించారు. 'గౌరవ న్యాయమూర్తుల్లారా సలాం.. కొందరు ఆత్మవంచన చేసుకోరు. జడ్జి లోయా కేసు నుంచి ఆధార్ కేసు వరకు కేంద్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నా నోరు మూర్చుకొని కూర్చోరు' అని ట్వీట్ చేశారు. సుప్రీంకోర్టు సరైన దారిలో నడవడం లేదని, ఈ విషయాన్ని తాము చూసి చూడనట్లు వ్యవహరించలేమని, దేశ భవిష్యత్ దృష్ట్యా ప్రజల ముందుకు వచ్చి మాట్లాడుతున్నామని శుక్రవారం జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్న విషయాలను కూడా ప్రకాశ్‌రాజ్ ప్రస్తావించారు.

జడ్జీల నిర్ణయం ప్రశంసనీయం

ప్రభుత్వం జోక్యం చేసుకోవద్దు: శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే



ముంబై, జనవరి 13: మీడియా సమావేశం నిర్వహించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులను శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ప్రశంసించారు. శనివారం ముంబైలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ నలుగురు న్యాయమూర్తులు తీసుకున్న నిర్ణయం కొనియాడదగినదన్నారు. వారిపై విచారణ జరుగవచ్చునని, అయితే ఆ విచారణ నిష్పక్షపాతంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.'ఇప్పుడు న్యాయవ్యవస్థ ఒత్తిడిలో ఉన్నట్లుంది. న్యాయమూర్తులు మీడియాకెక్కడం షాక్ కలిగించింది. న్యాయవ్యవస్థను నమ్మాలా వద్దా అని ప్రజలు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవద్దు. న్యాయవ్యవస్థను తన పని తాను చేసుకుపోనివ్వాలి' అని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. సుప్రీంకోర్టుకు ఇంతటి సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో రాష్ట్రపతి రామ్‌నాథ కోవింద్ ఆదివారం ముంబైలో పర్యటించాలనుకోవడాన్ని ఆయన విమర్శించారు. అంతముఖ్యమైన పనులు ముంబైలో ఏమున్నాయని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థను మూగ, చెవిటి దానిని చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు.

న్యాయమూర్తుల మాదిరిగా మంత్రులు బయటకు రావాలి

కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా పిలుపు



న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మాదిరిగా కేంద్ర మంత్రులు కూడా భయం నుంచి బయటకు రావాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం స్పందించాలని కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో 1975 – 77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి తొమ్మిదో తేదీ వరకు మాత్రమే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారని, ఇంతకుముందు శీతాకాల పార్లమెంట్ సమావేశాలను కూడా కొద్ది కాలమే నిర్వహించారని గుర్తు చేశారు. 'ప్రజాస్వామ్యం ముప్పును ఎదుర్కొంటున్నదన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి' అని చెప్పారు. 'ప్రతి పౌరుడు ప్రజాస్వామ్యం కోసం స్పందించాలి. పార్టీ (బీజేపీ) నేతలు, సీనియర్ కేంద్ర మంత్రులు భయం వదిలి బయటకు వచ్చి ప్రతిస్పందించాలని నేను కోరుతున్నా' అని తెలిపారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, ఇతర న్యాయమూర్తుల మాదిరిగానే, ప్రధాని, కేంద్ర మంత్రులు సమానమేనన్నారు. ప్రధాని నరేంద్రమోదీ విధానాలపై యశ్వంత్ సిన్హా నిరంతరం విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి: డీఎంకే



చెన్నై, జనవరి 13: సుప్రీంకోర్టు పని విధానంలో తలెత్తిన వివాదాన్ని న్యాయమూర్తులు తమలో తాము పరిష్కరించుకోలేకపోతే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జోక్యం చేసుకోవాలని తమిళనాడులోని డీఎంకే పార్టీ కోరింది. శనివారం ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉన్నదని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఓ చోట కూర్చొని మాట్లాడుకోవాలని, సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రజల కోసం ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తున్న అత్యున్నత సంస్థ సుప్రీంకోర్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. అటువంటి అత్యున్నత న్యాయస్థానంలో తలెత్తిన సమస్య వీలైనంత త్వరగా పరిష్కారమవుతుందన్న నమ్మకం తనకు ఉన్నదని పేర్కొన్నారు.

జడ్జీలకు లాయర్ల మధ్యవర్తిత్వం

ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసిన బార్ కౌన్సిల్

న్యాయమూర్తుల మధ్య విభేదాలను విస్తృత ధర్మాసనం పరిష్కరించాలన్న ఎస్సీబీఏ

ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని నేతలకు విజ్ఞప్తి

తమ తిరుగుబాటుతో ఎటువంటి సంక్షోభం ఏర్పడలేదన్న జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ రంజన్ గగోయ్



న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్నసుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ వికాస్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 13:

భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దీపక్ మిశ్రాకు, సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ జడ్జీలకు మధ్య ఏర్పడిన విభేదాల తొలగింపునకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసింది. సీజేఐ వ్యతిరేకంగా ఆరోపణలు చేస్తూ నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియాకెక్కిన నేపథ్యంలో బార్ కౌన్సిల్ శనివారం సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బార్ కౌన్సిల్ చైర్మన్ మానన్‌కుమార్ మిశ్రా మీడియాతో మాట్లాడుతూ, 'కౌన్సిల్‌కు చెందిన ఏడుగురు సభ్యులతో ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించాం. ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని భావిస్తున్నాం' అని చెప్పారు. న్యాయ వ్యవస్థ అంతర్గత వ్యవహారాలలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడాన్ని ఆయన విమర్శించారు. 'ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని రాజకీయ నాయకులకు బార్ కౌన్సిల్ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాను. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ దిగజారడం మంచిది కాదు. మన న్యాయవ్యవస్థపై ప్రజలకు ఎంతో విశ్వాసముంది' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు జరిగిన బార్‌కౌన్సిల్ సభ్యుల సమావేశంలో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. వారు సమస్యను అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సిందని, మీడియా ముందుకు రావడం సరైంది కాదని కొందరు అభిప్రాయపడినట్టు తెలిసింది. పరిస్థితి ముదరక ముందే సీజేఐ స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిందని మరికొందరు పేర్కొన్నట్టు తెలిసింది. సుప్రీంకోర్టు వ్యవహారాలలో పాలనాపరమైన లోపాలున్నాయని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ మదన్ బీ లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ శుక్రవారం మీడియా ముందు ఆరోపించిన సంగతి తెలిసిందే.

విభేదాలను పూర్తిస్థాయి ధర్మాసనం పరిష్కరించాలి: ఎస్సీబీఏ

సీజేఐ దీపక్‌మిశ్రా, నలుగురు సీనియర్ జడ్జీల మధ్య ఏర్పడిన విభేదాలను సుప్రీంకోర్టుకు చెందిన పూర్తిస్థాయి ధర్మాసనం పరాష్కరించాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మధ్య విభేదాలు పొడసూపడం పట్ల ఎస్సీబీఏ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్) అన్నింటిని సీజేఐ లేదా కొలీజియంలో సభ్యులైన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు పరిశీలించాలని ఎస్సీబీఏ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ పేర్కొన్నారు. ఈ నెల 15న విచారణకు రానున్న ప్రజా ప్రయోజన వ్యాజ్యాలన్నింటినీ ఇతర ధర్మాసనాల నుంచి సీజేఐకి లేదా కొలీజియంలో సభ్యులుగానున్న వారి ధర్మాసనాలకు బదిలీ చేయాలని వారు సూచించారు. నలుగురు సీనియర్ జడ్జీలు మీడియా ముందుకు వచ్చిన తమ అసంతృప్తిని వ్యక్తం చేసిన నేపథ్యంలో ఎస్సీబీఏ కార్యనిర్వాహక సమావేశం అత్యవసరంగా నిర్వహించామని ఆయన చెప్పారు.

తిరుగుబాటుపై సీజేఐ, ఇతర జడ్జీలకు సమాచారం లేదు

సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకొచ్చి తమ అసంతృప్తిని బట్టబయలుచేసే విషయం గురించి సీజేఐతోపాటు ఇతర జడ్జీలకు కూడా సమాచారం లేదని తెలిసింది. జస్టిస్ దీపక్ మిశ్రా తరువాత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న రంజన్ గగోయ్‌తో న్యాయమూర్తులు చలమేశ్వర్, మదన్ బీ లోకుర్, కురియన్ జోసెఫ్ శుక్రవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ నలుగురు ఏకాభిప్రాయానికి వచ్చిన తరువాతే మీడియా ముందుకు రావాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ నలుగురు జడ్జీలు తమతో ఏకీభవించే ఇతర న్యాయమూర్తులను కూడా సంప్రదించాలని అభిప్రాయపడినప్పటికీ సమయాభావం వల్ల ఆ పని చేయలేకపోయినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10.30 గంటలకు కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కావాల్సి ఉండటం, న్యాయమూర్తులందరూ తమ కోర్టు గదులకు వెళ్లాల్సి ఉన్న నేపథ్యంలో ఈ నలుగురే హడావిడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్తున్నారు.

సీజేఐని కలిసేందుకు వెళ్లిన పీఎంవో ముఖ్యకార్యదర్శి

ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి నృపేంద్ర మిశ్రా శనివారం సీజేఐ దీపక్ మిశ్రాను కలిసేందుకు వెళ్లినట్టు టీవీ దృశ్యాలు వెల్లడించాయి. సీజేఐ అధికార నివాసానికి నృపేంద్ర మిశ్రా కారులో వెళ్లినప్పటికీ ఆయన కోసం గేట్లు తెరుచుకోలేదు. కొద్దిసేపు గేటువద్ద వేచి చూసిన ముఖ్యకార్యదర్శి ద్వారం తెరుచుకోకపోవడంతో వెనుకకు తిరిగి వచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ప్రధానిపై విమర్శలు సంధించింది. సీజేఐ వద్దకు 'ప్రత్యేక దూత'ను ఎందుకు పంపారని, కారణాలను వెల్లడించాలని కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా డిమాండ్ చేశారు.

బయటి వ్యక్తుల జోక్యం అక్కర్లేదు



జస్టిస్ కురియన్ జోసెఫ్



జస్టిస్ రంజన్ గగోయ్

న్యాయవ్యవస్థలో తలెత్తిన సంక్షోభం నివారణకు బయటి వ్యక్తుల, సంస్థల జోక్యం అవసరమే లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అన్నారు. ఇది ఒక వ్యవస్థలో నెలకొన్న సమస్యేనని, దాన్ని ఆ వ్యవస్థే పరిష్కరించుకుంటుందన్నారు. తాము లేవనెత్తిన సమస్య పరిష్కారానికి తప్పనిసరి చర్యలు తీసుకుంటారని భావిస్తున్నామన్నారు. జస్టిస్ కురియన్ శనివారం కేరళలోని కలడిలో ఉన్న తన పూర్వీకుల నివాసం వద్ద తనను కలిసిన స్థానిక టీవీ చానళ్లతో మాట్లాడుతూ తాము కేవలం న్యాయం కోసం, న్యాయవ్యవస్థ ప్రయోజనాల కోసమే మీడియా ముందుకు వచ్చామని అన్నారు. ఢిల్లీలో మీడియా ముందుకు రావడంలో తాము ఎలాంటి క్రమశిక్షణను ఉల్లంఘించలేదన్నారు. చీఫ్ జస్టిస్ పనితీరులో రాజ్యాంగపరమైన లోపాలేమీ లేవని అన్నారు. సుప్రీంకోర్టు, దాని న్యాయమూర్తుల విషయమై రాష్ట్రపతికి ఎటువంటి రాజ్యాంగ బాధ్యత లేదని, ఆయన దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. సుప్రీంకోర్టులో ఎటువంటి సంక్షోభం లేదని మరో న్యాయమూర్తి రంజన్ గగోయ్ పేర్కొన్నారు. మీ చర్య క్రమశిక్షణా రాహిత్యం అవుతుందా అన్న ప్రశ్నకు ఆయన జవాబు ఇచ్చేందుకు నిరాకరిస్తూ 'నేను లక్నో వెళ్లే విమానానికి టైమ్ అవుతున్నది. ఇప్పుడు మాట్లాడలేను' అంటూ వెళ్లిపోయారు.

తమిళ పాటల రచయిత వైరముత్తుపై కేసు



రాజపాలయం: ప్రముఖ తమిళ పాటల రచయిత, జాతీయ అవార్డు గ్రహీత వైరముత్తుపై తమిళనాడు పోలీసులు కేసు నమోదుచేశారు. ఇటీవల వైరముత్తు ఆండాళ్ దేవతను దూషించారని 'హిందూ మున్నాని' ఫిర్యాదుచేసింది. ఆయన వ్యాఖ్యల తో తాము బాధపడినట్టు సూరి అనే వ్యక్తి అన్నారు. కాగా, తిరుపతి వేంకటేశ్వర స్వామిపై వ్యాఖ్యలు చేసిన డీఎంకే ఎంపీ కనిమొళిపై రాష్ట్రంలో కేసులు నమోదయ్యాయి.

పాక్ కాల్పుల్లో సైనికుడి మృతి

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా పరిధిలో పాకిస్థాన్ సైన్యం శనివారం జరిపిన కాల్పుల్లో ఒక జవాన్ మరణించాడు. సుందర్‌బన్ సెక్టార్ పరిధిలో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వద్ద గల భారత్ పోస్టులపై పాక్ సైన్యం కాల్పులు జరిపింది. తాము దీటుగా జవాబు చెప్పామని సైన్యం అధికార ప్రతినిధి చెప్పారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన లాన్స్ నాయక్ యోగేశ్ మురళీధర్ భదానే (22) తర్వాత మృతి చెందాడు. ఆయన మహారాష్ట్రలోని ధూలె జిల్లా ఖలానే గ్రామ వాసి.

ప్రేమ పెండ్లి వద్దన్నందుకు తండ్రి హత్యకు కుట్ర!

లండన్: శ్వేతజాతీయురాలితో పెండ్లికి నిరాకరించిన తండ్రిని కారులో బాంబుతో చంపేందుకు యత్నించిన భారత సంతతి యువకుడికి బ్రిటన్ కోర్టు శుక్రవారం ఎనిమిదేండ్ల జైలు శిక్ష విధించింది. గుర్తేజ్‌సింగ్ రంధావా (19) తాను ప్రేమించిన యువతితో వివాహానికి అతడి తండ్రి నిరాకరించారు. దీంతో తన తండ్రి కారులో బాంబు పెట్టి పేల్చి చంపేందుకు గత ఏడాది నవంబర్‌లో ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చాడు. దీనిని గమనించిన బ్రిటన్ నేషనల్ క్రైం ఏజెన్సీ (ఎన్‌సీఏ) డమ్మీ బాంబును అతడి ఇంటికి డెలివరీ చేసింది. దానిని కారులో పెట్టి రిమోట్ పేల్చేందుకు యత్నిస్తుండగా అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

భారత్, చైనా కృషి భేష్

వాతావరణ మార్పులపై పోరాటాన్ని ప్రశంసించిన ఐరాస

ఐక్యరాజ్యసమితి: వాతావరణ మార్పులపై పోరును భారత్, చైనా ముందుండి నడిపిస్తున్నాయని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రశంసించింది. 'జీ–77' అధ్యక్ష పదవిని ఈజిప్ట్ చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులతో ఆఫ్రికా దేశాలే ప్రధాన బాధితులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగినోళ్లను ఇండ్లకు చేర్చే బాధ్యత బార్లదే

గోవా సీఎం మనోహర్ పారికర్



పనాజీ: మద్యపానంతో జరుగుతున్న ప్రమాదాలను గోవా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నది. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు ప్రారంభించామని సీఎం మనోహర్ పారికర్ శనివారం తెలిపారు. రాత్రివేళల్లో మద్యం తాగినవారు.. వాహనాలు నడుపుతూ ఇండ్లకు వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత బార్ల యాజమాన్యాలదేనని, ఇందుకోసం ప్రత్యేక చట్టాలను తీసుకురానున్నామన్నారు.

గుజరాత్‌లో అగ్నిప్రమాదం

ముగ్గురు యువతుల మృతి.. 15 మందికి గాయాలు

రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లా ప్రాన్స్‌లా గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రాష్ట్ర కథాశిబిరంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు యువతులు మృతిచెందగా, మరో 15 మంది గాయపడ్డారు. అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. గాయపడిన వారిని స్థానిక దవాఖానకు తరలించారని రాజ్‌కోట్ జిల్లా కలెక్టర్ విక్రాంత్ పాండే తెలిపారు.

క్షయ రోగుల పౌష్టికాహారానికి నెలకు 500!


న్యూఢిల్లీ: క్షయ వ్యాధిగ్రస్థుల పౌష్టికాహారం కోసం వ్యాధి నయం అయ్యే వరకు నెలకు రూ.500 చొప్పున నగదు అందజేయాలని కేంద్రం ప్రణాళిక రూపొందిస్తున్నది. 2025 నాటికి దేశంలో క్షయను 90 శాతం, 2030 నాటికి 95 శాతం నిర్మూలించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ లక్ష్యంగా ఉన్నది. ఆదాయం, స్థాయితో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా 25 లక్షల మంది క్షయ వ్యాధి రోగులకు నెలనెలా నగదు అందజేయాలన్న ప్రతిపాదన ఉన్నదని ఓ అధికారి చెప్పారు. రోగులు తమ ఆధార్ నంబర్, వైద్య చికిత్స పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ఆర్మీ చీఫ్ తన పని చూసుకుంటే చాలు

బిపిన్ రావత్‌కు జమ్ముకశ్మీర్ మంత్రి అల్తాఫ్ బుఖారీ సూచన

శ్రీనగర్: భారత సైనికాధిపతి జనరల్ బిపిన్ రావత్ ముందు తన విధులు తాను నిర్వర్తిస్తే చాలని, విద్యావ్యవస్థపై ప్రబోధాలు మానుకోవాలని శనివారం జమ్ముకశ్మీర్ విద్యాశాఖ మంత్రి అల్తాఫ్ బుఖారీ వ్యాఖ్యానించారు. సైన్యం సరిగ్గా విధులు నిర్వర్తిస్తే వేర్పాటు వాదమే పుట్టుకురాదని స్పష్టంచేశారు. జమ్ముకశ్మీర్‌లో విద్యా వ్యవస్థ యువతను తప్పుదోవ పట్టిస్తుండటంతో వారు వేర్పాటువాదులుగా మారుతున్నారని సైనికాధిపతి బిపిన్ రావత్ ఇటీవల ఆరోపించారు.

దేవుడికి వెండి రథం చేయిస్తా: సిద్ధరామయ్య



బెంగళూరు: మైసూర్ జిల్లాలోని మహదేశ్వర దేవాలయానికి వెండి రథాన్ని తయారు చేయిస్తానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తెలిపారు. తాను సీఎంగా ఉన్న ఐదేండ్ల కాలంలో పలువురు శ్రేయోభిలాషులు అందజేసిన వెండి బహుమతులన్నింటినీ ఈ రథం తయారీకి అందజేస్తానని పేర్కొన్నారు. మరోవైపు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వచ్చే నెల 10న ప్రారంభించనున్నారు.

షెరీన్ పెంపుడు తండ్రి దోషి

హ్యూస్టన్: భారత్ నుంచి దత్తత తీసుకెళ్లిన మూడేండ్ల బాలిక షెరీన్ మాథ్యూస్ మృతికి కారణమైన ఆమె పెంపుడు తండ్రిపై డల్లాస్ కోర్టుకు చెందిన గ్రాండ్ జ్యూరీ హత్యా నేరం మోపింది. కేరళకు చెందిన వెస్లీ మాథ్యూస్ (37), సినీ మాథ్యూస్ (35) దంపతులు గత ఏడాది బీహార్‌లోని ఓ అనాథాశ్రమం నుండి షెరీన్‌ను దత్తత తీసుకున్నారు. తీవ్రమైన హింసతోనే ఆ బాలిక మృతి చెందినట్టు పోస్ట్‌మార్టం నివేదికలో బయటపడింది. ఓ మారణాయుధంతోనే అంతటి గాయాలు కాగలవన్న జ్యూరీ వాటి వివరాల వెల్లడికి నిరాకరించింది.

కార్తీ చిదంబరం ఇండ్లపై ఈడీ దాడులు

- నేరాన్ని రుజువుచేసే ఆధారాలు లభించాయన్న అధికారులు
- దాడులను 'గతి తప్పిన హాస్య ప్రదర్శన'గా అభివర్ణించిన చిదంబరం



ఢిల్లీలోని చిదంబరం ఇంటి వద్ద ఈడీ అధికారులు

న్యూఢిల్లీ, జనవరి 13: ఎయిర్‌సెల్, మాక్సిస్ కేసులో నగదు అక్రమ లావాదేవీలకు సంబంధించి కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సంబంధించిన ఇండ్లు కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం దాడులు నిర్వహించింది. కార్తీకి సంబంధం ఉన్న పది నివాసాలతోపాటు ఢిల్లీలోని పీ చిదంబరం ఇంట్లో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. చెన్నైలోని తొమ్మిది ప్రాంతాలు, ఢిల్లీలోని చిదంబరం ఇంట్లో ఏకకాలంలో వేకువజామునే దాడులు జరిగాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కార్తీ వ్యక్తిగత సహాయకుడు, చార్టెర్డ్ అకౌంటెంట్ ఇండ్లను కూడా అధికారులు సోదా చేశారు. ఈ సోదాల్లో కార్తీ నేరాన్ని రుజువు చేసే పలు పత్రాలు తమకు లభించాయని అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఈ దాడులను చిదంబరం తీవ్రంగా ఖండించారు. తన కుమారునికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ దాడులను 'గతి తప్పిన హాస్య ప్రదర్శన'గా ఆయన అభివర్ణించారు. తన ఇంట్లో ఏమీ లభించకపోవడంతో తెల్ల మొహం వేసిన అధికారులు తప్పు చేశామేమోనన్న భావనతో వెళ్లారని చెప్పారు. ఇదే కేసులో ఈడీ గత డిసెంబర్ ఒకటో తేదీన కూడా కార్తీ బంధువుల ఇండ్లపై దాడులు చేసింది. హవాలా చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దాడులు చేసే అధికారం ఈడీకి లేదని చిదంబరం పేర్కొన్నారు. కాగా ఈడీ, సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగానే తాము దాడులు జరిపామని అధికారులు తెలిపారు.

అవి జాత్యహంకార వ్యాఖ్యలే

- ట్రంప్ 'మురికి' వ్యాఖ్యపై ఆఫ్రికా దేశాల ఆగ్రహం
- తీవ్రంగా ఖండించిన ఐరాస

వాషింగ్టన్, జనవరి 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాత్యహంకార వ్యాఖ్యలపై ఆఫ్రికా దేశాలు మండిపడ్డాయి. ఆఫ్రికా దేశాలను మురికి దేశాలన్న వ్యాఖ్యలు ట్రంప్ జాతి వివక్షకు, అజ్ఞానానికి నిదర్శనమని ఐరాసలో 55 ఆఫ్రికా దేశాల రాయబారుల బృందం శనివారం ఒక ప్రకటనలో ఖండించింది. ట్రంప్ తన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. 'ట్రంప్ వ్యాఖ్యలు తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయి. విదేశాల పట్ల అసహ్యకరమైన వివక్షాపూరితమైన ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పేర్కొన్నది. ఆఫ్రికా యూనియన్ అధిపతి మౌసా ఫకీ అధికార ప్రతినిధి ఎబ్బా కాలెండో మాట్లాడుతూ ట్రంప్ చేసిన వ్యాఖ్య స్పష్టంగా జాత్యహంకారమే అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు దిగ్భ్రాంతికరం, సిగ్గుచేటని ఐరాస వ్యాఖ్యానించింది. జెనీవాలో ఐరాస మానవ హక్కుల కమిషన్ అధికార ప్రతినిధి రూపర్ట్ కాల్విల్లె స్పందిస్తూ 'శ్వేత జాతీయులు కానంత మాత్రాన వివిధ ఖండాలు, దేశాలన్నీ మురికి దేశాలని మీరు వ్యాఖ్యానించలేరు' అని అన్నారు. బొట్స్వానా ప్రభుత్వం.. అమెరికా రాయబారిని పిలిపించి నిరసన తెలిపింది. సెనెగల్ విదేశాంగశాఖ మంత్రి సిదికి కాబా స్పందిస్తూ 'ఆఫ్రికా దేశాలపై ట్రంప్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ఈ వ్యాఖ్యలు ఆఫ్రికన్ల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ కింద పనిచేయను: పనామాలో అమెరికా రాయబారి రాజీనామా

పనామా దేశంలో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న జాన్ ఫీలే తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాజకీయాలు తనకు నచ్చడం లేదని, ఆయన కింద పనిచేయలేనని చెప్పారు. అమెరికా అధికార వర్గాలు మాట్లాడుతూ ఆఫ్రికా దేశాలపై ట్రంప్ చేసిన 'మురికి' వ్యాఖ్యలకు జాన్ ఫీలే రాజీనామాకు ఎలాంటి సంబంధం లేదని, వ్యక్తిగత కారణాల వల్లే ఆయన రాజీనామా చేశారని తెలిపాయి. రాయబారిగా విధులు నిర్వర్తించలేనని జాన్‌ఫీలే భావిస్తే ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తామని పేర్కొన్నాయి.

రాసలీలలు బయట పెట్టొదని అశ్లీల చిత్రాల నటికి ట్రంప్ రూ.82 లక్షలు చెల్లింపు



స్టెఫనీ క్లిఫర్డ్

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు డొనాల్డ్ ట్రంప్ జరిపిన రాసలీలలు బహిరంగ పర్చకుండా ఓ అశ్లీల చిత్రాల నటికి 1.3 లక్షల డాలర్లు (రూ.82,69,365) చెల్లించినట్లు ట్రంప్ న్యాయవాది మిఖైల్ కొహెన్ చెప్పారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక వార్తాకథనం ప్రచురించింది. మెలానియాతో వివాహానికి ముందు 2006లో గోల్ఫ్ క్రీడోత్సవాలకు హాజరైన ట్రంప్.. స్టెఫనీ క్లిఫర్డ్ అలియాస్ స్టోర్మీ డానియల్ అనే అశ్లీల చిత్రాల నటితో గడిపారని ఆ కథనం సారాంశం. అయితే అధ్యక్ష ఎన్నికల ప్రారంభానికి నెల రోజుల ముందు 2016లో ఏబీసీ న్యూస్‌తో మాట్లాడిన క్లిఫర్డ్.. ట్రంప్‌తో తన రాసలీలల విషయం బయటపెట్టడానికి ప్రయత్నించారు. కానీ ట్రంప్ న్యాయవాది మిఖైల్ కొహెన్ మధ్యవర్తిత్వం వహించి ఆమెకు 1.30 లక్షల డాలర్లు చెల్లించారని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొన్నది. ఇదిలా ఉంటే వాల్‌స్ట్రీట్ జర్నల్ 'పాత, వ్యర్థ కథనాలనే మళ్లీ వండి వార్చింది' అని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది.

హెలికాప్టర్ కూలి ఐదుగురు మృతి

మహారాష్ట్రలో దుర్ఘటన



మృతులకోసం గాలిస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

ముంబై: మహారాష్ట్రలో శనివారం ఓ రోడ్డు ప్రమాదం, పడవ ప్రమాదం, హెలికాప్టర్ ప్రమాదం జరిగాయి. ఈ ప్రమాదాల్లో 14 మంది మృతిచెందారు. 'ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్'(ఓఎన్జీసీ) సిబ్బంది ఐదుగురు, ఇద్దరు పైలట్‌లతో ప్రయాణిస్తున్న పవన్ హన్స్ హెలికాప్టర్ ముంబై తీరప్రాంతంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. ఉదయం 10.30 గంటలకు జుహు ఎరోడ్రోమ్ ప్రాంతం నుంచి బయలుదేరిన ఈ విమానం కొద్దిసేపటికే అదృశ్యమైంది. ఈ విషయాన్ని గుర్తించిన ఓఎన్జీసీ.. ముంబై తీరప్రాంత సిబ్బందికి సమాచారం అందించింది. దీంతో నౌకదళం, ఓఎన్జీసీ సిబ్బంది రంగంలోకి దిగి గాలింపు చేపట్టారు. ఐదుగురి మృతదేహాలను గుర్తించారు. మిగిలిన ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పడవ బోల్తాపడి ముగ్గురు విద్యార్థుల మృతి

పాల్ఘర్ జిల్లా దహాను తీర ప్రాంతంలో విద్యార్థుల విహారయాత్రలో విషాదం చోటుచేసుకున్నది. 40 మంది విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేటు పడవ బోల్తాపడి ముగ్గురు విద్యార్థినులు మృతిచెందారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. 32 మందిని రక్షించామని, గల్లంతయిన విద్యార్థుల కోసం తీరప్రాంతదళం, స్థానిక మత్స్యకారులతో కలిసి గాలింపు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. దహాను ప్రాంతంలోని పర్ణాకకు చెందిన పొండా స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు విహారయాత్రలో భాగంగా ప్రైవేటు పడవలో వెళ్తుండగా ప్రమాదం జరిగిందని ఎస్పీ మంజునాథ్ సింఘె చెప్పారు. దహాను తీర ప్రాంతం నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగిందని తీరప్రాంత అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

సాంగ్లిలో రోడ్డుప్రమాదం: ఆరుగురి మృతి, మృతుల్లో ఐదుగురు రెజ్లర్లు

సాంగ్లి జిల్లాలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఔంద్‌లో జరిగిన కుస్తీ పోటీల్లో పాల్గొన్న రెజ్లర్లు తిరిగి సాంగ్లి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందారు. మృతుల్లో ఐదుగురు రెజ్లర్లు ఉన్నారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదం జరిగాక ట్రాక్టర్ డ్రైవర్ పారిపోయాడని.. అతడిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు చెప్పారు. మరోవైపు ముంబై విమానాశ్రయంలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రాణనష్టం వాటిల్లలేదని వారు చెప్పారు.

బీజేపీలో చేరిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు

అగర్తలా: కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరిన త్రిపుర ఎమ్మెల్యే రతన్ లాల్‌నాథ్‌పై స్పీకర్ అనర్హత వేటు వేశారు. మోహన్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై ఆయన గెలిచారు. స్పీకర్ మాట్లాడుతూ రతన్ పార్టీ మారడంపై త్రిపుర కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారని, దీంతో తన ముందు హాజరై వివరణ ఇవ్వాలని రతన్‌కు సూచించానని తెలిపారు. ఆయన హాజరుకానందు వల్ల చట్ట ప్రకారం అనర్హత వేటు వేశానని పేర్కొన్నారు.

సాంకేతికతతో పీఎస్సీల పనితీరు మెరుగు

- యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ష్యూమెలా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా పారదర్శకతను పెంపొందించవచ్చని, ప్రస్తుతకాలంలో ఇది తప్పనిసరి అని యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ డేవిడ్ ఆర్ ష్యూమెలా అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించడం, ఇతరత్రా ప్రక్రియల్లో సాంకేతికతను పటిష్టంగా అమలుచేయాల్సి ఉందన్నారు. గోవాలో జరుగుతున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్ల స్టాండింగ్ కమిటీ సదస్సులో యూజీసీ చైర్మన్ శనివారం ప్రసంగించారు. తాజా సదస్సులో పీఎస్సీలను పటిష్టం చేసేందుకు తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల స్టాండింగ్ కమిటీ చైర్మన్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి మెరుగైన సేవలు అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తనను ఈ పదవికి తిరిగి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలి

- విదేశీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి ఎంజే అక్బర్ పిలుపు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశ రక్షణతోపాటు తీవ్రవాద సమస్యను దీటుగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉండాలని విదేశీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి ఎంజే అక్బర్ అన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో శనివారం హైయర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు (హెచ్‌డీఎంసీ) అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రపంచంలో వస్తున్న మార్పుల దృష్ట్యా భారత్ యొక్క పాత్ర, ఆకాంక్షలను అధికారులతో చర్చించారు.

మాదిగల అభివృద్ధికి బడ్జెట్‌లో

నిధులు కేటాయించండి

- గత ప్రభుత్వాలు ఒకేవర్గానికి మేలు చేశాయి: వంగపల్లి శ్రీనివాస్



ముషీరాబాద్: త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మాదిగల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. గత ప్రభుత్వాల హయాంలో మాదిగలు, మాదిగ ఉపకులాలకు చెందాల్సిన సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని విద్యానగర్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మీడి యాతో పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దండు సురేందర్, కనకరాజు, చాప కృష్ణ, గడ్డం అంజయ్య, దశరథ, కొల్లూరి వెంకట్, చందు, రమేశ్, సునీల్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

సెలవు మంజూరులో పాతపద్ధతి కొనసాగించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయులకు సెలవుమంజూరు చేసే అధికారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బీ భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జీ సదానందంగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సెలవు దరఖాస్తులను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ద్వారా మండల విద్యాశాఖాధికారికి పంపాలంటూ పాఠశాల విద్యాకమిషనర్ ఇచ్చిన ఉత్వర్వులను ఉపసంహరించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



కర్ణాటకలోని తెలంగాణవాసుల కోసం బెంగళూరులో పంపన తెలంగాణ భవన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ కన్నడ రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ (కేఆర్టీఏ) సభ్యులు శనివారం ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రత్నప్రభకు వినతిపత్రం సమర్పించారు. వారిలో కేఆర్టీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల, సభ్యులు ఈవీ సతీశ్‌కుమార్, శరత్‌చంద్ర, రాజేందర్ ఉన్నారు.

నాణెం మిథ్యా.. ధనం మిథ్యా!



కొద్ది పెట్టుబడితో కోటీశ్వరులు కావొచ్చు.. తెలంగాణ, ఏపీల్లో రహస్యంగా 'బిట్ కాయిన్' ట్యుటోరియల్స్!

ఆర్థికాభివృద్ధి కోర్సు పేరిట ఊదరగొడుతున్న దళారులు.. 15 రోజులకు రూ.15 వేలు ఫీజు

బ్యాంకు పెట్టుబడుల కంటే మెరుగని బురిడీ.. క్రిప్టోకరెన్సీపై అవగాహన లేకుంటే అసలుకే మోసం

శిరందాస్ ప్రవీణ్‌కుమార్
హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి- నమస్తే తెలంగాణ:

'లక్షో.. రెండు లక్షలో.. మీవి కాదనుకోండి. ప్రపంచానికి కనిపించని నాణేలను కొనెయ్యండి. మీకు కాస్త కంప్యూటర్ నాలెడ్జ్, స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ లావాదేవీలు చేసే నాలెడ్జి ఉంటే కోటీశ్వరులను చేసే పూచీమాది. భవిష్యత్తంతా భౌతికంగా కనిపించని ఈ కరెన్సీదే. ఈ నాణేలను ఎప్పుడు అమ్మాలో మేం చెప్తాం. ఈజీమనీ భ్రమ కాదు. నిజం'అని ఓ చిన్నగదిలో ప్రొజెక్టర్, స్క్రీన్‌పై ఓ వ్యక్తి ఇస్తున్న పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న 30 మందిని మాయా ప్రపంచంలోకి తీసుకెళ్తున్నది. ఈవిధంగా చేసే తాను లక్షలు సంపాదించానని చెప్తున్నాడు. దాదాపు గంటా నలభై అయిదు నిమిషాలపాల అతని ప్రసంగం విన్నవాళ్లెవరైనా ఆ పెట్టుబడులకు ఆకర్షితులవవడం ఖాయం. అప్పు చేసైనా అదృశ్య కరెన్సీని కొనేయ్యాలని తహతహలాడుతారు. దీనిపేరు క్రిప్టో కరెన్సీ. ప్రపంచవ్యాప్తంగా ఏకరూప కరెన్సీ చలామణి కానున్నదన్న పేరుతో బిట్‌కాయిన్ల రూపంలో క్రిప్టో కరెన్సీ వ్యవస్థ వేళ్లూనుకొన్నది. ప్రపంచంలోని అన్ని దేశాలూ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఏ దేశానికీ చెందని బిట్‌కాయిన్ వ్యవస్థ ప్రపంచ దేశాలన్నింటినీ తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఈ పరిస్థితిని సొమ్ము చేసుకొనేందుకు కొందరు బిట్‌కాయిన్ ట్యూటర్లుగా అవతరించారు. ఓ ట్యూటర్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఓ మినీ క్లాస్ ను 'నమస్తే తెలంగాణ' పరిశీలించినప్పుడు ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. ఈ ట్యూటర్లు అనుయాయులు, నమ్మకస్తులు, బంధువులకే రహస్య అవగాహన కల్పిస్తున్నారు.బిట్‌కాయిన్ల కొనుగోలు, బదిలీ, అమ్మకంపై అవగాహన కోసం ఒక కోర్సు నేర్చుకోవాలని.. దీనికి రూ.15వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరిస్తారు. మిడిమిడి జ్ఞానంతో క్రిప్టో కరెన్సీ లావాదేవీలను ప్రారంభిస్తే తీవ్రంగా నష్టపోతారని భయపెడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ తరగతులు ఇప్పుడు జరుగుతున్నాయి. వీటిద్వారా ఆకర్షితులైన వారికి తాము రూపొందించిన కోర్సుల్లో శిక్షణ ఇచ్చి.. ఆ తర్వాత అసలు రంగంలోకి దింపుతున్నారు.

ఎగువ మధ్యతరగతి వర్గమే లక్ష్యం

ఉద్యోగస్తులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులే క్రిప్టో కరెన్సీ వ్యాపారానికి లక్ష్యంగా మారుతున్నారు. వీరందరినీ సమీకరించడానికి ఏజెంట్లు పనిచేస్తున్నారు. సాధారణంగా తక్కువగా ఉత్పత్తి అయ్యే వస్తువులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. బిట్‌కాయిన్ వ్యవస్థ కూడా అంతేనని ట్యూటర్లు నమ్మిస్తున్నారు.

2009 నుంచి ఉనికిలోకి..

మొదటిసారి 2008లో బిట్‌కాయిన్‌పై ఓ వ్యాసం ఒక జపనీయుడి పేరుతో ప్రచురితమైంది. 2009 జనవరి 3నుంచి ఈ వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఇది ఏ దేశం నియంత్రణలో ఉన్నదీ, సృష్టికర్త ఎవరన్నది ఎవరికీ తెలియదు. ఇది పూర్తిగా ఆన్‌లైన్ ద్రవ్యవ్యవస్థ. భౌతికంగా దీనికి ఎలాంటి అస్తిత్వం లేదు. కంప్యూటర్ల ద్వారా గణిత శాస్త్ర సమీకరణాలతో బిట్‌కాయిన్లను సృష్టిచేసి వాటిని మార్కెట్‌లో అమ్ముతారు. ప్రస్తుతం ప్రపంచంలో 1.22కోట్ల బిట్‌కాయిన్లు ఉన్నట్లు అంచనా. వీటిని 2.1కోట్లకు మించకుండా ఉండేలా విధానాన్ని రూపొందించారు. క్రిప్టో కరెన్సీ చెలామణిలో డిపాజిట్ కీ, డ్రా కీ ఉంటాయి. దాంతో మరొకరు దొంగతనం చేసే వీల్లేకుండా పారదర్శకంగా ఉంటుందన్నది ట్యూటర్ల అభిప్రాయం. కనీసం 1200 రకాల కాయిన్లు ప్రస్తుతం చలామణిలో ఉన్నాయని అంచనా.

మోసాలు మామూలే

ఎల్బీనగర్‌కు చెందిన ఓ వ్యాపారి బిట్‌కాయిన్లను కొనేందుకు ఆన్‌లైన్‌లో ఒప్పందం కుదుర్చుకొన్నాడు. గుజరాత్ నుంచి ఓ వ్యక్తి తన దగ్గరున్న కాయిన్లను అమ్మడానికి వచ్చాడు. రూ.12 లక్షల లావాదేవీకి సిద్ధమయ్యారు. కాయిన్లను బదిలీ చేస్తున్న సమయంలో గుజరాతీకి సంబంధించిన 'కీ' తెలుసుకొన్న మరో అజ్ఞాత వ్యక్తి ఆ కాయిన్లను వేరేవారికి అమ్మేశాడు. సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయిస్తే గానీ అసలు విషయం ఇద్దరికీ అర్థం కాలేదు. బిట్‌కాయిన్లకు సంబంధించి అనేక బోగస్ వెబ్‌సైట్లు దర్శనమిస్తున్నాయి. ఏది అసలో, ఏది నకిలీదో గుర్తించిన తర్వాతే లావాదేవీలకు అడుగేయాలి.

వాట్సప్ గ్రూపుల్లోనే అంతా..

బిట్ కాయిన్, వన్ కాయిన్.. ఇలా క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టిన వారంతా వాట్సప్ గ్రూపులను నడిపిస్తున్నారు. లాభదాయకమైన అంశాన్ని గుర్తించగానే ఒకరికొకరు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఒకరు కాయిన్స్‌ను విక్రయిస్తే మిగతావారూ అనుకరిస్తున్నారు. ఒక దాంట్లో నుంచి మరొక కాయిన్స్‌లోకి పెట్టుబడులను మార్చేందుకు ఈ గ్రూపుల్లోనే చర్చించుకుంటున్నట్లు ఓ ట్యూటర్ వివరించారు.ఆన్‌లైన్‌లో సమాచారం:www.coingecko.com,Ripple (XRP), www.koinex.in, asiadigcoin. org, ethicsindia. com, zebpay, BTX India, youdontknow, www.onecoin.eu, Bitcoin india వంటి అనేక వెబ్‌సైట్లల్లో క్రిప్టో కరెన్సీ గురించి సమాచారం లభిస్తున్నది. బిట్ కాయిన్, ఈథర్, రిప్పల్, లైట్‌కాయిన్, బిట్ కాయిన్ క్యాష్, నియో, స్ట్రాటిస్ కాయిన్స్ క్రిప్టో కరెన్సీని నడిపిస్తున్నాయి.

ఇండియాలో వ్యాపారం

జనవరి మూడో తేదీ నాటికి డిజిటల్ అసెట్స్ అండ్ బ్లాక్ చైన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం

- క్రిప్టో కరెన్సీ మార్పిడి కంపెనీలు: 10
- నెలకు రూ.10 వేల కోట్ల మార్పిడి
- 50 లక్షల మంది వినియోగదారులు
- బదిలీ చార్జీలు 0.5 నుంచి 2 శాతం వరకు
- పెరుగుదల 10 శాతం/సంవత్సరం
- ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు రూ.లక్ష కోట్ల మార్పిడి

పుట్టగొడుగుల్లా క్రిప్టో దుకాణాలు

హైదరాబాద్‌లో క్రిప్టో కరెన్సీ దుకాణాలు అసంఖ్యాకంగా ఉన్నా వాటిని గుంభనంగా నడిపిస్తున్నారు. వాటికి బోర్డులుండవు. చాలా వరకు అపార్టుమెంట్లలోనే నడుస్తున్నాయి. ఎల్బీనగర్ ప్రాంతంలోని ఓ ఆఫీసుకు 'నమస్తే తెలంగాణ' వెళ్లింది. రెండో అంతస్తులో ఉంది. ఐతే ప్రత్యేక సమయంలో మాత్రమే దాన్ని తెరుస్తారని గుర్తించింది. పైగా అక్కడ ఎంటర్‌ప్రైజెస్ పేరిట బోర్డు ఉంది. ఏజెంట్లు వారి అనుయాయులతో పెట్టుబడి పెట్టిస్తున్నారు. ఐతే 'కీ(పాస్‌వర్డ్)' మాత్రం చెప్పకుండా మోసాలకు పాల్పడుతున్నారని సమాచారం.

చిన్నపరిశ్రమలు ఖాయిలా పడొద్దు

- నెలకోసారి జిల్లాస్థాయిలో బ్యాంకర్లతో సమావేశాలు
- రెండుసార్లు ముద్రారుణమేళాలు
- కలెక్టర్లకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు



శనివారం సచివాలయంలో కలెక్టర్లతో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, గనులశాఖపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిన్న పరిశ్రమలను ఆదుకునేందుకు నెలకోసారి జిల్లాస్థాయిలో కలెక్టర్ల సమావేశం నిర్వహించాలని గనులు, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశించారు. శనివారం సచివాలయంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, గనులశాఖపై మంత్రి కేటీఆర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా వాటి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. జిల్లాస్థాయిలోనే బ్యాంకర్లతో సమావేశమై చెల్లింపుల్లో స్వల్ప ఆలస్యం కారణంగా పరిశ్రమలు ఖాయిలా పడకుండా చూడాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం రెండుసార్లు ముద్రారుణమేళాలు నిర్వహించాలని కలెక్టర్లకు ఆయన సూచించారు.

ప్రజలకు ఇసుక.. ప్రభుత్వానికి ఆదాయం

అక్రమ మైనింగ్, అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి కేటీఆర్ కలెక్టర్లను ఆదేశించారు. గత దశాబ్దకాలంగా వచ్చిన ఆదాయం కన్నా ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఇసుకపై అనేక రెట్ల ఆదాయం ఖజానాకు చేరుతున్నదని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఇసుక- ఖజానాకు ఆదాయం అనే రెండు ప్రధాన లక్ష్యాలు నెరవేర్చడానికి ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ఇప్పటికే గద్వాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో ఇసుక రవాణాలో ఆయా జిల్లాల కలెక్టర్లు పలు అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టారని, వాటిని ఇతర జిల్లాల కలెక్టర్లు సైతం అమలు చేయాలన్నారు. ఇసుక అక్రమరవాణా అరికట్టేందుకు డీజీపీ ప్రత్యేకంగా మరోసారి సమావేశం అవుతారని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో జిల్లా మినరల్ ఫౌండేషన్ గవర్నింగ్ కౌన్సిళ్ల (డీఎంఎఫ్)ను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీచేశారు.



శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం. చిత్రంలో మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు,

ఎన్నికల ప్రక్రియ పదిరోజులే

మొదటిపేజీ తరువాయి...

ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి ముసాయిదాను అందజేశారు. రెండునెలలపాటు నిపుణుల కమిటీ అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్ చట్టాలను పరిశీలించి.. తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టానికి రూపకల్పన చేసింది. ఈ ముసాయిదాలోని అన్నిఅంశాలపై అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావుతోసహా న్యాయనిపుణులు, అధికారులతో మంత్రివర్గ ఉపసంఘం కూలంకషంగా చర్చించింది. పంచాయతీరాజ్ బలోపేతమే లక్ష్యంగా నూతన చట్టానికి రూపకల్పన జరిగింది. సర్పంచ్‌లకు మరిన్ని అధికారాలు, గ్రామాలకు నిధులు కేటాయించడం ద్వారా స్థానిక సంస్థలను మరింత పటిష్ఠం చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తండాలను పంచాయతీలుగా మార్చాలని, నూతన పంచాయతీలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు విస్తృతాధికారాలతోపాటు బాధ్యతలను కూడా ఇందులో పేర్కొన్నారు. కొత్త చట్టం ద్వారా ఇకపై సర్పంచ్‌కే పూర్తి కార్యనిర్వహణ అధికారాలు అప్పగించాలని ముసాయిదాలో పేర్కొన్నారు. కొత్తగా పంచాయతీలకు ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులను నియమించాలని సిఫారసు చేశారు. కో-ఆప్షన్ సభ్యులుగా సేవాభావం కలిగిన ఒకవ్యక్తికి, గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలికి, గ్రామంపై, చట్టాలపై అవగాహన ఉన్నవారికి అవకాశం కల్పించాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

వరుసగా రెండు ఎన్నికలకు ఒకేసారి రిజర్వేషన్

కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఇప్పటివరకు ఉన్న రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా వరుసగా రెండు ఎన్నికలకు ఒకే రిజర్వేషన్ అమలు కానుంది. రెండునెలలకు ఒకసారి గ్రామసభ, నెలకొకసారి పాలకవర్గం సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. వరుసగా మూడుసార్లు పాలకవర్గ సమావేశాలకు హాజరుకాని సభ్యుడిపై వేటువేస్తారు. సమావేశానికి హాజరైన సర్పంచ్, వార్డు సభ్యులకు సిట్టింగ్‌ఫీజు ఇవ్వాలని ముసాయిదాలో పేర్కొన్నారు. ఇప్పటివరకు జీ ప్లస్ టు, పది మీటర్ల ఎత్తు, మూడొందల చదరపు గజాల కన్నా ఎక్కువ స్థలంలో నిర్మించే భవనాలకు డీటీసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్న నిబంధన ఉన్నది. అయితే, ఇందుకోసం మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటుచేయాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చిన వారంరోజుల్లోనే భవన నిర్మాణానికి పంచాయతీ క్లియరెన్స్ ఇవ్వాలని ముసాయిదాలో పేర్కొన్నారు. ఇప్పటివరకు పరిశ్రమల ఏర్పాటుకు పంచాయతీల అనుమతి అవసరం ఉండగా, ఈ నిబంధనను తొలిగించారు.

సిటిజన్ చార్టర్ అమలు: ప్రజలకు ప్రత్యేకంగా హక్కులను కల్పిస్తూ సిటిజన్ చార్టర్‌ను ముసాయిదా చట్టంలో పొందుపరిచారు. పారిశుద్ధ్యం, శ్మశానవాటికలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో పొందే హక్కులు ప్రజలకు దక్కనున్నాయి. చట్టానికి లోబడి వ్యవహరించని ప్రజలపై జరిమానా విధించే హక్కును సర్పంచ్ నేతృత్వంలోని పాలకవర్గానికి అప్పగించనున్నారు. రోడ్లపై చెత్తవేయడం, ఇంట్లోని నీటిని వీధుల్లోకి వదలడం, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం సహా.. 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించేవారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే అవకాశం కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు.. అక్రమ నిర్మాణాల్లాంటివి చేపడితే వాటిని తొలిగించేందుకు అయ్యే ఖర్చును కూడా కారకుల నుంచే వసూలు చేసేలా నిబంధనలు పొందుపరిచారు.

పంట పెట్టుబడి పథకం సిఫారసులు సమర్పణ

పంట పెట్టుబడి మద్దతు పథకం అమలుపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఉపసంఘం శనివారం సచివాలయంలో సమావేశమైంది. అనంతరం మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు సీఎం కేసీఆర్‌ను కలిసి తమ సిఫారసులను అందజేశారు.

క్రమశిక్షణ చర్యలపై విచారణకు అప్పిలేట్ అథారిటీ

సర్పంచ్‌లపై జిల్లా కలెక్టర్ తీసుకొనే క్రమశిక్షణ చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ఇప్పటివరకు ప్రభుత్వం తరపున పంచాయతీరాజ్ మంత్రే వ్యవహరిస్తున్నారు. ఇకపై ఇలాంటి అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ట్రిబ్యునల్ వ్యవస్థ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. నిధుల అవకతవకలకు పాల్పడే సర్పంచ్‌లపై కఠినచర్యలు తీసుకునేలా ముసాయిదాలో పొందుపరిచారు. పంచాయతీల్లో ఆడిటింగ్ ప్రక్రియను తొమ్మిది నెలల నుంచి కుదించేలా చట్టంలో మార్పుచేయాలని సూచించారు. పంచాయతీల్లో జరుగుతున్న నిధుల వ్యయం, పన్నుల వసూళ్లతోపాటు ఆదాయ -వ్యయాలు, తీర్మానాలు తదితర అన్నిఅంశాలను విధిగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ప్రతిపాదించారు. గ్రామసభలో ఆదాయ, వ్యయాలు ప్రవేశపెట్టాలని ముసాయిదాలో పేర్కొన్నారు. గ్రామంలోని ఓటర్లసంఖ్య ఆధారంగా 50 నుంచి 400 వరకు ప్రజల హాజరును కోరంగా పొందుపరిచారు. ఇప్పటివరకు మహిళా సర్పంచ్, వార్డుమెంబర్లకు నాలుగు నెలలపాటు ఉన్న ప్రసూతి సెలవులను ఆరు నెలలకు పెంచాలని నిర్ణయించారు.

తెలంగాణ కీర్తిని చాటుతూ

'కాకతీయ కళావైభవ మహోత్సవం'



హైదరాబాద్‌లో కాకతీయ కళావైభవ మహోత్సవం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న టీ సుబ్బరామిరెడ్డి, సినీనటుడు మోహన్‌బాబు, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కూచిపూడి నృత్యకారిణులు పద్మజ, వింజమూరి సుజాత

17న శిల్పకళా వేదికలో ప్రారంభం

సినిమాడెస్క్, నమస్తే తెలంగాణ: టీఎస్సార్ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాల్ని దిగ్విజయంగా నిర్వహించిన టీ సుబ్బరామిరెడ్డి మరో బృహత్ వేడుకకు శ్రీకారం చుట్టబోతున్నారు. కాకతీయుల ఘనచరిత్రను చాటిచెప్తూ 'కాకతీయ లలిత కళా పరిషత్' ఆధ్వర్యంలో 'కాకతీయ కళావైభవ మహోత్సవం' పేరుతో ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో భారీవేడుకను నిర్వహించబోతున్నారు. ఇదే వేదికపై సీనియర్ నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబును విశ్వనటసార్వభౌమ బిరుదుతో సత్కరించనున్నారు. శనివారం మీడియాకు సుబ్బరామిరెడ్డి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ వేడుకకు మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. 'కాకతీయుల కళావైభవాన్ని ప్రజలకు తెలుపాలనుకోవడం అభినందనీయం. నాకు ప్రదానం చేయబోతున్న 'విశ్వనటసార్వభౌమ' బిరుదు గురించి చెప్పినప్పుడు మొదట వద్దని వారించాను. ఆయన అభీష్టాన్ని కాదనలేక ఒప్పుకొన్నాను' అని నటుడు మోహన్‌బాబు అన్నారు. 'మిషన్ కాకతీయ' వంటి కార్యక్రమాలకు కాకతీయులు స్ఫూర్తిగా నిలిచారని సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ గుర్తుచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు, కాకతీయ కళావైభవ మహోత్సవం ఉత్సవ కమిటీ వర్కిం గ్ ప్రెసిడెంట్ లయన్ విజయ్‌కుమార్, కూచిపూడి నృత్యకారిణులు పద్మజ, వింజమూరి సుజాత పాల్గొన్నారు. నమస్తే తెలంగాణ, టీవీ9 మీడియా భాగస్వామ్యంలో ఈ వేడుకలు జరుగనున్నాయి.

ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో గులాబీ జయకేతనం

మొదటిపేజీ తరువాయి...

సంఘటనలు లేకుండాప్రశాంత వాతావరణంలో ముగిసింది. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఉపఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజ యం పట్ల మంత్రులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే ఎంపీటీసీ ఎన్నికల్లో విజయాన్ని సాధించిపెట్టాయని గెలుపొందిన అభ్యర్థులు పేర్కొన్నారు. విపక్షాలు ఓటర్లను ఆకర్షించేందుకు వేసిన ఎత్తులను ప్రజలు పట్టించుకోలేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఉపఎన్నికలు జరిగిన జిల్లాల్లో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

ఎన్నికలు ఏవైనా ప్రజలు టీఆర్ఎస్ వైపే

ఎన్నికలు ఏవైనా ప్రజలంతా టీఆర్ఎస్‌వైపే నిలుస్తున్నారు. ఈ ఫలితాలను బట్టి రాష్ట్రంలో ప్రభుత్వ పాలనకు ప్రజల మద్దతు ఉన్నదని స్పష్టమవతున్నది. రైతులకు వ్యవసాయ పెట్టుబడి కింద రూ.8 వేలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు ఇస్తే, ప్రతిపక్షాలకు ఉనికే లేకుండా పోతుంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలను టీఆర్ఎస్ దక్కించుకోవడం ఖాయం.

-పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి

ఎంపీటీసీ ఉపఎన్నికల ఫలితాలు

జిల్లా	మండలం	ఎంపీటీసీ స్థానం	గెలిచిన అభ్యర్థి -పార్టీ
కుమ్రంభీం-ఆసిఫాబాద్	సిర్పూర్-యూ	నెట్నూర్ (ఎస్టీ)-ఏకగ్రీవం	పుర్క కళాబాయి(టీఆర్ఎస్)
	కౌటాల	కౌటాల (ఎస్టీ)	పసునూరి స్వప్న (టీఆర్ఎస్)
కరీంనగర్	గంగాధర	గంగాధర (బీసీ)	పెరుక శ్రవణ్‌కుమార్ (బీజేపీ)
	గంగాధర	అచ్చంపల్లి (జనరల్)	పెరుమళ్ళ మనోహర్ (కాంగ్రెస్)
రాజన్న-సిరిసిల్ల	సిరిసిల్ల	అంకుషాపూర్ (బీసీ)-ఏకగ్రీవం	సదా లావణ్య (టీఆర్ఎస్)
భద్రాద్రి-కొత్తగూడెం	భద్రాచలం	భద్రాచలం-7 (ఎస్టీ)	విస్లావత్ స్వరూప (టీఆర్ఎస్)
ఖమ్మం	కూసుమంచి	జక్కేపల్లి (ఎస్టీ-మహిళ)	వీరభద్రమ్మ (టీఆర్ఎస్)
మహబూబ్‌నగర్	మక్తల్	లింగంపల్లి (బీసీ)	భూదండ్ల లింగమ్మ (స్వతంత్ర అభ్యర్థి)
	నర్వ	కన్మనూర్ (ఎస్టీ-మహిళ)	గోవిందమ్మ (టీఆర్ఎస్)
వనపర్తి	పానగల్	గోపాల్‌దిన్నె (బీసీ)	లక్ష్మీదేవమ్మ (టీఆర్ఎస్)
నల్లగొండ	మునుగోడు	కిష్టాపురం (బీసీ)	కడారి లింగయ్య (టీఆర్ఎస్)
	నిడమనూర్	ఎర్రబెల్లి (బీసీ)	మన్నెం వెంకన్న (టీఆర్ఎస్)
కామారెడ్డి	మద్నూర్	మద్నూర్-2 (బీసీ)	రాములు (బీజేపీ)
రంగారెడ్డి	శంకర్‌పల్లి	జన్వాడ (బీసీ)	తిరుమాని మల్లేశ్ (టీఆర్ఎస్)
	శంషాబాద్	కొత్వాల్‌గూడ (బీసీ-మహిళ)ఏకగ్రీవం	అనూరాధ (స్వతంత్ర్య అభ్యర్థి)
సిద్దిపేట	చేర్యాల	ఆకునూరు-1(బీసీ)	తాటికొండ వేణుగోపాల్ (కాంగ్రెస్)

సీఎం కేసీఆర్ అభివృద్ధి.. సంక్షేమ పథకాలే గెలిపించాయి

సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లనే ఎంపీటీసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయ దుందుభి మోగించింది. ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సీఎం కేసీఆర్ సమర్థతకు సంకేతం. గత మూడున్నరేండ్లుగా ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలతో సీఎం చేరువయ్యారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని చూసి ప్రజలు టీఆర్ఎస్‌కు ఓట్లు వేశారు. విపక్షాల అబద్ధపు మాటలను ప్రజలు నమ్మలేదు. రాబోయే రోజుల్లో ఆ పార్టీల అడ్రస్సే గల్లంతవుతుంది.

-దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 14 జనవరి 2018



జీవితాల్లో కాంతి నింపే సంక్రాంతి

సంస్కృతీ చిహ్నాలుగా, సంప్రదాయ వైభవాలుగా విలసిల్లేవి పండుగలు. మనలో సహజమైన చైతన్యాన్ని ఉత్తేజపరుస్తూనే, మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి వేదికగా మారి అలరించేదే అసలైన పండుగ. కుటుంబ నేపథ్యానికి అద్దం పడుతూ అందరినీ ఒకచోట చేర్చి సమిష్టి తత్వానికి ఆలంబనగా నిలిచేదే తెలుగు పండుగ. అందుకనే పండుగల్లో సంక్రాంతి అగ్ర తాంబూలం అందుకున్నది. పెద్దపీట వేసి పెద్దపండుగగా పిలుచుకుంటున్నాం.

కాలంతో పరుగెత్తే మనకు, కాలగణనకు రూపం ఇచ్చిన సూర్యభగవానుడు రాశికి ముప్పై రోజుల చొప్పున సంచారం చేస్తూ ఒక రాశి నుంచి మరోరాశిలోకి ప్రవేశించడమే సంక్రాంతి లేదా సంక్రమణం. సూర్యుడు ఏ రాశిలోకి ప్రవేశిస్తే ఆ రాశి పేరున సంక్రాంతి వస్తుంది. అలా మనకు ఏడాది పాటు పన్నెండు సంక్రాంతులు ఉంటాయి. కానీ పన్నెండు సంక్రాంతుల్లోకెల్లా సుదీర్ఘమైన పుణ్యకాలం ప్రారంభమయ్యేదీ, మకర సంక్రాంతి తరువాత నుంచీ మన తెలుగు లోగిళ్లలో శుభకార్యాలను తలపెట్టడం ఆనవాయితీ కనుక మకర సంక్రాంతి శుభ సంక్రాంతిగా పేరుగాంచింది.

క్రాంతి అంటే వెలుగు. సంక్రాంతి అంటే కొత్త వెలుగు. అందుకనే సంక్రాంతి కేవలం పండుగే కాదు. గొప్ప సదాచారం. ఆధునికత మనల్ని ఎంతగా మార్చేసినా మనవైన ఆనవాళ్లు నిత్యనూతనమై సంక్రాంతి సందర్భంగా తమ స్వరూప స్వభావాలను వ్యక్తీకరిస్తూనే ఉంటాయి.

సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులను నింపాలనే ఆకాంక్షకు అద్దం పడుతుంది. మూడు నాలుగు రోజుల మహాపర్వం సంక్రాంతి. భోగి, సంక్రాంత, కనుమ, ముక్కనుమ ఈ నాలుగింటినీ పండుగలుగానే జరుపుకొనే ఆచారం మనది. పండుగనగానే మన లోగిళ్లు కళకళలాడుతాయి. సంక్రాంతి అందునా కళాతోరణమై శోభిల్లుతుంది. భోగిమంటలు, భోగి గడలూ, బొమ్మల కొలువులూ, హరిదాసులూ, పాడిపంటలూ, పేరంటాలూ, పిండివంటలూ, దానధర్మాలూ, గంగిరెద్దులూ ఇలా ప్రతీదీ ఆడంబరమే, వైభోగమే.

సౌరమానం ప్రకారం వచ్చే ప్రత్యేకమైన పండుగ మకర సంక్రాంతి. జీవకారకుడైన సూర్యుడు మనకు ప్రత్యక్ష దైవం. ప్రకృతికీ, మానవులకూ మధ్య సమతుల్యత అనే ధర్మం సంక్రాంతి పండుగ వల్ల సుసంపన్నమవుతుంది. ఎందుకంటే ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలం, జలం నుంచి భూమి. భూమినుంచి ఓషధులు, ఓషధులపై సౌరశక్తి ప్రసార ప్రాభవంతో అన్నం, అన్నం నుంచి... అన్నం వలన అన్నం కోసం మనిషి ఉద్భవించాడనేది వేదవాక్కు. అన్ని పంటలూ చేతికొచ్చి మన జీవితాల్లో సమృద్ధిని నింపే పౌషణలక్ష్మికి ఆహ్వానం పలికే సంక్రాంతి జీవన ధర్మంగా పరిఢవిల్లింది.

దక్షిణాయనానికీ, ధనుర్మాసానికీ చివరిరోజైన భోగితో సంక్రాంతి పండుగ శోభ ప్రారంభమవుతుంది. తెలిమంచులో భోగిమంటలు వెలిగిస్తూ, మనసుల్లోని మాలిన్య భావాలను ఆ మంటల్లో వేసి మంచి మనసులతో పండుగ ప్రారంభం చేస్తాం. పిల్లలకు భోగిపళ్లు పోసి వారి చిరునవ్వుల్లోని నిర్మలత్వాన్ని ఆపాదించుకుంటాం. ఇక సంక్రాంతి అంటే ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభరోజు. కొత్త బియ్యంతో పొంగలి వండి ప్రపంచానికి అన్నాన్నిచ్చి ప్రజారక్షణ చేసిన భగవంతునికి నివేదన చేస్తాం. ఇంటినిండుగా ఉన్న ధాన్యలక్ష్మి ఆశీర్వాదంతో తోచినంత దానధర్మాలు చేయడం, పితృదేవతలను స్మరించుకొని తర్పణాలు ఇవ్వడం, గొబ్బెమ్మలూ ముగులు చేరగా ఇంటి లోగిళ్లు కళకళలాడడం సంక్రాంతి వైభోగంగా అలరారుతుంది. ఇంటింటి సౌభాగ్యం, దేశ సౌభాగ్యంగా సంక్రాంతి సంస్కృతి శోభిల్లుతుంది. రైతుతోపాటు ఆరుగాలం శ్రమించే బసవన్నలకు గౌరవమిచ్చేలా కనుమ పండుగ జరుగుతుంది. మానవ మనుగడకు సహకరించే పశుపక్ష్యాదులకు కృతజ్ఞతలు చెల్లించుకునే మహత్తర పర్వం కనుమ.

కనుమనాడు ఎటువంటి ఆర్భాటాలు లేకుండా పూజ ముగించుకొని పశువులను అలంకరిస్తారు. వరికంకులనూ ఇళ్లకు కట్టి పక్షులకు ఆహారంగా ఉంచుతారు. కనుమ తర్వాతి రోజు ముక్కనుమ. సంక్రాంతి పండుగ శోభకు ముగింపును తెచ్చి పెట్టేది ముక్కనుమ ఇంటి ముంగిట వేసే రథం ముగ్గే ఈ రోజు ప్రత్యేకత. రథం ముగ్గును వేసి రథాన్ని లాగే తాడును మరో ఇంటికి కలిసేట్లు వేయడంలో సంఘీభావంతో ప్రజలంతా వర్ధిల్లాలనే సంకల్పానికి ప్రతీక.



ఆత్మీయ అనుబంధాలు కలగలసిన ఇంటి లోగిళ్లలోనే నిజమైన సంక్రాంతి శోభ కనిపిస్తుంది. పండుగ శోభ నిండుగా ఉండాలంటే మన మనసుల్లో స్వచ్ఛత ఉండాలి, ఆలోచనల్లో నూతనత్వం కావాలి. అందరికీ మంచి జరుగాలనీ, సర్వ శుభాలూ సమకూరాలనీ కోరుకోవాలి. సంప్రదాయం, సంస్కృతీ పండుగల రూపంలో పదే పదే పలుకరిస్తూ యాంత్రికత మాటున మనిషి కనుమరుగై పోకూడదనీ , విలువలూ , ఆచారాలూ మనిషిని మరింత నిగ్గుతేల్చాలనే సందేశాన్నిస్తూ మన జీవితాల్లో కొత్త కాంతులు నిండాలని మనసారా ఆకాంక్షిస్తూ సంక్రాంతి పండుగ జరుపుకోవాలి.

ఇట్టేడు అర్కనందనాదేవి



వింతైన ఫొటోషూట్!

పెండ్లికి ముందు, హనీమూన్, పిల్లలు పుట్టాక, వాళ్ల బర్త్‌డేలకు.. ఇలా ఫొటోషూట్‌లు చేయించడం మామూలైపోయింది. ఇప్పుడు స్నేహానికి కూడా ఒక ఫొటోషూట్ ఉండాలని ఈ అమ్మాయిలు కొత్త అర్థం చెబుతున్నారు.

పొద్దున లేస్తూనే ఫొటోషూట్‌లు చేయించుకొని వాటిని ఫొటోలు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు చాలామంది. అవి చూసి మనకెందుకులే అని వదిలేస్తాం. కొంతమంది మాత్రం మేం కూడా ఇలాగే ఉండాలి అని వారికి వాళ్లు కొన్ని లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటారు. అలా జంటలు, తల్లిదండ్రుల లక్ష్యాలను మాత్రమే ఇప్పటిదాకా సోషల్ మీడియాలో చూసి ఉన్నాం. అలాకాకుండా ఫ్రెండ్‌షిప్ గోల్స్ ఎలా ఉండాలో నిర్ణయించేందుకే మౌనిక, శివాళిక పూనుకున్నారు. స్నేహమేరా శాశ్వతం అనుకునే విధంగా ఒక ఫొటో షూట్ చేయించారీ అమ్మాయిలు. ఒక్కో ఫొటోకి ఒక్కో క్యాప్షన్‌లను జతచేశారు. ఒక అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్ కంటే జీవితంలో ఒక స్నేహితురాలు తప్పక ఉండాలని చెప్పేలా ఈ ఫొటోలు ఉండడం విశేషం. అన్ని బంధాల్లో బ్రేకప్‌లు ఉంటాయి కానీ స్నేహంలో అవి ఉండవు అంటున్నారీ స్నేహితులు. ఈ ఫొటోలు చూసిన వాళ్లందరూ వింతగా బాగున్నాయని మెచ్చుకుంటున్నారు.



తుమ్ములకు చెక్!

- శరీరంలో జరిగే వివిధ కండరాల కదలిక వల్ల కూడా కొన్నిసార్లు తుమ్ములు వస్తాయి. ఇది మానవ శారీరక ధర్మ ప్రక్రియ.
- అలర్జీల వల్ల వచ్చే తుమ్ముల వల్ల శరీరంలోని కొన్ని కండరాలు తీవ్రంగా కదులుతాయి. ఇది మన ప్రమేయం లేకుండానే జరుగుతుంది.
- వెల్లుల్లిలోని సహజ యాంటీబయోటిక్, యాంటీ వైరస్ గుణాలు శ్వాస నాళానికి సంబంధించిన ఇన్ఫెక్షన్లను చిటికెలో అరికడుతాయి. ఇందుకోసం వెల్లుల్లి రెబ్బలను పేస్ట్‌లా చేసి ఆ వాసనను పీలిస్తే తుమ్ములు తగ్గుతాయి.
- రోజుకు మూడుసార్ల చొప్పున అల్లం రసం తాగితే శ్వాసకోశాల్లో ఏర్పడ్డ ఇబ్బందులను తొలగించుకోవచ్చు.
- ఎడతెరిపి లేకుండా వస్తున్న తుమ్ములను నివారించడంలో చామంతి టీ మంచి ఔషధం. బాగా ఎండిన ఒక స్పూన్ చామంతి పూలపొడి, ఒక కప్పు నీటిలో వేసి మరిగించి కొంచెం తేనె కలిపి తాగితే గుణం కనిపిస్తుంది.

8.
నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 14 జనవరి 2018

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ :
zindagi.nt@gmail.com
మా అడ్రస్: నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం,
8-2-603/1/7,8,9
కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

నాకిష్టమైన పాటలు..

పల్లెటూరి పిల్లగాడా	- మా భూమి
నీ పాదం మీద ..	- ఒరేయ్ రిక్షా
పల్లె కన్నీరు పెడుతుందో..	- కుబుసం
ఇక్ష్వాకు కుల తిలకా..	- శ్రీరామదాసు
అమ్మా అవనీ	- రాజన్న
పొడుస్తున్న పొద్దుమీద..	- జై బోలో తెలంగాణ
ఓ మనసా.. ఓ మనసా..	- భద్ర
పెదవే పలికిన మాటల్లోన	- నాని
నేను సైతం	- ఠాగూర్
గుర్తుకొస్తున్నాయి..	- నా ఆటోగ్రాఫ్

- కందగట్ల రాకేష్‌కుమార్, ఎర్రబెల్లిగూడెం

నాకు నచ్చిన పుస్తకాలు



మహాప్రస్థానం


అవకాశమున్న ప్రతిచోటా చదువాల్సిన మహా కావ్యమిది. ఇందులో శ్రీశ్రీ చెప్పిన 'గర్జించు రష్యా, గాండ్రించు రష్యా' మాటలు ఎంతో ఉత్తేజభరితం.

ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణం

కావ్యం, రసం, ధ్వని ఎలా ఉంటాయో తెలియజెప్పే గ్రంథమిది. నాయికానాయకుల గురించి వివరించే అద్భుత రచన.



భాగవతి పద్యాలకు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి రాసిన వ్యాఖ్యానమిది. పద్యం పట్ల అపారమైన ప్రేమను కలిగించే పుస్తకం.



మందార మకరందాలు, విశ్వంభర

మౌలానా రూమీ మస్నవి

మొదటి దఫ్తరమ్‌కు డాక్టర్ సామల సదాశివ చేసిన అనువాదమిది. గజల్‌పైన పీహెచ్‌డీ పరిశోధన చేయడానికి నన్ను ఎంతగానో ప్రేరేపించింది. ప్రతి ఒక్కరూ తప్పక చదువాల్సిన రచన.

పత్తిపాక మోహన్, అసిస్టెంట్ ఎడిటర్(తెలుగు విభాగం), నేషనల్ బుక్ ట్రస్ట్.

క్లాసిక్ మూవీ

చిక్కుముడి

ఇదో గమ్మత్తయిన కథ.. ఇందులో ఎవరు తప్పు, ఎవరు కరెక్టో తెలియదు. అందరి ఆలోచనలూ, దృక్పథాలూ సరైనవే. కానీ నాటకీయత మాత్రం నిండుగా ఉంటుంది. అదే నాటకీయంగా మన సానుభూతి ఒకరి నుంచి మరొకరికి మారుతూ ఉంటుంది. అలాగని ఇలాంటివన్నీ మేం టీవీ సీరియళ్ళలో చూస్తూనే ఉన్నాం అనుకోవద్దు. ఎందుకంటే సినిమాకు ఉండే లక్షణాలన్నీ బలంగా ఉన్న సినిమా ఇది.

మనం ఒక పనిచేసే ముందు మనకున్న లాజిక్ ప్రకారం 'ఇది ఇలా చేస్తే ఇలా అవుతుంది' అని చేస్తాం.. కానీ అది అలా జరగకపోవచ్చు. అదే జీవితంలోని నాటకీయత. సరిగ్గా అదే విషయం మూలసూత్రంగా ఈ కథను రూపొందించారేమో అనిపిస్తుంది. దానికితోడు సహజ వాతావరణం.. అతిసహజ నటన కలగలిపి గొప్పగా అనిపిస్తుంది. కథ విషయానికొస్తే.. అహ్మద్ అనే వ్యక్తి తన భార్యకి విడాకులివ్వడానికి వస్తాడు, వాళ్ళు నాలుగేళ్లుగా దూరంగా జీవిస్తుంటారు. భార్య మారీ అతన్ని రిసీవ్ చేసుకుంటుంది. 'కచ్చితంగా వస్తావో రావో తెలియదు కనుక



హోటల్ రూం బుక్ చేయలేద'ని అంటుంది . ప్రస్తుతానికి ఇంట్లోనే ఉండమంటుంది. ఇంట్లో ఆమెకి క్రితం వివాహాల ద్వారా కలిగిన ఇద్దరు కూతుళ్లు లూసీ, లియా ఉంటారు. వీళ్లకు తోడు మారీకి కాబోయే భర్త సమీర్‌కి అంతకుముందు భార్య ద్వారా కలిగిన కొడుకు 'ఫుహద్' కూడా ఉంటాడు . లూసీకి తన తల్లి మళ్ళీ పెళ్ళి చేసుకోవడం ఇష్టముండదు. దాంతో లూసీతో ఒకసారి మాట్లాడి వెళ్ళండి అని సమీర్‌తో చెబుతుంది మారీ. అప్పుడు లూసీ ద్వారా తన మొదటి భార్య ఆత్మహత్యకి పాల్పడి కోమాలో ఉన్నట్టు తెలుస్తుంది సమీర్‌కి. ఆమె ఆత్మహత్య ఎందుకు చేసుకోబోయిందనే ఒక కారణం మీద మిగతా సినిమా మొత్తం ఉంటుంది. పిల్లల ఇన్సెక్యూరిటీ ఒకవైపూ.. పెద్దలమధ్య చోటుచేసుకున్న అపార్థాలు, కోపతాపావేశాలూ మరోవైపుగా కథ మలుపులు తిరుగుతుంది. ప్రతి సినిమాలోనూ ఒక చిక్కుముడి ఉంటుంది. అది విప్పడమే సినిమా అవుతుంది. కానీ ఇక్కడ అంతా సరళంగా మొదలై చిక్కుముడి పడినట్టుగా తయారవుతుంది. 'ఒక విషయానికి సంబంధించి ఏదైనా ఎదుటివాళ్లకి చెప్పినపుడు లేదా ఏదైనా విషయం జరిగినపుడు అవతలివాళ్ళు అర్థం చేసుకునే తీరు, అపార్థాలు లేదా చిన్న డిటెయిల్స్ మీద ఎక్కువ ట్రెస్ చేయటం లేదా మనమే ఇదేం పెద్దవిషయం అని చెప్పకుండా ఉన్న విషయాలే చిలికి చిలికి గాలివానగా మారుతుంటాయి' అనే జీవిత సత్యం మీద అల్లిన కథ ఇది. ఇలాంటి కథలు రాసేందుకు సునిశిత పరిశీలన అవసరం. దర్శకుడు అజ్గర్ సినిమాలన్నీ ఇలాగే ఉంటాయి. ఈ సినిమాలో ప్రతి పాత్ర.. వాటిని పోషించిన నటులూ అద్భుతం. మారీగా నటించిన 'బిజు' ఉత్తమ నటిగా కేన్స్‌లో అవార్డు పొందింది. ఇలాంటి సినిమా చూసాక మనం రియలైజ్ అయ్యేదేమిటంటే.. ప్రపంచంలో ఇన్ని భాషలున్నా .. కొన్ని సార్లు, మన మనసులో ఉన్నది స్పష్టంగా చెప్పలేమని.. చెప్పటం సాధ్యం కాదనీ! ఎంజాయ్ ది మూవీ!!

-చక్రధర్ రావు భైరంపల్లి, 9848519435

గాలిపటమా పద.. పద..



సంక్రాంతి అనగానే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు.. వాటిలో పెట్టే గొబ్బెమ్మలే కాదు.. రంగు రంగుల పతంగులు కూడా ఈ పండుగలో భాగమే.. అలాంటి పతంగుల పండుగంటే అందరికీ ఇష్టమే.. కొందరికి డాబామీద డీజే పెట్టుకొని సందడి చేస్తూ పతంగులు ఎగురేయడం ఒక సరదా.. మరికొందరికి కైట్ ఫెస్టివల్స్‌లో పాల్గొనడం సరదా.. నిజానికి చాలా దేశాల్లో పండుగతో సంబంధం లేకుండా.. కైట్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుంటారు.. కానీ సంక్రాంతి సందర్భంగా మన హైదరాబాద్ కూడా అలాంటి ఫెస్ట్‌కు వేదికవుతున్నది.. ప్లేస్ ఎక్కడైనా పసందైన పతంగ్‌లు మాత్రం ఒక్కటే కదా అని సింపుల్‌గా తీసుకోవద్దు.. కైట్ ఫెస్టివల్ అనగానే కలర్స్, డిజైన్స్ బోలెడుంటాయి.. అందుకే ఆ క్రేజీ కైట్స్ సమాచారంతో మీ ముందుకొచ్చింది ఈవారం సింగిడి.

మామూలుగా మన గల్లీల్లో ఎగిరే పతంగులు వేరు. కైట్ ఫెస్టివల్స్‌లో కనిపించే అరుదైన పతంగులు వేరు. పండుగను మరింత సందడిగా మార్చేందుకు నిర్వహించే ఈ కైట్ ఫెస్టివల్స్‌లో పోటీ పడి మరీ వినూత్నమైన పతంగులను ఎగురేస్తుంటారు.

దౌడు తీసే పతంగ్..




గుర్రం దౌడు తీస్తే ఎలా ఉంటుందో మనం ఎగురేసే పతంగ్ కూడా అలాగే ఉంటే ఎంత బాగుంటుందో కదా! అంటే దానిలా పరుగెత్తాలని కాదు, అదే ఆకారంలో ఉండి నింగిలో దూసుకుపోవాలని! అలాంటి డిజైన్లలో రూపొందినవే హార్స్ కైట్స్. సముద్ర గుర్రాన్ని పోలినట్టు ఉండే ఈ కైట్ అంటే పిల్లలు, యూత్‌లో భలే క్రేజ్. అందుకే వీటిని తయారు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు డిజైనర్లు. ఇక హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా జరిగే కైట్ ఫెస్టివల్స్‌లో అందరి దృష్టీ వీటిపైనే ఉంటుంది. కేవలం నీటి గుర్రం మాదిరే కాదు, ఇతర జంతువుల ఆకారాల్లోనూ ఇవి లభిస్తాయి.

అచ్చం పక్షుల్లాగే..



డెల్టాస్ డిజైన్‌లో తయారయ్యే ఈ పతంగులు.. భలే పసందుగా ఉంటాయి. ఎగురుతున్నది పక్షా, పతంగా అనే అనుమానం రాకమానదు. డెల్టా కేటగిరీలో చిన్న పిల్లలు ఆడుకునే టాయ్స్ నుంచి కళాత్మకంగా డెకరేట్ చేసే డిజైన్స్ వరకు రకరకాలుగా అందుబాటులో ఉంటాయి. ప్రతీ కైట్ ఫెస్టివల్‌లో ఫైర్ బర్డ్‌గా ఇవి సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలుస్తుంటాయి. అంతలా అలరిస్తాయి కాబట్టే.. వీటి తయారీ కూడా అదే రేంజ్‌లో ఉంటుంది. ఎక్కువగా ఫైబర్ గ్లాస్, రాడ్స్ సాయంతో గట్టి నైలాన్ బట్టతో వీటిని తయారు చేస్తుంటారు. ట్రై యాంగిల్ షేప్‌లో ఉండే ఈ పతంగులకు తోక ఉండదు. మామూలు పతంగులకైతే గోతలు కొడుతాయనే భయంతో తోకలు పెట్టేస్తుంటారు. వీటితో ఆ టెన్షన్ లేదు. ఇవి ఒక్కసారి పైకి ఎగిరిన తర్వాత.. నిలుకడగా ఉంటాయి.

రొక్కాకుస్



త్రీడీ జియోమెట్రిక్ ఆర్ట్‌తో రూపొందే ఈ కళాత్మకమైన పతంగులు వెరీ వెరీ స్పెషల్. ఆకాశంలో అలా బొమ్మలా నిలబడి పోవడంలో డెల్టా కెటగిరీని మించిపోతాయివి. వీచే గాలికి తగ్గట్టుగా ఎగురడం వీటి స్పెషాలిటీ. వీటికి కూడా తోకలు పెట్టాల్సిన అవసరం ఉండదు. అలా పెడితే బరువు పెరిగి తక్కువ ఎత్తులోనే ఎగురుతాయి తప్ప పైకి దూసుకెళ్లలేవు. వీటి పుట్టిల్లు జపాన్ అయినా.. ఇప్పుడు ప్రపంచమంతా చుట్టేస్తున్నాయి. కళాత్మకమైన ఈ పతంగులు కొంచెం ఖరీదైనవే.

సెల్యూలర్స్



ఇవి మోడ్రన్ లుక్కుతో ఆకట్టుకునే పతంగులు. వీటిని డబుల్ బాక్స్ కైట్ విత్ వింగ్స్‌గా పిలుస్తారు. రెండువైపులా పక్షిలా రెక్కలు కలిగి ఉంటాయి. 18వ శతాబ్దానికి చెందిన ఈ మోడల్ కైట్స్.. ఇప్పుడు మళ్లీ క్రేజ్‌లోకి వచ్చాయి. ఒక బాక్సు, దానికి రెండు వైపులా రెక్కలు.. దీని నిర్మాణమే వింతగా ఉండి కైట్స్ ఫెస్టివల్స్‌లో పతంగ్ లవర్స్‌ను ఆకట్టుకుంటుంది.

డైమండ్స్



పతంగుల్లో ఇవి నిజంగా డైమండ్సే. అలాగని వజ్రాలు పొదుగబడి ఉండవు. వీటి ఆకృతి అలా ఉంటుందంతే. ముదురు పసుపు రంగులో, ఫన్నీ బొమ్మలతో ఆకట్టుకొనే ఈ కైట్స్‌ను సొంతంగానైనా తయారు చేసుకోవచ్చు. అవసరమైన తోకను జోడిస్తే.. ఆకాశంలో అలా ఎగురుతూ ఆహ్లాదాన్ని పంచుతాయి.



నోవల్టీ: ఆకాశంలో పడవ ప్రయాణిస్తుండడం ఎప్పుడైనా చూశారా. బోటు ఆకారంలో రూపుదిద్దుకొనే ఈ కైట్స్ ఎగురడం చూస్తే ఆ అద్భుతం చూసినట్టే. ఆకాశంలో ఒక బోటు కదులాడుతున్నదేమో అనిపిస్తుంది. వైవిధ్యంగా కనిపించే ఈ పతంగ్‌ను ఎగురేయడం నిజంగా అద్భుతమైన సరదా. ఈ నోవల్టీ కేటగిరిలో కార్టూన్స్ మరీ ప్రత్యేకమైనవి.



ట్రెడిషనల్ పతంగ్: సంప్రదాయానికి నిలువుటద్దంలా ఉండే పతంగులివి. కొత్త ట్రెండ్‌కు దూరంగా సహజసిద్ధంగా తయారు చేయబడే ఈ పతంగులకు కైట్స్ ఫెస్టివల్స్‌లో ప్రత్యేకస్థానమే ఉన్నది. కొన్ని శతాబ్దాలుగా చెక్కుచెదురని క్రేజ్‌ను సొంతం చేసుకొన్న ఈ కైట్స్.. ఏ ప్రాంతానికి తగ్గట్టు ఆ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను తెలియజెప్పేలా ఉంటాయి.

ఇవే కాదు. మార్కెట్‌లో మన సంప్రదాయానికి తగ్గట్టు బోలెడన్ని కైట్స్ అందుబాటులో ఉన్నాయి. ఏ సినిమా రిలీజ్ అయినా, ఆయా హీరోల పేరు మీద కైట్స్ ఆ యేడు మార్కెట్‌లోకి వస్తుంటాయి. త్రిశూలం, స్పైడర్‌మ్యాన్, సూపర్‌మ్యాన్ కైట్స్ అయితే మరీ స్పెషల్. ఇవంటే పిల్లలకే కాదు పెద్దలకూ ఇష్టమే.

నమస్తే తెలంగాణ
చిత్రం

సెంటిమెంట్‌కు తిరుగులేదు!



కె.ఎస్.రవికుమార్

'తొంభైశాతం ప్రేక్షకులు వినోదం, వాణిజ్య అంశాలున్న చిత్రాల్ని చూడటానికే ఇష్టపడతారు. ఆ తరహా సినిమాల్ని రూపొందించడానికే నేను ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. హీరోల ఇమేజ్‌కు సరిపోయే కథల్ని ఎంచుకున్నప్పుడే విజయాలు వరిస్తాయి' అన్నారు కె.ఎస్.రవికుమార్. దక్షిణాది పరిశ్రమలో అగ్ర హీరోలతో ఎన్నో భారీ కమర్షియల్ విజయాల్ని సాధించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సృష్టించుకున్నారాయన. ముత్తు, నరసింహా, దశావతారం, స్నేహంకోసం వంటి చిత్రాలు ఆయనకు దక్షిణాదిన తిరుగులేని గుర్తింపును సాధించిపెట్టాయి. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'జై సింహా' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో కె.ఎస్.రవికుమార్ పాత్రికేయులతో ముచ్చటించారు.

దాదాపు 14ఏళ్ల విరామం తర్వాత తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించడం ఆనందంగా వుంది. తమిళంలో వున్న కమిట్‌మెంట్స్ వల్ల తెలుగు సినిమా చేయడానికి వీలు కుదరలేదు. బాలకృష్ణతో సినిమా చేయాలని ఎనిమిదేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నాను. కొన్ని కథలు అనుకున్నాం కానీ అనుకోని కారణాల వల్ల అవి కార్యరూపం దాల్చలేదు. చివరకు రత్నం చెప్పిన కథ బాగా నచ్చడంతో ఓకే చేశాం. బాలకృష్ణ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని శక్తివంతమైన సంభాషణలతో స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకున్నాము. వాస్తవానికి ఇది పూర్తి ప్రేమకథా చిత్రం. అయితే కథను మొత్తం లవ్‌ట్రాక్‌లో నడిపిస్తే బాలకృష్ణగారికి సరిపోదని భావించాను. దాంతో కుటుంబ అనుబంధాలు, ఎమోషనల్ సన్నివేశాల మేళవింపుతో కథను బలంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాను.

మాస్‌కు క్లాస్ సూటవదు...

కొందరు హీరోలకు ప్రేక్షకుల్లో గొప్ప మాస్ ఇమేజ్ ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకుని కథాంశాలు తయారుచేసుకోవాలి. మాస్ హీరోలకు క్లాస్ కథలు వర్కవుట్ కావు. రజనీకాంత్, కమల్‌హాసన్‌లతో నేను సినిమాలు చేశాను. వారిద్దరి ఇమేజ్‌లు వేరు. రజనీకాంత్‌కు క్లాస్ కథలు సరిపోవు. అలాగే కమల్‌హాసన్ పూర్తి మాస్ ఇతివృత్తాల్లో ఇమడలేడు. ఇలాంటి వాణిజ్యపరమైన సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని కథకు సిద్ధం చేసుకోవాలి. అప్పుడే ఆశించిన విజయాలు దక్కుతాయి. 'జై సింహా' కథ బాలకృష్ణ ఇమేజ్‌కు చక్కగా సరిపోయింది. మంచి పాటలు, రొమాంచితమైన పోరాటఘట్టాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్, సెంటిమెంట్‌తో అభిమానుల్ని అలరించేలా అన్ని అంశాలు ఈ సినిమాలో వున్నాయి. పవిత్రమైన ప్రేమకోసం తపించే ఉదాత్తమైన వ్యక్తి పాత్రలో బాలకృష్ణ అభినయం ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకుంటున్నది. కథలోని మలుపులు ఉత్కంఠతకు గురిచేస్తున్నాయి. ప్రేమ, త్యాగంతో కూడిన బాలకృష్ణ పాత్రకు అన్ని వర్గాల ఆమోదం లభిస్తున్నది. ఆయన వయసుకు తగినట్లుగా పరిణితితో కూడిన ప్రేమకథను ఈ సినిమాలో చూపించాం.

సెంటిమెంట్ ఎవర్‌గ్రీన్

మానవ భావోద్వేగాలు ఎల్లవేళలా ఒకేలా వుంటాయి. సినిమాలో సెంటిమెంట్ అనేది ఎవర్‌గ్రీన్. ఏ కాలంలోనైనా దానికి తిరుగు వుండదు. నా సినిమాలన్నీ కుటుంబ అనుబంధాలు, ప్రేమ, సెంటిమెంట్ చుట్టూ అల్లుకునే వుంటాయి. వీటి మధ్యలో కొంచెం మాస్ అంశాల్ని మిళితం చేస్తాను. 'జై సింహా' దర్శకుడిగా నాకు ఎంతోగానో సంతృప్తినిచ్చింది.

నయనతారకు కథ బాగా నచ్చింది

బాలకృష్ణ, నయనతార..ఇద్దరిది విజయవంతమైన కాంబినేషన్. ఈ కథ అనుకోగానే నయనతారను కథానాయికగా తీసుకోవాలనుకున్నాం. బాలకృష్ణగారు కోరిన వెంటనే సినిమాలో నటించడానికి నయనతార ఒప్పుకొంది. అయితే కథ చెప్పినప్పుడు ప్రథమార్థంలో తనపై కొన్ని సన్నివేశాలే వున్నాయని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తర్వాత కథలోని ఎమోషన్ బాగా నచ్చింది కాబట్టి సినిమాలో నటిస్తున్నానని చెప్పింది.

తెలుగు సినిమాలు చేస్తాను..

నా తదుపరి సినిమా ఏమిటో ఇంకా నిర్ణయించుకోలేదు. ప్రస్తుతం కొన్ని కథల్ని సిద్ధం చేస్తున్నాను. తమిళంతో పాటు తెలుగులో కూడా సినిమాలు చేయాలనుకుంటున్నాను.



శ్రీచరణ్, రాజ్‌తరుణ్, శ్రీరంజని, నాగార్జున, చిత్రశుక్లా, సితార

సంక్రాంతి రంగవల్లిక

'రంగులరాట్నం'సినిమా బొబ్బట్టులాగా చాలా తీపిగా వుంటుంది. సంక్రాంతికి వడ్డించే పొంగళి మాదిరిగా అందరికి నచ్చుతుంది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో సాగుతుంది' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందిన చిత్రం 'రంగులరాట్నం'. రాజ్‌తరుణ్, చిత్రశుక్లా జంటగా నటించారు. శ్రీరంజని దర్శకురాలు. నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'వాస్తవానికి దగ్గరగా వుండే చిత్రమిది. తల్లీకొడుకుల మధ్య వుండే ఎమోషన్స్, ఒక జంట మధ్య పవిత్రమైన ప్రేమ..ఇలా అనేక అంశాల సమాహారంగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. కొన్ని సన్నివేశాలు నవ్విస్తాయి. మరికొన్ని కంట తడి పెట్టిస్తాయి. ఒక ప్రేక్షకుడిగా నేను ఈ సినిమా చూశాను. బాగా నచ్చింది. ఏడాదిన్నర క్రితమే ఈ కథ నా దగ్గరకు వచ్చింది. వినగానే వెంటనే ఓకే చెప్పాను. దర్శకురాలు శ్రీరంజని ఓ అమ్మాయి దృష్టికోణం నుంచి సినిమాను అద్భుతంగా తెరకెక్కించింది. మనసుని కదిలించేలా ప్రతి సన్నివేశాన్ని అందంగా తెరకెక్కించింది. రాజ్‌తరుణ్ మా సంస్థలో 'ఉయ్యాల జంపాల' సినిమా చేశాడు. అతనో నేచురల్ యాక్టర్. ఈ సంక్రాంతికి మా బ్యానర్‌లో 'రంగులరాట్నం' మంచి చిత్రంగా నిలిచిపోతుంది' అన్నారు. 'అన్నపూర్ణ వంటి పెద్ద బ్యానర్ ద్వారా దర్శకురాలిగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. దాదాపు రెండు సంవత్సరాలు కష్టపడి ఈ సినిమా స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాను. 'రంగులరాట్నం' సంక్రాంతి రంగవల్లికలా కలర్‌ఫుల్‌గా వుంటుంది. ప్రేమ, కుటుంబ అనుబంధాలకు దర్పణంలా సాగుతుంది' అని దర్శకురాలు శ్రీరంజని చెప్పింది. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'అన్నపూర్ణ సంస్థలో రెండో సినిమా చేయడం అదృష్టం భావిస్తున్నాను. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకునే ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ ఇది' అన్నారు. సినిమాలో తాను రాజ్‌తరుణ్‌కు తల్లిగా నటించానని, సొంతంగా డబ్బింగ్ చెప్పానని సితార పేర్కొంది. తన కుటుంబ సభ్యులందరూ నాగార్జున అభిమానులని, అన్నపూర్ణ సంస్థలో నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చిందని కథానాయిక చిత్ర శుక్లా చెప్పింది. నిజ జీవితానికి దగ్గరగా వుంటే చిత్రమిదని ప్రియదర్శి పేర్కొన్నారు.

అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక!



రంజిత్, పాలక్‌లల్వానీ, చిరంజీవి, భరత్, త్రికోటి

''జువ్వ' ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడం ఆనందంగా వుంది. హీరో రంజిత్, నిర్మాత భరత్ ఇద్దరు అన్నదమ్ములు. వీళ్ల నాన్నగారితో నాకు మంచి పరిచయం వుంది. స్వతహాగా భరత్ డాక్టర్. సాధారణంగా డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యామనే మాటలు వింటుంటాం. కానీ తమ్ముడి కోసం డాక్టర్ భరత్ నిర్మాత అయ్యాడు. ఆ విధంగా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలబడింది' అన్నారు చిరంజీవి. రంజిత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జువ్వ'. త్రికోటి దర్శకత్వం వహిస్తున్నారు. పాలక్ లల్వానీ కథానాయిక. భరత్ నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను శనివారం హైదరాబాద్‌లో చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపించాడు. పాత్ర పరంగా పక్కా మాస్ అని అర్థమవుతున్నది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపించింది. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తప్పకుండా చూస్తాను. 'దిక్కులు చూడకు రామయ్య' తరువాత త్రికోటి ఈ సినిమాతో మరో విజయాన్ని అందుకోవాలి' అన్నారు. రంజిత్ మాట్లాడుతూ 'చిరంజీవిగారి నటన అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయనే నా రోల్ మోడల్. ఆయనతో ఒక్క ఫొటో దిగితే చాలు అనుకునేవాడిని. నేను హీరోగా నటించిన సినిమా టీజర్‌ను ఆయన విడుదల చేయడం ఆనందంగా వుంది' అన్నారు. 'ప్రేమకథ నేపథ్యంలో రూపొందిన సినిమా ఇది. చిన్న చిన్న థ్రిల్లింగ్ అంశాలుంటాయి' అని దర్శకుడు తెలిపారు. 'గత ఏడాదే చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ నెలాఖరున ఆడియోను, ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత భరత్ తెలిపారు.

నిహారిక 'సూర్యకాంతం'?



మెగా కుటుంబం నుంచి కథానాయికగా పరిచయమైంది కొణిదెల నిహారిక. ఆమె నటించిన 'ఒక మనసు' ఆశించిన విజయాన్ని అందించకపోవడంతో ప్రస్తుతం తమిళంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న 'ఒరు నల్ల నాల్ పాతు సొల్రే' సినిమాతో నిహారిక తమిళంలో తెరంగేట్రం చేస్తున్నది. ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. కాగా ప్రస్తుతం తెలుగులో సుమంత్ అశ్విన్‌తో కలిసి 'హ్యాపీ వెడ్డింగ్'లో నటిస్తున్న నిహారిక త్వరలో ఓ ప్రయోగాత్మక చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'అవకాయ్ ముద్దపప్పు' అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించిన ప్రణీత్ బ్రహ్మాండపల్లి ఈ చిత్రాన్ని రూపొందించనున్నారని, ఈ చిత్రానికి 'సూర్యకాంతం' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది.

9. నమస్తే తెలంగాణ
సిరిముగ్గు
[హైదరాబాద్]
ఆదివారం 14 జనవరి 2018



చేతి వేళ్ల మధ్యలోంచి వెన్నెల పోగులు జారినై..
వంకీలొంకీలు చుట్టుకున్నయ్. వయ్యారాల హోయలు పొయినై.
మల్లె విచ్చుకున్నట్లు.. సన్నజాజి పూసినట్లు..
సంపంగి కొసలు తేలినట్లు.. ముగ్గు మేలి ముత్యంలా మెరిసింది.
ప్రాంగణాన పెద్ద ముగ్గు. ముంగిట మరో ముగ్గు.
వరి కంకుల వాసన.. పొంగమంచు దుప్పటి..
ధాన్య యోగిలా రైతన్న.. ఇల్లు చేరిన పంటలు..
కమ్మని వంటలు.. మోమున నవ్వులు..
మకర సంక్రాంతికిది స్వాగత గీతం.
పండుగ శుభాకాంక్షలతో మీకోసం..

సిరుల సంక్రాంతి






బొడ్డుపల్లి కవిత, అప్పాజిపేట, నల్లగొండ




పి. నీలిమ, నిజాంపేట్, హైదరాబాద్




బొల్లేటి పద్మావతి, తుంగతుర్తి, నల్లగొండ



పి. హిమబిందు , మీర్‌పేట్, హైదరాబాద్



ఎస్. వైదేహి, ఎర్రుపాలెం, ఖమ్మం




ఆర్. నివేదిత, మిర్యాల గూడ, నల్లగొండ



ఎం. మోనిక, మడికొండ, వరంగల్



కె. దీప, ఘణాపూర్, సంగారెడ్డి



ఆడికె లావణ్య, రాజేంద్రనగర్, హైదరాబాద్



ఎ. ఇందిర, భువనగిరి, యాదాద్రి


పసుపుల విద్యావతి, జడ్చర్ల, మహబూబ్‌నగర్



కందగట్ల చందన, కరీమాబాద్, వరంగల్

సుడోకు

డైలీ సుడోకు 99 సమాధానం

6	7	1	8	3	4	9	2	5
4	3	2	1	5	9	6	8	7
9	5	8	7	6	2	4	1	3
5	8	9	6	2	1	3	7	4
3	4	6	9	7	8	2	5	1
1	2	7	5	4	3	8	6	9
2	6	3	4	1	7	5	9	8
7	9	5	3	8	6	1	4	2
8	1	4	2	9	5	7	3	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 100

			9			1		
				8	4	9	5	
						8	3	4
	9		3					
2	7		8		9		1	5
					5		8	
4	2	9						
	8	7	5	2				
		6			1			

ట్వీట్



రీల్ అమ్మ, రియల్ అమ్మతో నా బిడ్డ!

శ్రీనివాస్‌రెడ్డిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
52,259



శ్రీనివాస రెడ్డి
@Actorysr

కామన్‌మ్యాన్ వాయిస్

అలిశెట్టిని తెలంగాణ శ్రీశ్రీ అంటున్నరు. శ్రీశ్రీనే ఆంధ్ర అలిశెట్టి అనాలె!
–Rapolu Satyanarayana

మనిషి వికృతత్వపు ప్రదర్శనే.. సురకత్తుల కోడి పందాలాట!
–Ramesh Hazari

క్రూరమృగాలు సైతం కుటుంబ వ్యవస్థను పాటిస్తున్నాయి. మరి మనుషుల పాదాలెందుకు కోర్టు మెట్లెక్కుతున్నాయి. ఎవరో ఒకరు సర్దుకు పోవటమే సంసారం, సహకారం.
–Meraj Fathima

వైరల్ వీడియో




విక్టరీ వెంకటేష్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఏం చేశారో తెలుసా? ఏదేదో ఊహించుకోకండి. కలిసి నటించారు. అజ్ఞాతవాసిలో వెంకటేష్ అతిథి పాత్రకు సంబంధించిన మేకింగ్ వీడియో వైరల్ అవుతున్నది.

Agnyaathavaasi Movie | Victory Venkatesh Cameo Making | Pawan Kalyan | Trivikram
Total views : 1,219,359+
Published on Jan 11, 2018


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
MASS
CLASS
ALL CENTRES
BLOCKBUSTER
MCA
మిడిల్ క్లాస్ అబ్బాయ్
4TH WEEK
RAJU - SHIRISH - LAXMAN SRIRAM VENU DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
U/A


అన్నపూర్ణ వారి సంక్రాంతి బొబ్బట్టు "రంగుల రాట్నం"
రంగుల రాట్నం
SHREERANJANI
SREEKAR PRASAD SRICHARAN PAKALA L K VIJAY
DI & VFX ANNAPURNA STUDIOS
నేడే విడుదల


ABHISHEK
ABHISHEK PICTURES & VISTA DREAM MERCHANTS PRESENTS
IN ASSOCIATION WITH PEOPLE MEDIA FACTORY
people MEDIA FACTORY
ADIVI SESH IN & AS
FROM THE STORY WRITER OF KSHANAM
గూఢచారి
TRINETRA 1 1 6
DIRECTED BY SASHIKIRAN TIKKA PRODUCED BY ABHISHEK NAMA TG VISHWA PRASAD ABHISHEK AGARWAL
STORY BY ADIVI SESH CO-PRODUCER VIVEK KUCHIBHOTLA
MUSIC SRICHARAN PAKALA DIALOGUES & SCRIPT GUIDANCE ABBURI RAVI CINEMATOGRAPHY SHANEIL DEO EDITOR GARRY BH PRODUCTION DESIGN SHIVAM RAO
SUMMER 2018


RUNNING SUCCESSFULLY
SMT. MAMATHA PRESENTS
HAARIKA & HASSINE
CREATIONS
అజ్ఞాతవాసి
PRINCE IN EXILE
TRIVIKRAM
S RADHA KRISHNA
(CHINABABU)
ANIRUDH V MANIKANDAN A S PRAKASH
KOTAGIRI VENKATESWARA RAO PDV PRASAD RAVI VARMA
SCAN THIS QR CODE IN YOUR PAYTM USE
CODE AGNY100 & GET UPTO RS 100* CASHBACK
/AgnyaathavaasiFilm
U/A



సొంతూళ్లకు జనం.. బోసిపోతున్న నగరం



శనివారం ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ.. (ఇన్‌సెట్) నగరవాసులు సొంతూళ్లకు తరలివెళ్లడంతో బోసిపోయిన బషీర్ బాగ్ ఫ్లైఓవర్ ప్రాంతం

- సంక్రాంతి సందర్భంగా బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు కిటకిట
- అదనంగా 3,262 బస్సులు నడిపిస్తున్న ఆర్టీసీ.. ప్రయాణికుల రద్దీకి సరిపోని రైళ్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ కోసం జనం సొంతూళ్ల బాటపట్టారు. పండుగ సీజన్, సెలవులు కలిసిరావడంతో నగరంలోని బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆర్టీసీ, రైల్వే శాఖ తెలంగాణ రాష్ట్రంతోపాటు ఆంధ్రా, రాయలసీమ, కర్నాటకలోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు, రైళ్లు నడిపిస్తున్నాయి. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9 నుంచి రోజువారీ ఆయా మార్గాల్లో వెళ్లే షెడ్యూల్ బస్సులకు అదనంగా 3,262 స్పెషల్ బస్సులను టీఎస్‌ఆర్టీసీ నడిపిస్తున్నది. ఈ నెల 11న 844, 12న 1130, శనివారం సుమారు 800 స్పెషల్ బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపించినట్టు అధికారులు తెలిపారు. ఆదివారంతోపాటు తిరుగు ప్రయాణంలోనూ ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, బెంగళూరు తోపాటు తెలంగాణలోని ప్రధాన పట్టణాలు, నగరాలకు స్పెషల్ బస్సులు నడిపించినట్టు చెప్పారు. ఆయా బస్సులు ఎంజీబీఎస్, జేబీఎస్, బీహెచ్‌ఈఎల్, చందానగర్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ క్రాస్‌రోడ్డు, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి వెళ్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యంగా టికెట్ ధరలను వసూలు చేస్తున్నాయి. రైల్వేశాఖ సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల నుంచి ఆయా మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నది.

గోల్ఫ్‌కోర్స్ బాధితులకు ఊరట

- ప్రత్యామ్నాయంగా స్థలమిచ్చేందుకు రంగం సిద్ధం
- నిర్వాసితుల 17 ఏండ్ల నిరీక్షణకు త్వరలో తెర
- మొయినాబాద్ మండలం కనకమామిడిలో 52 ఎకరాలు
- 54 మందిలో ఇప్పటికే 33 మంది వాటాల గుర్తింపు

గోల్కొండ మండలంలోని గోల్ఫ్‌కోర్స్ భూ నిర్వాసితుల 17 ఏండ్ల నిరీక్షణకు త్వరలో తెరపడనున్నది. అప్పట్లో నష్టపరిహారం తక్కువగా ప్రకటించడంతో కోల్పోయిన మేర భూమి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులు 2015లో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడిలో 52 ఎకరాలను సిద్ధం చేశారు. 51 మంది నిర్వాసితుల్లో ఇప్పటికే 33 మందికి వాటాలు గుర్తించారు. మిగతా వారు తగిన ఆధారాలతో తమను సంప్రదిస్తే వాటాలు కేటాయిస్తామన్నారు.



గోల్కొండ మండలంలో ఏర్పాటు చేసిన గోల్ఫ్‌కోర్స్ (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వారంతా పేద రైతులు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుండే వారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వారి జీవనాధారంపై దెబ్బకొట్టింది. గోల్ఫ్‌కోర్స్ పేరుతో వారి భూమిని ఆక్రమించుకున్నది. అప్పటి నుంచి భూమి లేక నష్టపరిహారాన్ని పొందకుండా బాధిత రైతుల కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారి 17 ఏండ్ల ఎదురుచూపులకు ఊరట లభించబోతున్నది. గోల్కొండ మండలంలోని గోల్ఫ్‌కోర్స్ భూ నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా స్థలం ఇవ్వనున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని కనకమామిడిలో 52 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. ఎవరికి ఎంత వాటా దక్కాల్లో జిల్లా యంత్రాంగం వివరాలను సేకరిస్తున్నది. త్వరలో కేటాయింపులు జరుగనున్నాయి. 2000 సంవత్సరంలో ప్రభుత్వం గోల్కొండ మండలంలోని ఖిలామహ్మద్‌నగర్‌లో 52 ఎకరాల స్థలాన్ని సేకరించింది. బాధితులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ.80వేల మార్కెట్ విలువను ఇస్తామని చెప్పారు. ఈ మేరకు మొత్తం 54 మంది భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని 1వ సీనియర్ సివిల్ జడ్జి వద్ద డిపాజిట్ చేశారు. అయితే కొందరు నిర్వాసితులు దీనిని వ్యతిరేకించారు. 30 మంది అభ్యర్థులు తమకు డబ్బుకు బదులుగా స్థలాన్నే కేటాయించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా పూడూరు మండలం కొత్తపల్లిలో 29.39 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ 2009 ఫిబ్రవరి 21న జీవో జారీచేసింది. అయితే తమ వద్ద అత్యంత ఖరీదైన స్థలాన్ని తీసుకొని మారుమూలన ఉన్న స్థలాన్ని ఇవ్వడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయంగా మరో చోట..

సమస్య పరిష్కారం కోసం 2013 నవంబర్ 16న జిల్లా అధికారులు బాధితులతో సమావేశమయ్యారు. కొత్తపల్లిలో కేటాయింపును రద్దు చేయడంతోపాటు నగరశివారులోని వివాదరహిత స్థలాల్లో ఎంపికచేసుకునే అవకాశం కల్పించారు. గోల్ఫ్‌కోర్స్ కోసం ఎంత స్థలాన్ని కోల్పోయారో అంతే మొత్తం ఇవ్వడానికి ప్రతిపాదించారు. ఈ మేరకు కొత్తపల్లిలో భూసేకరణను రద్దు చేశారు. 2015 నవంబర్ 2న మరోమారు బాధితులతో సమావేశమై రంగారెడ్డి జిల్లాలోని రెండు ప్రతిపాదిత స్థలాల్లో పర్యటించారు. మొయినాబాద్ మండలం చిలుకూరులో 31 ఎకరాలు, కనకమామిడిలో 219.35 ఎకరాలను చూపించారు. బాధితులు కనకమామిడిని ఎంపిక చేసుకున్నారు. ఈ మేరకు బాధితులకు 52 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎవరెవరికి ఎంత కేటాయించాలో స్పష్టంగా చెప్పలేదు. దీంతో ఎవరెవరి నుంచి ఎంత సేకరించారో, బాధితులు ప్రస్తుతం ఎక్కడున్నారో తెలుసుకోవడం ప్రస్తుత భూసేకరణ విభాగం అధికారులకు కష్టసాధ్యంగా మారింది. నిర్వాసితుల్లో చాలా మంది వలసలు వెళ్లడం, కొందరు చనిపోవడంతో అధికారులు లబ్ధిదారులను గుర్తించే పనిలో పడ్డారు. రాజేంద్రనగర్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, నాంపల్లి, షేక్‌పేట, గండిపేట మండలాల్లో బాధిత కుటుంబాలు నివాసం ఉంటున్నట్టు గుర్తించారు. అర్హతలు గలవారికి తమను సంప్రదించాలని నోటీసులు జారీచేస్తున్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో వచ్చిన వారికి స్థలాలు కేటాయిస్తామని ప్రచారం చేస్తున్నారు. 54 మంది బాధితుల్లో ఇప్పటివరకు 33 మందిని జిల్లా భూసేకరణ విభాగం అధికారులు గుర్తించారు. వారు సమర్పించిన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ఎంత స్థలం ఇవ్వాలో నిర్ణయించారు. మిగతా 21 మందిని త్వరగా గుర్తించి వారందరికీ స్థలాలను కేటాయించబోతున్నారు. కేటాయింపులు పారదర్శకంగా ఉండేందుకు లక్కీ డ్రా తీసేందుకు జిల్లా భూసేకరణ విభాగం అధికారులు కసరత్తు చేస్తున్నారు.



ఇందిరాపార్క్‌లోని చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో ఎంపీ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

దార్శనికుడు మర్రి చెన్నారెడ్డి

- పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి
- ఘనంగా చెన్నారెడ్డి 99వ జయంతి
- నివాళులర్పించిన స్పీకర్ సిరికొండ, హోంమంత్రి నాయిని తదితరులు

కవాడిగూడ, నమస్తే తెలంగాణ: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి రాజకీయ దార్శనికుడని, గొప్ప పరిపాలనాదక్షుడని, తాను ఆయనకు అభిమానినని పుదుచ్చేరి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. మర్రి చెన్నారెడ్డి 99వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి రాక్ మెమోరియల్‌గార్డెన్‌లోని ఆయన సమాధి వద్ద నారాయణస్వామి, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డీ శ్రీనివాస్, తమిళనాడు మాజీ గవర్నర్ కే రోశయ్యతో పాటు పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ తమిళనాడు గవర్నర్‌గా చెన్నారెడ్డి ఉన్న సమయంలో తాను చాలా సన్నిహితంగా మెలిగేవాడినని, ఆయన గొప్ప సలహాలు ఇచ్చేవారని గుర్తుచేసుకొన్నారు. మర్రి చెన్నారెడ్డి తన విలక్షణమైన వ్యక్తిత్వంతో, గొప్ప పరిపాలనా నైపుణ్యంతో రాజకీయాలను ప్రభావితం చేశారని అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. ఆయన ఏ పనిచేసినా తనదైన ముద్రవేసేవారని.. రాజకీయాలనే తనచుట్టూ తిప్పుకొన్న మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బండారు దత్తాత్రేయ, టీ సుబ్బిరామిరెడ్డి, మేకపాటి రాంమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీలు హనుమంతరావు, అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రులు డీకే అరుణ, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్‌అలీ, రవీంద్రనాయక్, గీతారెడ్డి, డీకే సమరసింహారెడ్డి, కాసు కృష్ణారెడ్డి, సీనియర్ సంపాదకులు పొత్తూరు వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బద్దం బాల్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, మాజీ మేయర్ బండా కార్తికరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గోల్కొండ రాజ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వీ శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి కుమారులు మర్రి శశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మనవళ్ళు ఆదిత్యారెడ్డి, పురోవర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శనివారం రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ

తెలంగాణ చరిత్రను తవ్వితే..
ఎన్నెన్నో కథలు

'టాక్- ఎట్- సినివారం'లో నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి

రవీంద్రభారతి, నమస్తే తెలంగాణ: తెలంగాణ చరిత్రను ఎంత తవ్వితే అన్ని కథలు దొరుకుతాయని, వాటిని ఇతివృత్తంగా తీసుకుని సినిమాలు తీయాలని నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి యువ దర్శకనిర్మాతలకు సూచించారు. రవీంద్రభారతిలో శనివారం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టాక్ ఎట్ సినివారం'కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ గడ్డమీద ప్రపంచప్రఖ్యాతి పొందిన సాయుధ రైతాంగ పోరాటంతో సహా ఎన్నో వరుస ఉద్యమాలు జరిగాయని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, నక్సల్బరీ ఉద్యమంతో పాటు మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఏ ప్రాంతానికి లేని ఉద్యమ చరిత్ర తెలంగాణకు ఉన్నదని అన్నారు. తెలంగాణ జీవితాన్ని, చరిత్రను పునర్దర్శనం చేసుకోవాలని, అందులోంచి పుంఖానుపుంఖాలుగా మంచిమంచి కథలు ఎన్నో వస్తాయని అన్నారు. ఇటీవల ఫిదా, అర్జున్‌రెడ్డి సినిమాలు సక్సెస్ అయ్యాయని ఉదహరించారు. తెలంగాణ యువ సినీమేకర్స్ అద్భుతమైన మానవీయ కోణాలతో లఘుచిత్రాలు తీసి సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో పెడుతున్నారని ప్రశంసించారు. అనంతరం యువ దర్శకనిర్మాతలు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలు ఇస్తూ చక్కని సూచనలను చేశారు. ప్రొడక్షన్ ఓరియెంటెడ్ థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. శేఖర్‌రెడ్డిని సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ సత్కరించారు.

పేరొకరిది.. నడిపేదొకరు

క్యాబ్ ప్రయాణికులకు సరికొత్త సమస్య • తాత్కాలిక డ్రైవర్లతో సర్వీసులు తిప్పుతున్న కార్ల యజమానులు
అడ్డదిడ్డంగా డ్రైవింగ్, ప్రయాణికులతో దురుసు ప్రవర్తన • మహిళా ప్రయాణికులకు పెరుగుతున్న వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఓ యువతి (21) బయటికి వెళ్లేందుకు ఓ క్యాబ్‌ను బుక్ చేయగా అశోక్(పేరు మార్చాం) పేరుతో ఫొటో, ఫోన్ నంబర్, బండి నంబర్‌తో సమాచారం వచ్చింది. కారు కొద్దిగా ఆలస్యంగా రావడంతో ఆమె సరిగా గమనించకుండానే ఎక్కేసింది. డ్రైవర్ చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకొని డ్రైవ్ చేయడంతోపాటు అద్దంలో నుంచి ఆ యువతిని చూస్తూ సూపర్.. హైలెట్ అంటూ కామెంట్ చేశాడు. గమనించిన యువతి వెంటనే కారు ఆపి దిగేసింది. తండ్రి సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అశోక్‌ను పిలువగా, అతడి బదులు సోదరుడి కుమారుడు రాము వచ్చాడు. యువతిని ఎవరు వేధించారని ప్రశ్నించగా ఆరోజు ప్రసాద్ అనే వ్యక్తి నడిపినట్టు తేలింది. అయితే ప్రసాద్ ఇయర్‌ఫోన్ పెట్టుకొని తన గర్ల్‌ఫ్రెండ్‌తో మాట్లాడానని ఆమెనే సూపర్ అని సంబోధించానని బుకాయించాడు. పోలీసులు సాంకేతికంగా ఆధారాలు సేకరించి వేధించినట్టు నిరూపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంస్థ ఆ డ్రైవర్ ఐడీని బ్లాక్ చేసింది. ఇటీవల నగరంలో ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. క్యాబ్ సంస్థలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న డ్రైవర్లు కాకుండా వాహనాలను వేరే వ్యక్తులు నడుపుతుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దురుసు ప్రవర్తన, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మహిళా ప్రయాణికులను వేధించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో లైసెన్స్ లేనివాళ్లు కూడా కార్లు నడుపుతున్నట్టు బయటపడుతున్నాయి.

తాత్కాలిక డ్రైవర్లతో భద్రతకు ముప్పు

క్యాబ్ డ్రైవర్లు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునే సమయంలో వారి ఫోన్ నంబర్లు రిజిస్టర్ చేసుకొని, ఫొటో ఐడీని సంస్థకు ఇస్తారు. సంస్థ యాజమాన్యం ఈ వివరాలను వారి యాప్‌లో భద్రపరిచి బుకింగ్ సమయంలో ప్రయాణికులకు డ్రైవర్ ఫొటో, ఫోన్ నంబర్లను పంపిస్తుంది. కానీ చాలా మంది క్యాబ్‌ల యజమానులు రిజిస్టర్ చేసుకున్న వ్యక్తి స్థానంలో తాత్కాలిక డ్రైవర్లను పంపుతున్నారు. వారికి రోజుకు రూ.500-800 వరకు ఇస్తూ మరో వ్యాపారం చూసుకుంటున్నట్టు తెలుస్తున్నది. తాత్కాలిక డ్రైవర్లకు సరైన లైసెన్స్, బ్యాచ్ నంబర్లు లేకున్నా రోడ్లపైకి వస్తున్నారు. కొందరు తాత్కాలిక డ్రైవర్లు ప్రయాణికులతో దురుసుగా మాట్లాడుతుండడం, అభ్యంతకరమైన రీతిలో ప్రవర్తిస్తుండడంతో తరుచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒంటరిగా ప్రయాణించే యువతులు, మహిళలను చూపులు, మాటలతో వేధిస్తున్నారు. బాధితులు చాలా మంది పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా కేవలం మౌఖిక ఫిర్యాదు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల సహాయంతో క్యాబ్ సంస్థల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయాణిస్తున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

ప్రయాణికులు సైతం క్యాబ్‌లు ఎక్కే సమయంలో బుకింగ్ సమయంలో వచ్చిన ఫొటో, ఇతర వివరాలను సరిపోల్చుకోవాలని.. ఒకే వ్యక్తి అయితేనే క్యాబ్ ఎక్కాలని సూచిస్తున్నారు. ఒకవేళ వేరే డ్రైవర్ ఉంటే ఆయా సంస్థలకు సమాచారం అందించాలి. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, ఇతర లోపాలు ఉన్నా సంస్థలకు సమాచారం ఇవ్వాలి. డ్రైవర్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలి.

ప్రోత్సహిస్తే యజమానికే నష్టం

క్యాబ్ సంస్థల మార్గదర్శకాల ప్రకారం సంస్థలో రిజిస్టర్ చేసుకున్న వ్యక్తి కాకుండా మరో వ్యక్తి క్యాబ్‌ను నడుపడం విరుద్ధం. చట్టపరంగా చూసినా ఇది నేరమేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. క్యాబ్ సంస్థలు ఇలాంటి ఘటనలపై నిఘా పెడుతున్నా యజమానులు, డ్రైవర్లు కుమ్మక్కై తప్పించుకుంటున్నారు. మరోవైపు బాధితులు సైతం పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వడం లేదు. దీంతో మందలించి వదిలేస్తున్నారు. ఈ విధమైన లోపాలు ప్రయాణికుల భద్రతకు పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు. తాత్కాలిక డ్రైవర్లు ఏదైనా అఘాయిత్యానికి, నేరానికి పాల్పడితే రిజిస్టర్ డ్రైవర్‌కు సైతం ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఫిర్యాదు అందితే పోలీసులు కారును సీజ్ చేయడంతో పాటు క్యాబ్ సంస్థ, రిజిస్టర్డ్ డ్రైవర్, తాత్కాలికంగా నడిపించిన డ్రైవర్‌ను నిందితులుగా నమోదు చేస్తారని చెప్తున్నారు.



డ్రగ్స్ సరఫరా కోసం కారు డిక్కీలో ప్రత్యేకంగా అమర్చిన షెల్ఫ్

భారీగా మత్తుపదార్థాలు స్వాధీనం

- సంగారెడ్డిలో 46 కిలోల మెథాక్యులోన్ పట్టివేత
- షాద్‌నగర్‌లో 1.8 కిలోల గామా హైడ్రాక్సీ బ్యురెట్ స్వాధీనం.. మొత్తం 11 మంది అరెస్ట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్(తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) తెలిపింది. చలిగాలుల తీవ్రత లేకపోవడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తున్నది. ఈనెల 16 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని టీఎస్‌డీపీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉన్నదన్నారు.



వరంగల్ జిల్లా భీమారం చింతగట్టులో ఎస్సారెస్పీ కాల్వ ఆధునీకరణ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

కోటి ఎకరాల మాగాణే సీఎం కేసీఆర్ సంకల్పం

- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

మారం(వరంగల్): తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చడానికి సీఎం కేసీఆర్ సంకల్పించారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండల భీమారం చింతగట్టు ఎస్సారెస్పీ క్యాంపు బ్రిడ్జి వద్ద కాకతీయ ప్రధాన కాల్వ వెడల్పు, ఆధునీకరణ పనులకు శనివారం కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ ఎల్‌ఎండీ నుంచి మహబూబాబాద్ వరకు ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ కట్ట ఎత్తును పెంచుతూ ప్రధాన కాల్వలను పటిష్ఠ పరచడానికి ప్రభుత్వం రూ.460 కోట్లతో పనులు చేపడుతున్నదన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొన్నారు.

పాలమూరు లిఫ్ట్‌తో సాగులోకి బీడు భూములు



మిడ్జిల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు కృష్ణా జలాలు తరలించి బీడు భూముల్లో పంటలు సాగయ్యేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పాలమూరు ఎత్తిపోతల పూర్తయితే 14 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందించడంలో దేశంలోనే ప్రథమమన్నారు. వచ్చే ఎన్నికల్లో 112అసెంబ్లీ, 16ఎంపీ స్థానాలను టీఆర్‌ఎస్ గెలుచుకోవడం ఖాయమన్నారు.

విమర్శించేందుకు ప్రతిపక్షాలు రేసు కుక్కల్లా పోటీ



నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తుంటే జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ బీహెచ్‌ఈఎల్‌కు దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను అప్పగించినా.. ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారని, అది వారి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తేనే గొప్పోళ్లం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు రేసు కుక్కల్లా పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు.

అయ్యో, ఎంతపనిచేసె..

- ఇద్దరు కుమారులతో కలిసి హోంగార్డు ఆత్మహత్య
- కుటుంబ కలహాలే కారణం!
- ఖమ్మం వెంకటగిరి రైల్వే గేటు వద్ద దారుణం



కాశీ విశ్వనాథ్, జయంత్, అజయ్ (ఫైల్)

ఖమ్మంక్రైం: తన పిల్లలకు మంచి భవిష్యత్తును కల్పించాలని కలలు కన్న ఆ తండ్రి.. అంతలోనే మనసు మార్చుకుని తనతోపాటే అనంతలోకాలకు తీసుకెళ్లాడు. ముక్కుపచ్చలారని చిన్నారులు తనతండ్రితోపాటు ఈ లోకాన్ని వీడారు. రైలు పట్టాలపై ముక్కలు చెక్కలై పడిన ఉన్న ముగ్గురి మృతదేహాలను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోయారు. ఈ ఘటన ఖమ్మం నగరంలోని వెంకటగిరి రైల్వే గేటు సమీపంలో శనివారం ఉదయం వెలుగుచూసింది. ఈ ఘటనకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తున్నది. ఖమ్మం గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), మృతుని బంధువుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా తిరువూరుకు చెందిన కాశీ విశ్వనాథ్(38) ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొర్లగూడెంకు చెందిన సరితను 15 ఏండ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. తిరువూరు నుంచి కల్లూరుకు వచ్చి కిరాణ దుకాణాన్ని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి జయంత్ (13), అజయ్(11) అనే ఇద్దరు కుమారులు. వీరు ఆరు, ఏడు తరగతులు చదువుతున్నారు. 2007లో విశ్వనాథ్‌కు హోంగార్డుగా ఉద్యోగం రావడంతో దుకాణాన్ని సరిత నడుపుతున్నారు. ఇంటినుంచే కొత్తగూడెం వెళ్లి ఉద్యోగం చేసేవాడు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన ఇద్దరు పిల్లలతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం ఖమ్మంలోని వెంకటగిరి రైల్వే గేటు సమీపంలో పట్టాలపై విశ్వనాథ్‌తోపాటు ఇద్దరు కుమారులు విగతజీవులుగా పడిఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు.

కారు బీభత్సం: ఇద్దరి దుర్మరణం

చేగుంట: అతివేగంతో వెళ్తున్న కారు బీభత్సం సృష్టించి మరో కారును ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం కాసులపూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగింది. రాజన్నసిరిసిల్ల జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన బొంతు శ్రీనివాస్‌రావు(45), నర్సింగ్‌రావు(50)లు కారులో హైదరాబాద్‌లోని దవాఖానకు వెళ్లి తిరుగుపయనమయ్యారు. అతివేగంగా వెళ్తున్న వీరి కారు నార్సింగి మండలం కాసులపూర్ చౌరస్తా వద్ద అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో కారుపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు కార్లు నుజ్జునుజ్జు కావడంతోపాటు శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌రావులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. నిజామాబాద్‌కు చెందిన వెంకటేశ్, కవితకు తీవ్రగాయాలయ్యాయి.

దేశంలోనే రికార్డ్..కాళేశ్వరం

పదేండ్లలో చేయాల్సింది రెండేండ్లలోనే పూర్తి చేస్తున్నాం ■ తెలంగాణ వస్తే చీకటవుతదన్నోళ్లే ఆశ్చర్యపోతున్నారు

భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ■ కడియం, తుమ్మలతో కలిసి వరంగల్ ఉమ్మడి జిల్లాలో పర్యటన



పర్వతగిరి సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై డిప్యూటీ సీఎం కడియం, మంత్రి తుమ్మల, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి,ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు వాసుదేవరెడ్డి, రాజయ్యయాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి/వరంగల్, నమస్తే తెలంగాణ: దేశంలో అతితక్కువ కాలంలో పూర్తి కానున్న భారీ ప్రాజెక్టుగా కాళేశ్వరం నిలువనున్నదని భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పదేండ్లలో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టును రెండేండ్లలో పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు మేలు జరుగాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి, గీసుకొండ మండలాల్లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి పర్యటించారు. రూ.26 కోట్లతో చేపట్టనున్న పర్వతగిరి రిజర్వాయర్ ఆధునీకరణ పనులను, రూ.12కోట్లతో నిర్మించిన కల్లెడ చెక్‌డ్యాం-బ్రిడ్జి, రూ.4కోట్లతో నిర్మించిన గిడ్డంగిని ప్రారంభించారు. గీసుకొండ మండలం వంచనగిరిలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అండర్ బ్రిడ్జి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన సభలో డిప్యూటీ సీఎం కడియం, మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఆయా సభల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో వరంగల్ ఉమ్మడి జిల్లా భారీస్థాయిలో లబ్ధి పొందనున్నదన్నారు. తెలంగాణ వస్తే చీకటవుతుందన్నోళ్లు ఇప్పుడు జాడ లేకుండా పోయారని ఎద్దేవా చేశారు.

నిరంతర విద్యుత్ కావాలో వద్దో మీ ఇష్టం..

24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ తెలంగాణ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం నీరొచ్చే వరకు 24 గంటల విద్యుత్ సరఫరాను తగ్గించాలని ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరగా.. మంత్రి హరీశ్‌రావు స్పందిస్తూ.. 24 గంటల విద్యుత్ కావాలో వద్దో రైతులే నిర్ణయించుకోవాలని సూచించారు. నిరంతర విద్యుత్ అవసరం లేదనుకుంటే గ్రామంలో తీర్మానం చేసి స్థానిక ఎమ్మెల్యేకు విన్నవిస్తే సరిపడా కరంటును సరఫరా చేస్తారని చెప్పారు. చారిత్రక ఓరుగల్లు కోట చుట్టూ దేవాదుల నీటిని నింపేందుకు లిఫ్ట్ మంజూరు చేస్తామని మంత్రి హరీశ్ తెలిపారు.

వరంగల్‌కు ఉజ్వల భవిష్యత్తు: తుమ్మల

ఏడాదిలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులు మంజూరు కావడం దేశంలోనే తొలిసారని మంత్రి తుమ్మల అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రధాని మోదీకి నమ్మకం లేక సీడబ్ల్యూసీ బృందాన్ని పంపితే.. ఇక్కడి పనులను చూసిన వారి కండ్లు బైర్లు కమ్మాయని తుమ్మల చెప్పారు. భవిష్యత్‌లో అన్ని జాతీయ రహదారులను వరంగల్ ఓఆర్‌ఆర్‌కు అనుసంధానం చేస్తామన్నారు.

వరంగల్‌పై సీఎం ప్రత్యేక దృష్టి: కడియం

ఉద్యమంలో వెన్నంటి నిలిచిన వరంగల్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. ఏటా బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయిస్తూ వరంగల్ నగరాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ సరఫరాపై కారు కూతలు కూస్తున్న కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కొండా మురళి, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ నరేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ, కార్పొరేషన్ల చైర్మన్లు రాజయ్య యాదవ్, వాసుదేవరెడ్డి, గుండు సుధారాణి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళపల్లి రవీందర్‌రావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

వెంటాడి.. ఢీ కొట్టి..

ప్రేమికులపై బంధువు ఉన్మాదం

కారును ఛేజ్ చేసిన వైనం.. డ్రైవర్ మృతి.. నలుగురి పరిస్థితి విషమం



చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జైన కారు, (ఇన్‌సెట్) సుమన్‌గాంధీ

రఘునాథపాలెం: ప్రేమ పెండ్లి చేసుకున్న ఆ నవదంపతులు వెళ్తున్న కారును సమీప బంధువు ఛేజింగ్ చేశాడు. తప్పించుకొనే ప్రయత్నంలో కారు వేగంగా చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవదంపతులు, వారి స్నేహితులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సినిమా క్లైమాక్స్‌ను మరిపించే ఈ సంఘటన ఖమ్మం నగర శివారులోని వైరా రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. నవదంపతుల కథనం ప్రకారం.. ఇల్లెందు రెండో నెంబర్ బస్తీకి చెందిన ఎండీ సాహేలా అదే ప్రాంతానికి చెందిన శ్రీపతి సుమన్ గాంధీ ఐదేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. సాహేలా స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, సుమన్ గాంధీ అక్కడే ఓ వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. వీరిరువురి ప్రేమ విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలిసి పలుమార్లు హెచ్చరించారు. సాహేలా ఇంట్లో తనకు వేరే పెండ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సుమన్ గాంధీ తన స్నేహితుల సహాయంతో సాహేలాతో పెండ్లికి ఏర్పాట్లు చేశాడు. వారు ఈ నెల 12న మహబూబాబాద్ జిల్లా అనంతారంలోని జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పెండ్లి చేసుకొన్నారు. అనంతరం తమకు కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉందంటూ ఇల్లెందు పోలీసులను ఆశ్రయించారు. ఇరువురూ మేజర్లు కావడంతో ఇల్లెందు సీఐ యువతి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. దీంతో నవదంపతులు ఆ రోజు రాత్రి సీతారాంపురంలోని తన స్నేహితుడి ఇంట్లో ఉన్నారు. ఇల్లెందులో ఉంటే కుటుంబ సభ్యులతో ప్రమాదమని భావించి హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధపడ్డారు. స్నేహితుల సహాయంతో ఓ కారును మాట్లాడుకొని కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. విషయం తెలుసుకున్న యువతి మేనమామ మున్నా ప్రేమ జంట వెళ్తున్న కారును వెంబడించాడు. ఛేజింగ్ చేసే క్రమంలో గోపాలపురం సమీపానికి చేరుకోగానే ప్రేమజంట వెళ్తున్న కారును వేగంగా ఢీ కొట్టారు. దీంతో ఆ కారు అదుపు తప్పి వేగంగా సమీపంలో ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. కారు డ్రైవర్ మద్దెల రాజు(21) అక్కడికక్కడే మృతి చెందాడు. సుమన్ గాంధీ స్నేహితులైన తరుణ్, ముత్యాల రవిలకు తీవ్ర గాయాలయ్యాయి. తరుణ్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రేమికులైన సునీల్ గాంధీ, సాహేలాలకు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రమాదానికి కారణమైన మేనమామను శిక్షించాలి..



మా నాన్న వెటర్నరీ కాంపౌండర్‌గా పని చేస్తూ చనిపోయారు. సుమన్ గాంధీ నేను గత ఐదేండ్లుగా ప్రేమించుకుంటున్నాం. మా పెండ్లికి మేనమామ మున్నా ఒప్పుకోలేదు. నా ఇష్ట పూర్వకంగానే సుమన్ గాంధీని పెండ్లి చేసుకున్నాను. ఇల్లెందులో ఉంటే మేనమామతో ప్రమాదమని తెలిసి స్నేహితుల సహాయంతో హైదరాబాద్‌కు కారు వెళ్తుండగా మరో కారులో మా మేనమామ మున్నా, అఫ్సర్, హర్షద్, ఆజాం, ఫరీద్ అనే వ్యక్తులతో వెంబడించి ఢీకొట్టి పరారయ్యారు. ప్రమాదానికి కారణమైన మా మేనమామ మున్నాను శిక్షించాలి.

\- ఎండీ సాహేలా, బాధితురాలు



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి సన్నిధిలో శనివారం రాత్రి విశ్వరూప సేవ నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పూజించిన దేవతలందరినీ ఒక్కచోటకు చేర్చి ఈ వేడుకను కన్నుల పండువలా నిర్వహించారు. -భద్రాచలం నమస్తే తెలంగాణ



అమెరికా ఎంబసీ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ బీ హడ్డ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్ర ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. కనుముక్కుల గ్రామంలోని పోచంపల్లి చేనేత హ్యాండ్లూమ్ పార్కును తిలకించారు. చేనేతలో 60 శాతం మహిళల భాగస్వామ్యం ఉండటంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. -భూదాన్ పోచంపల్లి

మరుగుదొడ్డి నిర్మాణానికి నిరాకరణ

- సదరు వ్యక్తి ఇంటి ఎదుట అధికారుల నిరసన

హాలియా, నమస్తే తెలంగాణ: వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి నిరాకరించిన నల్లగొండ జిల్లా అనుముల మండలం నాయుడుపాలెం వాసి బాణావత్ కృష్ణానాయక్ ఇంటి ఎదుట శనివారం అధికారులు నిరసనకు దిగారు. నాయుడుపాలెంను ప్రభుత్వం ఓడీఎఫ్‌గా ప్రకటించగా గ్రామస్థులంతా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ఎంత ఒత్తిడి చేసినా కృష్ణానాయక్ మాత్రం చొరువ చూపకపోవడంతో ఎంపీడీఓ జానయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, ఎంపీటీసీ అంజమ్మ సర్దార్‌నాయక్, ఏపీవో ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు నెహ్రూ అతని ఇంటి ఎదుట బైఠాయించారు. గ్రామస్థులు సైతం ఒత్తిడి తేవడంతో నాయక్ ఎట్టకేలకు అంగీకరించాడు. దీంతో వారు నిరసన విరమించారు.



కృష్ణానాయక్ ఇంటి ఎదుట బైఠాయించిన అధికారులు



ఖమ్మంలో ముగ్గుల పోటీ విజేతకు రూ.లక్ష విలువ చేసే బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్

ఖమ్మంలో మెగా సంక్రాంతి సంబురాలు

- ముగ్గుల విజేతకు రూ.లక్ష విలువ చేసే బంగారం

ఖమ్మం కల్చరల్/తాండూరు, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ సంయుక్తంగా ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం మెగా సంక్రాంతి సంబురాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో 150 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి సాధించిన రమాదేవికి లక్ష రూపాయల విలువ చేసే బంగారు ఆభరణం, ద్వితీయ బహుమతి కింద కే లక్ష్మికి రూ.75 వేల విలువ చేసే, తృతీయ బహుమతిగా సరస్వతికి రూ.50 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు అందజేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంతోపాటు యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల కేంద్రాల్లో శనివారం టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. తాండూర్‌లో మొదటి బహుమతి కింద ఇంద్రజకు 5 గ్రాముల బంగారాన్ని మంత్రి మహేందర్‌రెడ్డి అందజేశారు.



వికారాబాద్ జిల్లా తాండూర్‌లో విజేతకు బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

గుడిసెల్లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: అర్హులందరికీ పక్కా ఇండ్లు కేటాయించి, గుడిసెల్లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది సీఎం కేసీఆర్ లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, జమ్మికుంటలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. హుజూరాబాద్‌లోని పోతిరెడ్డిపేటలో ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదోళ్ల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని చెప్పారు.



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని పోతిరెడ్డిపేటలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల

రైతు సంక్షేమమే సర్కారు లక్ష్యం



కామారెడ్డి జిల్లా కిష్టాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నమస్తే తెలంగాణ: రైతులు అప్పులు చేయకుండా ఎవుసం చేసే రోజులు తేవాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని, అన్నదాతల సంక్షేమానికి సర్కారు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో రూ.1.26 కోట్లతో 25 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు. అనంతరం చించోల్లిలో రూ.15.50 లక్షలతో నిర్మించిన గోదామును ప్రారంభించారు.



నాగర్‌కర్నూల్ జిల్లా పదరలో టీడీపీ నాయకులకు కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కల్లుపల్లికి చెందిన రజక సంఘం సభ్యులు హుజూరాబాద్‌లో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో శనివారం టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలో అమ్రాబాద్ మండల తెలుగు యువత అధ్యక్షుడు రాసనూరి మహేశ్‌తో పాటు మరో 20మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, హైదరాబాద్‌లోని రహ్మత్‌నగర్ డివిజన్ సలీంబాబానగర్ బస్తీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రహీంఖాన్ సహా మరో 200 మంది ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
ఆదివారం 14 జనవరి 2018



తెలంగాణ చేనేతతో రూపొందించిన దుస్తుల్లో మెరిసిపోతున్న స్పెయిన్ బ్యాడ్మింటన్ స్టార్ కరోలినా మారిన్. ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ ఫొటోకి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్.. 'తెలంగాణ చేనేత ప్రపంచ వ్యాప్తమవుతున్నాయి. మారిన్‌కు ధన్యవాదాలు' అంటూ రీ ట్వీట్ చేశారు.

టీసీఏతో నాకు సంబంధం లేదు




అజర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ)తో తనకు ఎలాంటి సంబంధం లేదని భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్ స్పష్టం చేశాడు. గ్రామీణ ప్రాంతాలలో ఎంతో నైపుణ్యం ఉన్నా వారికి అవకాశాలు రావడం లేదని, ఈ విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ క్రికెట్‌కు మేలు జరుగుతుందనుకుంటే ఎన్ని గంటలైనా గేటు బయటే వేచిచూస్తానని..హైదరాబాద్ నుంచే క్రికెట్ ఆడి దేశానికి ప్రాతినిథ్యం వహించానని గుర్తు చేశారు. హెచ్‌సీఏ లోధా కమిటీ ప్రతిపాదనలకు అమలు చేయడం లేదన్నారు. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి తనవంతు సాయం తప్పనిసరిగా చేస్తానన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా ఎన్నికవడం తప్పా అని అడిగారు. అంత మాత్రాన యూపీ నుంచే క్రికెటర్‌గా నమోదు చేసుకోవాలనడాన్ని ఆయన తప్పు బట్టారు. హెచ్‌సీఏ ఎన్నికలు పారదర్శకంగా జరుగలేదని, ఈ విషయంలో న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు అజర్ తెలిపారు.

ఆరోపణలపై ఆధారాలు చూపండి..

హెచ్‌సీఏ, అజర్‌ల మధ్య వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఈ నెల 7వ తేదీన హెచ్‌సీఏ ఏజీఎంకు ముందు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సెలక్టర్లు డబ్బులు తీసుకుని జట్టులోకి ఎంపిక చేస్తున్నారంటూ మాజీ కెప్టెన్ అజరుద్దీన్ విమర్శించిన విషయం తెలిసిందే. ఓ మహిళ తన తనయుడిని జట్టులోకి ఎంపిక చేయాలంటే హెచ్‌సీఏ సెలక్టర్ ఒకరు డబ్బు డిమాండ్ చేసాడని తనను కలిసి ఆవేదన వ్యక్తం చేసినట్లు అజర్ చెప్పాడు. ఈ విషయంపై శనివారం హెచ్‌సీఏ సెలక్టర్లు అరవింద్‌షెట్టి, విష్ణువర్ధన్, నిరంజన్, సుందర్‌రాజన్, సంజయ్‌పటేల్ స్పందించారు. డబ్బు డిమాండ్ చేసిన ఆ సెలక్టర్‌తో పాటు ఆధారాలను అజర్ చూపాలంటూ వీరంతా డిమాండ్ చేసారు. ఆధారాలు లేకుండా అవాస్తవాలను ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. అజర్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఈ మేరకు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



అశ్విన్ (3/90)

సెంచురియన్

5 పరుగుల తేడాతో 3 వికెట్లు
అశ్విన్ విజృంభణ
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 269/6

ఆఖర్లో అదురగొట్టారు..

అంచనాలు తారుమారు అయ్యాయి. పేస్, బౌన్స్‌కు పెట్టింది పేరు అనుకున్న సూపర్‌స్పోర్ట్ పార్క్‌లో వికెట్ల కోసం భారత బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. కెప్టెన్ కోహ్లీ ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా ఏ ఒక్కటి సఫలం కాలేదు. ఫలితంగా తొలి రెండు సెషన్ల వరకు ఆతిథ్య దక్షిణాఫ్రికాదే సంపూర్ణ ఆధిపత్యం. పేసర్లు విజృంభిస్తారుకున్న వేళ అశ్విన్ అనూహ్యంగా తన స్పిన్ తంత్రంతో సఫారీలను కట్టడిచేశాడు. 246/3 మెరుగైన స్థితిలో కనిపించిన దక్షిణాఫ్రికా ఆఖర్లో ఘోరంగా తడబడింది. అశ్విన్ స్పిన్ జోరుకు తోడు హార్దిక్ మెరుపు ఫీల్డింగ్‌తో ఐదు పరుగుల తేడాతో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. తమ చేతుల్లో నుంచి చేజారిందనుకున్న మ్యాచ్‌ను కోహ్లీసేన ఆఖర్లో అద్భుతంగా ఒడిసిపట్టుకుంది.

ప్రపంచంలోని రెండు అత్యుత్తమ టెస్ట్ జట్ల మధ్య శనివారం ఆసక్తికర పోరుకు తెరలేసింది. సెంచురియన్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్ట్ మ్యాచ్ మొదలైంది. కీలకమైన టాస్ గెలిచిన సఫారీలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. బౌన్స్, స్వింగ్‌కు సహకరిస్తుందన్న వార్తల నేపథ్యంలో మొదలైన మ్యాచ్ అందుకు పూర్తిగా భిన్నంగా సాగింది. మార్క్రమ్(150 బంతుల్లో 94, 15ఫోర్లు), ఆమ్లా(153 బంతుల్లో 82, 14 ఫోర్లు) అర్ధసెంచరీలతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 269 పరుగులు చేసింది. అశ్విన్(3/90) మూడు వికెట్లతో విజృంభించగా, ఇషాంత్‌శర్మ(1/32) ఒక వికెట్ పడగొట్టాడు. ఆమ్లా, ఫిలాండర్(0) హార్దిక్ మెరుపు ఫీల్డింగ్‌తో పెవిలియన్ చేరారు. కెప్టెన్ డుప్లెసిస్(24), కేశవ్ మహారాజ్(10) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ కోహ్లీ రెండో టెస్ట్‌లోనూ తన ప్రయోగాల పరంపరను కొనసాగించాడు. ఓపెనర్ ధవన్ స్థానంలో రాహుల్‌ను, గాయపడ్డ సాహాకు బదులుగా పార్థివ్ పటేల్‌ను, స్వింగ్‌స్టర్ భువనేశ్వర్‌ను తప్పించి సీనియర్ ఇషాంత్ శర్మను తుదిజట్టులోకి తీసుకున్నారు. మరోవైపు గాయంతో సిరీస్‌కు దూరమైన స్టెయిన్ స్థానంలో యువ పేసర్ లుంగి న్గిడిని దక్షిణాఫ్రికా తుదిజట్టులోకి తీసుకుంది.

అశ్విన్ అదుర్స్:

సెంచురియన్‌లో పేసర్లదే హవా అనుకున్న వేళ..అశ్విన్ తన స్పిన్ మాయాజాలంతో దక్షిణాఫ్రికాను కట్టడి చేయడంలో కీలకమయ్యాడు. కెప్టెన్ కోహ్లీ నమ్మకాన్ని నిలబెడుతూ సఫారీల పతనాన్ని శాసించాడు. మొదట్లో దక్షిణాఫ్రికా ఓపెనింగ్ ద్వయం మార్క్రమ్(94), ఎల్గర్(31) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టారు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ నింపాదిగా ఆడారు. ఈ జోడీని విడగొట్టేందుకు కోహ్లీ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో బౌలింగ్‌కు దిగిన అశ్విన్..ఎల్గర్‌ను ఊరించే బంతితో బోల్తా కొట్టించాడు. ముందుకు వచ్చి ఆడే ప్రయత్నంలో ఫార్వర్డ్ లెగ్‌లో మురళీ విజయ్ సమయోచిత క్యాచ్‌కు ఎల్గర్ తొలి వికెట్‌గా ఔటయ్యాడు. దీంతో 85 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన ఆమ్లా..మార్క్రమ్ అదే జోరులో అలవోకగా పరుగులు కొల్లగొట్టారు. సెంచరీకి సమీపిస్తున్న సమయంలో మార్క్రమ్‌ను అశ్విన్ ఔట్ చేసి భారత శిబిరంలో ఆనందం నింపాడు. తన ఔట్‌పై డీఆర్‌ఎస్‌కు వెళ్లిన మార్క్రమ్‌కు నిరాశే ఎదురైంది. 148 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా రెండో వికెట్ కోల్పోయింది. డివిలీయర్స్(20)..ఆమ్లా అండగా పరుగులు సాధించే ప్రయత్నం చేశాడు. వీరిద్దరి బ్యాటింగ్‌తో టీ విరామ సమయానికి దక్షిణాఫ్రికా 182/2 స్కోరుతో మెరుగైన స్థితిలో ఉన్నది.

5 పరుగుల తేడాతో 3 వికెట్లు:

తొలి రెండు సెషన్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన దక్షిణాఫ్రికా ఆఖరి సెషన్లో భారీ మూల్యం చెల్లించుకుంది. ఇషాంత్‌శర్మ బౌలింగ్‌లో ఆఫ్‌స్టంప్‌కు ఎడంగా వెళుతున్న బంతిని ఆడబోయిన డివిలీయర్స్..క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కెప్టెన్ డుప్లెసిస్..ఆమ్లాతో ఇన్నింగ్స్‌ను కొనసాగించే ప్రయత్నం చేశాడు. వీరిద్దరు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ స్కోరుబోర్డుకు పరుగులు జతచేశారు. ఇక వికెట్లు దక్కడం కల్లే అనుకుంటున్న తరుణంలో హార్దిక్ పాండ్యా అద్భుతం చేశాడు. లేని పరుగు కోసం ప్రయత్నించిన ఆమ్లా..పాండ్యా డైరెక్ట్ త్రోతో నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత అశ్విన్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతికే డీకాక్(0) స్లిప్‌లో కోహ్లీ క్యాచ్‌తో ఔటయ్యాడు. హార్దిక్ వేసిన ఆ మరుసటి ఓవర్లో ఫిలాండర్(0) రనౌట్ అయ్యాడు. షాట్ ఆడే ప్రయత్నంలో లెగ్‌సైడ్ ఆడిన బంతిని కీపర్ పార్థివ్ అవతలి ఎండ్‌లో ఉన్న హార్దిక్ అందించడం వెంటనే వికెట్లు పడగొట్టడం క్షణంలో జరిగిపోయాయి. దీంతో 246/3 స్కోరుతో మెరుగ్గా కనిపించిన దక్షిణాఫ్రికా..ఐదు పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయి 251/6 స్థితిలో నిలిచింది. హార్దిక్ రెండు మెరుపు రనౌట్లతో మ్యాచ్ గతినే మార్చేశాడు.



మర్క్రామ్ (94)

ఇదేమి ఎంపిక!

ఏ ప్రతిపాదికన టీమ్‌ఇండియా తుది జట్టు ఎంపిక చేస్తున్నారో ఎవరికీ అర్థంకావడం లేదు. మార్పులేవని చెప్పిన 24 గంటల్లోనే ముగ్గుర్ని మార్చి కోహ్లీ అందర్ని ఆశ్చర్యంలో పడేశాడు. దీంతో రెండో టెస్టుకు ఎంపిక చేసిన జట్టుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ మ్యాచ్ కోసం ధవన్, భువనేశ్వర్, సాహాను తప్పించి రాహుల్, ఇషాంత్, పార్థివ్‌ను తీసుకున్నారు. అయితే అద్భుతమైన ఫామ్‌తో తొలి టెస్టులో ఆరు వికెట్లు తీసిన భువీని పక్కనబెట్టడంపై మాజీలు గవాస్కర్, లక్ష్మణ్, అలెన్ డోనాల్డ్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక ధవన్ మెడపై కత్తి ఎప్పుడూ వేలాడుతూనే ఉంటుందని ధ్వజమెత్తిన గవాస్కర్ అతనో బలి పశువు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. 'ధవన్ బలి కా బక్రా. కత్తిపీటపై అతని తలకాయ వేలాడుతూ ఉంటుంది. ఒక్క చెత్త ఇన్నింగ్స్‌కే జట్టులో నుంచి తీసేస్తారా? భువీ స్థానంలో ఇషాంత్ ఎందుకు వచ్చాడో నాకైతే అర్థంకావడం లేదు. షమీ లేదా బుమ్రా స్థానంలో తీసుకుంటే బాగుండేది' అని సన్నీ వ్యాఖ్యానించాడు.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్(సి)విజయ్(బి)అశ్విన్ 31, మర్క్రామ్(సి) పార్థివ్‌పటేల్(బి)అశ్విన్ 94, ఆమ్లా (రనౌట్/హార్దిక్) 82, డివిలీయర్స్(బి) ఇషాంత్‌శర్మ 20, డుప్లెసిస్ 24 నాటౌట్, డీకాక్(సి)కోహ్లీ(బి)అశ్విన్ 0, ఫిలాండర్(రనౌట్) 0, మహారాజ్ 10 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం:**90 ఓవర్లలో 269/6; **వికెట్ల పతనం:** 1-85, 2-148, 3-199,4-246, 5-250, 6-251; **బౌలింగ్:** బుమ్రా 18-4-57-0, షమీ 11-2-46-0, ఇషాంత్ 16-3-32-1, హార్దిక్ 14-4-37-0, అశ్విన్ 31-8-90-3.0

ఫైనల్లో బెంగళూరు

- సెమీస్‌లో అహ్మదాబాద్‌పై గెలుపు
- నేడు హంటర్స్‌తో బ్లాస్టర్స్ టైటిల్ పోరు



అక్సెల్‌సన్

హైదరాబాద్: బెంగళూరు బ్లాస్టర్స్ పీబీఎల్ (ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్) ఫైనల్‌కు చేరుకున్నది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 4-3తో అహ్మదాబాద్‌పై విజయం సాధించి నేడు (ఆదివారం) హైదరాబాద్‌తో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. మొదటగా జరిగిన పురుషుల సింగిల్స్‌లో సౌరభ్‌వర్మ (అహ్మదాబాద్) 15-2, 14-15, 15-10తో ఫెంగ్ (బెంగళూరు)పై గెలువగా..పురుషుల డబుల్స్‌లో సారంగ్, మథియాస్ (బెంగళూరు) 15-13, 15-12తో రెజినాల్డ్, నందగోపాల్ (అహ్మదాబాద్)పై విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో తెజు యింగ్ (అహ్మదాబాద్) 8-15, 15-13, 15-8తో గిల్మోర్ (బెంగళూరు)పై, పురుషుల సింగిల్స్‌లో అక్సెల్‌సన్ (బెంగళూరు) 15-11, 15-14తో ప్రణయ్ (అహ్మదాబాద్)పై, మిక్స్‌డ్ డబుల్స్‌లో సారంగ్, సిక్కిరెడ్డి (బెంగళూరు) 15-12, 13-15, 15-9తో కమిల్లా, హిమ్ (అహ్మదాబాద్)పై విజయం సాధించి బెంగళూరును ఫైనల్‌కు చేర్చారు.

వార్నర్ దూరం..?

ఇంగ్లండ్‌తో ఆస్ట్రేలియా తొలి వన్డే నేడు



వార్నర్

మెల్‌బోర్న్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌కు ముగింపు పలికిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఇప్పుడు పరిమిత ఓవర్ల సిరీస్‌పై దృష్టిపెట్టాయి. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య ఆదివారం తొలి వన్డే జరుగనుంది. టెస్టుల్లో చూపెట్టిన ఆధిపత్యాన్ని ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ కొనసాగించాలని ఆతిథ్య జట్టు కచ్చితమైన ప్రణాళికలు రచిస్తున్నది. అయితే కడుపు నొప్పితో బాధపడుతున్న ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై సందేహాలు నెలకొన్నాయి. ఇక 0-4తో యాషెస్ సిరీస్‌ను చేజార్చుకున్న ఇంగ్లీష్ జట్టు ఈ మ్యాచ్ కోసం కొత్త ఎత్తుగడలు అవలంభిస్తున్నది. 2019 వన్డే వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేయాలని భావిస్తున్నది. కడుపు నొప్పితో ఇబ్బందిపడ్డ జో రూట్ కోలుకోవడం ఇంగ్లండ్‌కు కలిసొచ్చే అంశం.



పృథ్వీ షా

ఆసీస్‌ను నిలువరిస్తారా..?

- అండర్-19 వరల్డ్‌కప్‌లో భారత్ తొలి మ్యాచ్ నేడు

మౌంట్ మౌన్‌గని: భారీ అంచనాలు.. అంతకుమించిన భవిష్యత్ లక్ష్యాలతో బరిలోకి దిగుతున్న భారత యువ జట్టు అండర్-19 ప్రపంచకప్ కోసం సర్వం సిద్ధమైంది. ఆదివారం జరిగే తొలి మ్యాచ్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. తమ ప్రణాళికలకు అనుగుణంగా ఆడి విజయంతో టోర్నీని ప్రారంభించాలని కుర్రాళ్లు ఉత్సాహం చూపుతున్నారు. టీమ్‌ఇండియాలో నైపుణ్యం ఉన్న ఆటగాళ్లకు కొదువలేదు. కెప్టెన్ పృథ్వీ షా, అనుభవజ్ఞుడు శుభ్‌మన్ గిల్, హిమాన్షు రానా, అనుకూల్ రాయ్, అభిషేక్ శర్మతో బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తున్నది. ఇక బౌలింగ్‌లో కమలేష్ నాగర్‌కోటి, శివం మావి, ఇషాన్ పోరెల్ చెలరేగితే భారత్ విజయం నల్లేరు మీద నడకే. మరోవైపు మూడుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా కూడా ఈ మ్యాచ్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. జాసన్ సంఘా నాయకత్వంలో కంగారూలు కూడా సూపర్ ఫామ్‌లో ఉన్నారు. స్టీవ్ వా తనయుడు ఆస్టిన్ వా, విల్ సదర్లాండ్ ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. తొలిరోజు న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్థాన్, జింబాబ్వే, బంగ్లాదేశ్ తమ ప్రత్యర్థులపై గెలిచాయి.

ఉ. గం 5.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో

పాక్ 74కే ఆలౌట్

- కివీస్ 3-0తో సిరీస్ కైవసం



బౌల్ట్ (5/17)

డునెడిన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో పాకిస్థాన్ 74 పరుగులకే కుప్పకూలింది. పేసర్ ట్రెంట్ బౌల్ట్ (5/17) బంతితో చెలరేగడంతో.. కివీస్ 183 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు వన్డేలు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో.. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్... విలియమ్సన్ (73), టేలర్ (52) గప్టిల్ (45) రాణించడంతో 50 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనలో పాక్ 27.2 ఓవర్లలోనే 74 పరుగులకు చేతులెత్తేసింది. బౌల్ట్ ధాటికి పాక్ టాపార్డర్‌లో ఐదుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. రయీస్ (16) టాప్ స్కోరర్.

యువీ, భజ్జీ, గౌతీ ఏ జట్టులోకి

- ఐపీఎల్ వేలంలో 1122 మంది క్రికెటర్లు



న్యూఢిల్లీ: రానున్న ఐపీఎల్ సీజన్ కోసం ఇప్పటికే స్టార్ ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ పూర్తి కాగా ఈనెల 27, 28 తేదీల్లో బెంగళూరులో వేలంపాట జరుగనుంది. దీని కోసం భారత్‌తో సహా మిగతా దేశాల నుంచి మొత్తం 1122 మంది క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారని బీసీసీఐ శనివారం పేర్కొంది. ఎనిమిది ఫ్రాంచైజీల నుంచి 281 మంది క్యాప్‌డ్ ప్లేయర్లు, 838 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు, అసోసియేట్ దేశాల నుంచి ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. ఇందులో భారత్ తరపున యువరాజ్‌సింగ్, హర్భజన్‌సింగ్, గౌతం గంభీర్‌ను ఏ జట్టు ఎంపిక చేసుకుంటుది అన్నది ఆసక్తికరంగా మారింది. ఈసారి వేలంలో గేల్, స్టోక్స్, మ్యాక్స్‌వెల్, స్టార్క్, క్రిస్ లిన్, మోర్గాన్, బ్రావో, ఎవిన్ లెవిస్, డుప్లెసిస్, డీకాక్, ఆమ్లా వైపు ఫ్రాంచైజీలు ఎక్కువ మొగ్గుచూపే అవకాశముంది.

బంగ్లాదేశ్‌పై భారత్ విజయం

దుబాయ్: అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల పరంపర కొనసాగుతున్నది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ అజయ్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రదర్శన (101 నాటౌట్, 4 వికెట్లు) తో ఆకట్టుకుని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. 227 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 18.4 ఓవర్లలోనే ఛేదించింది. అజయ్‌తో పాటు సునీల్ రమేశ్ (105) కూడా శతకం బాదాడు.

ఉన్న ఒక్క బస్సూ పోయింది

మావోల దాడితో ఒంటరైన కుగ్రామం

న్యూఢిల్లీ: గత ఏడాది వరకు ప్రపంచానికి దూరంగా జీవించిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని అత్యంత మారుమూల గ్రామస్థుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. 12 ఏండ్ల తర్వాత తొలిసారిగా గతేడాది మే నెలలో వారికి ఒక బస్సు రావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి సంబంధాలు కొనసాగించారు. కానీ ఆ బస్సుపై శుక్రవారం సాయంత్రం మావోయిస్టులు దాడిచేశారు. జాగర్‌గుండ, జగ్దల్‌పూర్ గ్రామాల మధ్య బస్సును ఆపి, ప్రయాణికులను దింపేసి బస్సును తగులబెట్టారు. దీంతో ఇతర ప్రాంతాలతో ఆ గ్రామస్థులకు సంబంధాలు తెగిపోయాయి. 'మావోయిస్టులు బస్సును తగులబెట్టినట్టు సమాచారం వచ్చింది. మా ఎన్‌కౌంటర్లు విజయవంతం కావడంతో వారు అసంతృప్తిని ఇలా బయటపెట్టారు' అని సుక్మా ఎస్పీ అభిషేక్ మీనా తెలిపారు. జాగర్‌గుండ, జగ్దల్‌పూర్ రోడ్డు నిర్మాణం కోసం మూడేండ్లు పట్టిందన్నారు.

ముంబైలో చిరుతపులి దాడి

- ఏడుగురికి గాయాలు
- హేమమాలిని నివాసం ఉండే కాలనీలో మరో చిరుత సంచారం



ముంబైలో చిరుతపైకి మత్తుతో కూడిన ఇంజెక్షన్ షూట్ చేస్తున్న ఫారెస్ట్ జవాన్

ముంబై: ముంబై శివారు ములుండ్‌లోని నానిపడ కాలనీలో శనివారం ఉదయం 7.15 గంటలకు స్థానికులపై చిరుతపులి దాడిచేసింది. దీంతో ఏడుగురికి గాయాలయ్యాయి. నానిపడ చుట్టూ కొండలు, అడవులు ఉండటంతో ఇండ్లలోకి చిరుత వచ్చిందని అధికారులు చెప్తున్నారు. క్షతగాత్రులను సమీప దవాఖానకు తరలించినట్టు వివరించారు. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన అటవీ శాఖ సిబ్బంది పులిని పట్టుకొని జూకి తరలించారు. మరోవైపు బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని నివాసం ఉంటున్న తూర్పు గోరెగావ్‌లో గురువారం తెల్లవారుజామున ఓ చిరుతపులి సంచరించినట్టు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయింది. ఆ చిరుత ఎవరికీ ఎలాంటి గాయాలు చేయలేదు.. నష్టం చేకూర్చలేదని అధికారులు చెప్తున్నారు. ఆ చిరుతను చూసిన వాచ్‌మెన్ చేతిలో లాఠీ తీసుకొని దాని వెంట పరుగెత్తినట్టు ఫుటేజీలో ఉన్నది. తమ కాలనీలో చిరుతపులి సంచరించడం ఇది తొలిసారి కాదని స్థానికులు చెప్తున్నారు. 2011లోనూ హేమమాలిని బంగ్లా సమీపానికి ఓ చిరుతపులి వచ్చినట్టు తెలిపారు.

లక్నో స్కూల్‌లోకి చిరుత

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలోని ఒక ప్రైవేట్ స్కూల్ ఆవరణలోకి శనివారం చిరుతపులి రావడంతో విద్యార్థులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చలి వల్ల ప్రస్తుతం స్కూల్‌కు సెలవు ఉన్నా ఆ సమయంలో కొందరు ఉపాధ్యాయులు, 50 మంది రెసిడెన్షియల్ విద్యార్థులు స్కూల్‌లోనే ఉన్నారు. అటవీ సిబ్బంది కొన్ని గంటలపాటు కృషి చేసిన తర్వాత చిరుతపులిని పట్టుకున్నారు. 'భవనం పునాదుల కింద దాక్కున్న చిరుతను జాగ్రత్తగా బోనులోకి రప్పించి, తర్వాత లక్నో జూకు తరలించాం' అని జూ డిప్యూటీ డైరెక్టర్ ఉత్కర్ష్ శుక్లా మీడియాకు చెప్పారు.

విద్య, ఉద్యోగ సమాచారం

కెనరా బ్యాంక్‌లో 450 పీవోలు

- ఆన్‌లైన్ పరీక్ష+ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- 9 నెలలు ట్రెయినింగ్+ 3 నెలలు ఇంటర్న్‌షిప్
- ఏడాది పీజీడీబీఎఫ్ కోర్సు తర్వాత పీవో ఉద్యోగం



జాతీయ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంక్‌లోని ఆఫీసు/బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, ఎన్ఐటీటీఈ యూనివర్సిటీతో సంయుక్తంగా ఏడాదిపాటు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నది. ఈ కోర్సుకు ఎంపికైన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ (బెంగళూరు), ఎన్ఐటీటీఈ యూనివర్సిటీ గ్రేటర్ మంగళూరులో ఏదో ఒకచోట ఏడాదిపాటు పీజీడీబీఎఫ్ కోర్సును చదవాల్సి ఉంటుంది. విజయవంతంగా కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) లేదా అసిస్టెంట్ మేనేజర్ స్థాయిలో కెనరాబ్యాంక్‌లో ఉద్యోగావకాశం కల్పిస్తారు.

- **పోస్టు:** ప్రొబేషనరీ ఆఫీసర్
- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్)
- **కాల వ్యవధి:** ఏడాది
- **మొత్తం ఖాళీలు** : 450 (జనరల్-227, ఓబీసీ-121, ఎస్సీ-67, ఎస్టీ-35)
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. 2018 జనవరి 1 నాటికి అభ్యర్థులు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయస్సు:** 2018 జనవరి 1 నాటికి కనిష్ఠంగా 20 ఏండ్లు, గరిష్ఠంగా 28 ఏండ్లలోపు ఉండాలి. అంటే 1988 జనవరి 2 నుంచి 1998 జనవరి 1 మధ్యన జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:**
  జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ. 708/-
  ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ. 118/-
- **కోర్సు ఫీజు:** బోర్డింగ్, లాడ్జింగ్, కోర్సు ఫీజు, ఇతర రుసుములు కలుపుకొని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్‌లో రూ. 3.50 లక్షలు + సర్వీస్ ట్యాక్స్, ఎన్ఐటీటీఈ మంగళూరులో రూ. 3లక్షలు + సర్వీస్ ట్యాక్స్ చెల్లించాలి. ఈ మొత్తాన్ని కూడా తక్కువ వడ్డీకి విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటునందించేదుకుగాను కెనరా బ్యాంక్ 'ఎడ్యుకేషన్ లోన్' రూపంలో ఇస్తుంది.
- **కోర్సు వ్యవధి:** 12 నెలలు. ఏడాదిపాటు కొనసాగే పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) కోర్సును మొదటి 9 నెలలు క్లాస్ రూమ్ ట్రెయినింగ్ స్టడీని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ లేదా ఎన్ఐటీటీఈ యూనివర్సిటీ నిర్వహిస్తాయి. చివరి 3 నెలల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఏదైనా కెనరాబ్యాంక్‌లో చేయాల్సి ఉంటుంది. విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులకు పీజీడీబీఎఫ్ డిప్లొమా సర్టిఫికెట్‌తో పాటు ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఐదేండ్లపాటు సర్వీస్ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు ఆరో సంవత్సరం నుంచి పదో సంవత్సరం వరకు జీతంతోపాటుగా అదనంగా ఏడాదికి లక్ష రూపాయలను కెనరా బ్యాంక్ చెల్లిస్తుంది.
- **పే స్కేల్:** రూ. 23,700-42,020/-
- **ఎంపిక విధానం:** సింగిల్ ఆన్‌లైన్ టెస్ట్+ పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్.
- ఈ ఆన్‌లైన్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

ఆన్‌లైన్ రాతపరీక్ష సిలబస్

సబ్జెక్ట్	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50
ఇంగ్లిష్ లాంగ్వేజ్	50	50
జనరల్ అవేర్‌నెస్	50	50

దీనికి కేటాయించిన సమయం రెండు గంటలు

- ఈ ఆన్‌లైన్ పరీక్షను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ టెస్ట్ (ఐబీపీఎస్) నిర్వహిస్తుంది
- కనీసం కటాఫ్ మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది.
- పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 1/4 మార్కులు కోత విధిస్తారు.
- ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్‌కు కేటాయించిన మొత్తం మార్కులు బ్యాంక్ నిర్ణయిస్తుంది.
- రాతపరీక్ష, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులను కలిపి తుది ఎంపిక చేస్తారు
- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభచూపిన అభ్యర్థులను ప్రకటించిన ఖాళీల సంఖ్యకు 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు.
- ఆన్‌లైన్ పరీక్ష మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల ద్వారా తుది ఫలితాలను ప్రకటిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, తిరుపతితో సహా దేశవ్యాప్తంగా 189 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, విద్యార్హతలు, తదితర వివరాలను ఎంటర్ చేయాలి. నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 31
- **డౌన్‌లోడ్ కాల్‌లెటర్స్:** ఫిబ్రవరి 20 తర్వాత
- **ఆన్‌లైన్ పరీక్షతేదీ:** మార్చి 4
- **వెబ్‌సైట్:** www.canarabank.com.

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్

తమిళనాడులోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ అనుబంధ జనరల్ హాస్పిటళ్లలో ఖాళీగా ఉన్న సీనియర్/జూనియర్ రెసిడెంట్ (తాత్కాలిక ప్రాతిపదికన) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

నవరత్న హోదా పొందిన ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ అనేది గతంలో నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీ)గా పిలువబడేది. దీన్ని 1956లో స్థాపించారు. ఇది సెంట్రల్ గవర్నమెంట్ ఆధీనంలోని లిగ్నైట్ గనులు వెలికితీసి, విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సంస్థ.

- **పోస్టు పేరు:** సీనియర్/జూనియర్ రెసిడెంట్
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 23 పోస్టులు (జనరల్-14, ఓబీసీ -4, ఎస్సీ-3, ఎస్టీ-2)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఎంబీబీఎస్‌తోపాటు సీఆర్ఆర్ఐని పూర్తిచేయాలి. జనరల్ మెడిసిన్/సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, డయాబెటాలజీ, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఓ అండ్ జీ, ఈఎన్‌టీ, రేడియాలజీ, ఆప్తాల్మాలజీ, అనెస్థీషియాలజీ, సైకియాట్రీలో డిప్లొమా/పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణత. జూనియర్ రెసిడెంట్ పోస్టుకు ఎంబీబీఎస్‌తో సీఆర్ఆర్ఐని కూడా పూర్తిచేయాలి.
- **వయస్సు:** సీనియర్ రెసిడెంట్‌కు 30 ఏండ్లు, జూనియర్ రెసిడెంట్‌కు 28 ఏండ్లు మించరాదు.
- **పే స్కేల్:** సీనియర్ రెసిడెంట్‌కు మొదటి ఏడాదికి రూ. 55,000/-, రెండోఏడాదికి రూ. 57,500/-, మూడో ఏడాదికి రూ. 62,500/- చెల్లిస్తారు. జూనియర్ రెసిడెంట్‌కు మొదటి ఏడాదికి రూ. 37,500/-, రెండోఏడాదికి రూ. 40,000, మూడో ఏడాదికి రూ. 45,500/- చెల్లిస్తారు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో దరఖాస్తులను నింపి, ఇంటర్వ్యూ రోజున పరీక్షకు హాజరుకావాలి.
- **చిరునామా:** Industrial medical Centre, NLCIL, General Hospital, Neyveli-607803
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 17
- **వెబ్‌సైట్:** www.nlcindia.com

చెన్నై మెట్రోరైల్‌లో

చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ సైట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.


వివరాలు:

చెన్నై మెట్రోరైల్ ప్రాజెక్టును భారత ప్రభుత్వం, తమిళనాడు సంయుక్తంగా చేపడుతున్నాయి.

- **పోస్టు:** సైట్ ఇంజినీర్ (సివిల్)
- **నోట్:** ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- ఖాళీల సంఖ్య - 8
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 3
- **వెబ్‌సైట్:** http://chennaimetrorail.org

సంబల్‌పూర్ యూనివర్సిటీలో

ఒడిశాలోని సంబల్‌పూర్ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.



- మొత్తం ఖాళీల సంఖ్య: 42
- **విభాగాలు:** ఆంత్రోపాలజీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, ఎర్త్ సైన్స్, లా, లైబ్రేరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లైఫ్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఒడియా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, స్టాటిస్టిక్స్ తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి.
- ప్రొఫెసర్-7 పోస్టులు
- రీడర్-17 పోస్టులు
- **పే స్కేల్:** రూ. 37,400-67,000 + అకడమిక్ గ్రేడ్ పే రూ. 10,000 (రీడర్-రూ.8,000)
- లెక్చరర్-18 పోస్టులు
- **పే స్కేల్:** రూ. 15,600-39,100 + అకడమిక్ గ్రేడ్ పే రూ.6,000/-
- **అర్హతలు:** మాస్టర్ డిగ్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ లేదా నెట్/స్లెట్, నెట్‌లో అర్హత సాధించాలి. సంబంధిత రిసెర్చ్/టీచింగ్ విభాగంలో అనుభవం ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 700, ఎస్సీ, ఎస్టీ, మహిళలు రూ. 350/-
- **ఎంపిక** : రాత పరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు** : ఆఫ్‌లైన్‌లో
- **చివరితేది** : జనవరి 31
- **వెబ్‌సైట్:** www.suniv.ac.in

అమృతలో ఎంబీఏ

అమృత విశ్వవిద్యాపీఠం ఎంబీఏ కోర్సులో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

అమృత విశ్వవిద్యాపీఠం ఒక డీమ్డ్ యూనివర్సిటీ. దీనికి అమృతపురి, బెంగళూరు, కోయంబత్తూరు, కొచ్చిలో క్యాంపస్‌లు ఉన్నాయి.

- **కోర్సు:** ఎంబీఏ/ఎంబీఏ - ఎంఎస్
- **స్పెషలైజేషన్స్:** బిజినెస్ అనలిటిక్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్స్, సిస్టమ్స్
- **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతోపాటు క్యాట్/ఎక్స్‌ఏటీ లేదా జీఆర్ఈ లేదా జీమ్యాట్/మ్యాట్/సీమ్యాట్‌లలో వ్యాలిడ్ స్కోర్ కలిగి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.amrita.edu/mba2018

మిధానిలో మేనేజర్లు

హైదరాబాద్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 2
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్)-1
- సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) -1
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీతోపాటు ఐసీడబ్ల్యూఏ/సీఏ ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 45 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్
- **చివరి తేదీ:** జనవరి 24
- **వెబ్‌సైట్:** www.midhani.com.